thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 237 కరీంనగర్ మంగళవారం, 4 నవంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## రోడ్డు ప్రమాదాలకు ఇకపై కాంట్రాక్టర్‌కు జరిమానా

న్యూఢిల్లీ : రోడ్డు ప్రమాదాలు, మరణాలను తగ్గించేందుకు జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. బీవోటీ (నిర్మాణం-నిర్వహణ-బదిలీ) పద్ధతిలో నిర్మించిన జాతీయ రహదారుల నిర్దిష్ట పరిధిలో (500 మీటర్లు) ఏడాదిలో ఒకటి కంటే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరిగితే కాంట్రాక్టర్లపై రూ. 25 లక్షల జరిమానా విధించను న్నట్లు ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ బీవోటీ డాక్యుమెంట్‌ను సవరించిందని రోడ్డు రవాణా, హైవేల శాఖ కార్యదర్శి వి. ఉమాశంకర్ తెలిపారు. కాంట్రాక్టర్లు రోడ్డు ప్రమాదాలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఒక ఏడాదిలో హైవేలోని నిర్దిష్ట పరిధిలో ఒకటి కంటే ఎక్కువసార్లు రోడ్డు ప్రమాదాలు జరిగితే సదరు కాంట్రాక్టర్ రూ. 25 లక్షలు జరిమానాగా చెల్లించాలని, తర్వాతి ఏడాది కూడా ప్రమాదా లు పునరావృతమైతే ఫైన్ రూ. 50 లక్షలకు పెరుగుతుందని తెలిపారు. హైవేల మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా 3,500 రోడ్డు ప్రమాదాల స్ట్రెచ్‌లను గుర్తించిందన్నారు.



## కంకర క్రింద నలిగిన బ్రతుకులు

# దూసుకొచ్చిన... మృత్యువు

## ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన టిప్పర్ లారీ

## ఇరువురు డ్రైవర్లు సహా 19 మంది మృతి!

## రంగారెడ్డి జిల్లా చేవెళ్ళ సమీపంలో ఘటన

చేవెళ్ల గ్రామీణం: రంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. తాండూరు డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సును కంకర లోడుతో వెళ్తున్న లారీ ఢీకొట్టింది. చేవెళ్ల మండలం మీర్జాగూడ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. బస్సుపై కంకర లోడు పడిపోవడంతో పలువురు ప్రయాణికులు దానికింద కూరుకుపోయారు. ఈ ప్రమాదంలో 19 మంది మృతి చెందగా.. 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఇప్పటి వరకు తెలిసిన సమాచారం ప్రకారం.. మృతుల్లో 10 మంది మహిళలు, 8 మంది పురుషులు, ఒక చిన్నారితోపాటు మరికొందరు ఉన్నారు. ప్రమాద సమయంలో ప్రయాణికుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతం హృదయ విదారకంగా మారింది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మూడు జేసీబీల సాయంతో సహాయక చర్యలు చేపట్టారు. కంకరలో కూరుకుపోయిన వారిని బయటకు తీస్తున్నారు. క్షతగాత్రులను చేవెళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరో నలుగురు మృతి చెందారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముంది.

## రోడ్డు ప్రమాదంలో 19 మంది దుర్మరణం

**బస్సులో 72 మంది ప్రయాణికులు!...** టీఎస్ 34 టీఏ 6354 నంబరు గల ఆర్టీసీ బస్సు తాండూరు నుంచి హైదరాబాద్ వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. తాండూరులో ఉదయం 4.40 గంటలకు బస్సు బయల్దేరింది. అక్కడ 30 మందికి పైగా ఉద్యోగులు, కళాశాలలకు వెళ్లే ఉద్యోగులు ఎక్కారు. మొత్తంపై బస్సులో సుమారు 72 మంది ప్రయాణికులు ఉన్నారు. విద్యార్థులు హైదరాబాద్‌లోని పలు కళాశాలల్లో చదువుతున్నట్లు సమాచారం. ఆదివారం సెలవు కావడంతో ఇళ్లకు వెళ్లి.. తిరిగి నగరానికి వస్తుండగా ఈ ఘటన జరిగింది. రోడ్డు ప్రమాదంతో హైదరాబాద్-బీజాపూర్ హైవేపై భారీగా ట్రాఫిక్‌జామ్ అయింది. చేవెళ్ల-వికారాబాద్ మార్గంలో పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి.

**15 మంది ప్రయాణికులను రక్షించిన పోలీసులు...** ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు 15 మంది ప్రయాణికులతో పాటు బస్సు కండక్టర్ రాధను పోలీసులు రక్షించారు. కండక్టర్‌కు గాయాలు కావడంతో ఆమెను ఆస్పత్రికి తరలించారు. సహాయక చర్యలు జరుగుతున్న సమయంలో చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్‌పైకి జేసీబీ ఎక్కడంతో ఆయన ఎడమ కాలికి గాయమైంది. సీఐను చేవెళ్ల ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.




హైదరాబాద్, నవంబర్ 3: ఇటీవలే మొంథా తుఫాన్ కారణంగా తెలంగాణలోని పలు జిల్లాలు చిగురుటాకులా వణికిపోయాయి. వరంగల్, హన్మకొండ జిల్లాలు నీట మునిగాయి. ఆ తుఫాన్ నుంచి జనాలు ఇప్పుడిప్పుడే మెల్లమెల్లగా కోలుకుంటున్నారు. ఈ క్రమంలోనే తెలంగాణ వాసులకు మరో బిగ్ అలర్ట్ వచ్చింది. హైదరాబాద్ వాతావరణ శాఖ రాష్ట్రానికి మరోసారి వర్ష సూచనలు జారీ చేసింది. రానున్న మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. వాతావరణ శాఖ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం విదర్భ, ఆ పరిసర ప్రాంతంలో కొనసాగిన ఉపరితల ఆవర్తన ద్రోణి సోమవారం నాటికి బలహీనపడింది. ఈ కారణంగా తెలంగాణలోని పలు జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది. అయితే ఇప్పటికే భాగ్యనగరంతో సహా పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం మధ్యాహ్నం సమయంలో హైదరాబాద్ లో అకస్మాత్తుగా వర్షం కురిసింది. దీంతో వాహనదారులు ట్రాఫిక్ లో ఇబ్బందులు పడ్డారు. మంగళ, బుధ వారాల్లో కూడా రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. అలాగే మరికొన్ని జిల్లాల్లో ఉరుములు మెరుపులు, 30 నుంచి 40 కి.మీ. వేగం కలిగిన ఈదురు గాలులతో కూడిన వానలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. మొంథా తుఫాన్ కారణంగా పలు ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా పంట పొలాలు నీట మునిగి.. రైతులు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొన్నారు. ఇలాంటి నష్టం మరోసారి జరగకుండా రైతులు ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. పంట పొలాల వద్ద కల్లాల్లో ధాన్యం ఉంటే వాటిని వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు. అత్యవసరమైతే తప్ప.. బయటకు, పొలాలకు వెళ్లొద్దని సూచిస్తున్నారు.

## భారత్ టెక్ పవర్‌హౌస్‌గా ఎదిగేందుకు ప్రైవేటు పెట్టుబడులు: ప్రధాని మోదీ



భారత్ అత్యంత క్లిష్టమైన, అధిక ప్రభావం చూపే పరిశోధన అభివృద్ధి ప్రాజెక్టులకు మద్దతిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీ రంగం మరింత అభివృద్ధి చెందడానికి, భారత్ టెక్ పవర్‌హౌస్‌గా ఎదగడానికి ఈ రంగంలో ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. న్యూదిల్లీలోని భారత్ మండపంలో రూ.లక్ష కోట్ల పరిశోధనాభివృద్ధి ఫండ్‌ను ప్రారంభించిన అనంతరం మోదీ ప్రసంగించారు. దేశంలో ఆధునిక ఆవిష్కరణలను మరింత పెంచడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం భారతదేశ పరిశోధన, అభివృద్ధి వ్యయం రెట్టింపు చేశామన్నారు. ఈ చర్యలు భవిష్యత్ ఆవిష్కరణలపై తమ నిబద్ధతను తెలియజేస్తున్నాయన్నారు. విశ్వవిద్యాలయాలలో పరిశోధన, ఆవిష్కరణలను పెంచడానికి, కొత్త అవకాశాలు సృష్టించడానికి ప్రభుత్వం అనుసంధాన్ రీసెర్చ్ ఫౌండేషన్‌ను స్థాపించిందని ప్రధాని పేర్కొన్నారు. అంతరిక్ష పరిశోధనల్లోనూ భారత్ పురోగతి సాధిస్తోందన్నారు. ఈ రంగంలో అందిస్తున్న సేవలకుగానూ ఇస్రో శాస్త్రవేత్తలను కొనియాడారు. దేశంలో ఆవిష్కరణలు సమగ్రంగా మారినప్పుడు, సాంకేతికత పరివర్తన చెందినప్పుడు గొప్ప విజయాలకు పునాది పడుతుందని మోదీ అన్నారు. ప్రైవేటు రంగాన్ని పరిశోధనల వైపు ప్రోత్సహించేందుకు ప్రస్తుతం రూ.లక్ష కోట్ల పరిశోధనాభివృద్ధి ఫండ్‌ను ఏర్పాటుచేసినట్లు తెలిపారు.

**భారత పుత్రికలు చరిత్ర సృష్టించారు: ప్రధాని మోదీ**... క్రికెట్‌లో భారత పుత్రికలు చరిత్ర సృష్టించారని ప్రధాని నరేంద్రమోదీ హర్షం వ్యక్తంచేశారు. ఈ విజయం దేశ మహిళల్లో ఆత్మవిశ్వాసానికి చిహ్నమని అభివర్ణించారు. భారత మహిళా జట్టు తొలిసారి వన్డే ప్రపంచకప్ విజేతగా నిలవడంపై ఈ విధంగా స్పందించారు. బిహార్ లోని సహర్సాలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ.. ఎన్డీయే అంటే వికాసమని, మహాగత్ బంధన్ అంటే వినాశనమని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో మరోసారి ఏన్డీయే ప్రభుత్వం ఏర్పడేలా తొలిసారి ఓటువేసే వారు తమ హక్కును వినియోగించుకోవాలని కోరారు. "నేను విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు అక్కడి నేతలకు మఖానా బాక్స్‌లను కానుకగా అందజేశాను. ఇది బిహార్ కార్మికుల శ్రమకు నిదర్శనమని చెప్పాను. అలాగే కోసి నది వరదల ప్రభావాన్ని తగ్గించేలా శాశ్వత పరిష్కారం కోసం మేం కృషి చేస్తున్నాం" అని మోదీ అన్నారు. ఆర్జేడీ 'జంగల్ రాజ్'లో పోలీసులు కూడా సురక్షితంగా లేరని, చట్టాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకున్న డీఎస్పీ సత్యపాల్‌సింగ్‌ను హత్య చేశారని విమర్శించారు.

# రాజకీయ దురుద్దేశంతోనే ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును పక్కకు పెట్టారు..

## ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రాంతంపై సీఎం రేవంత్‌రెడ్డి జియో ఫిజికల్ సర్వే

నాగర్ కర్నూల్ జిల్లా : రాజకీయ దురుద్దేశంతోనే కేసీఆర్ హయాంలో ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును పక్కకు పెట్టారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తప్పులు చేసి.. అప్పులు చేసి దోపిడీ చేశారనే కారణంతోనే ప్రజలు బీఆర్ఎస్‌ని పక్కన బెట్టారని ఆరోపించారు. ఈ ప్రాజెక్టు పూర్తి చేయకపోతే తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ నేతలని క్షమించరని హెచ్చరించారు.

ఎట్టి పరిస్థితుల్లోనైనా ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ని తమ ప్రభుత్వంలో పూర్తి చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎస్ఎల్‌బీసీ విషయంలో తమ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు చిల్లర మాటలు మానుకోవాలని హితవు పలికారు. నాగర్ కర్నూల్ జిల్లాలోని ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రాంతంపై సీఎం రేవంత్‌రెడ్డి జియో ఫిజికల్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మన్నెవారిపల్లిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడారు.

**ఏ ప్రాజెక్టునూ కేసీఆర్ పూర్తి చేయలేదు..** గత పదేళ్లలో ఏ ప్రాజెక్టునూ కేసీఆర్ పూర్తి చేయలేదని మండిపడ్డారు. ఇప్పుడు ఆయా ప్రాజెక్టులపై ఏపీ అభ్యంతరం చెబుతోందని పేర్కొన్నారు. కేసీఆర్ నిర్వాకం వల్లే ఆంధ్రప్రదేశ్‌కు అలుసైపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉండి ఉంటే టన్నెల్ పనులు ఎప్పుడో పూర్తయ్యేవని చెప్పుకొచ్చారు. ఎస్ఎల్‌బీసీని గత కేసీఆర్ ప్రభుత్వం గాలికొదిలేసిందని ధ్వజమెత్తారు. కమీషన్లు రావని మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ఎస్ఎల్‌బీసీని పట్టించుకోలేదని ఫైర్ అయ్యారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో 10 కిలోమీటర్లు కూడా టన్నెల్ పనులు పూర్తికాలేదని చెప్పుకొచ్చారు. టన్నెల్ పూర్తి చేస్తే కాంగ్రెస్‌కు పేరొస్తుందనే కారణంతోనే గాలికొదిలేశారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. 30 టీఎంసీల తరలింపు, 3 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో 1983లో ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు మంజూరైందని గుర్తుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్

## కేసీఆర్‌పై సీఎం రేవంత్ ఫైర్

రాష్ట్రంలో 2004లో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఎస్ఎల్‌బీసీ టన్నెల్-1, టన్నెల్-2 పనులను ప్రారంభించారని చెప్పుకొచ్చారు. రూ. 1968 కోట్లతో టెండర్లు పిలిచారని గుర్తుచేశారు. ఈ దేశంలోనే తొలిసారిగా ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌కు టన్నెల్ బోర్ మిషన్‌ని ఉపయోగించారని వివరించారు. 2014 వరకు కిలోమీటరు వరకు టన్నెల్ పనులు పూర్తి అయ్యాయని తెలిపారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తర్వాత కేసీఆర్ హయాంలోని పదేళ్లలో పది కిలోమీటర్ల వరకు కూడా ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. ఇప్పుడు తమ ప్రభుత్వంలో గ్రావిటీ ద్వారా నల్గొండకు నీళ్లు తీసుకెళ్లాలనుకుంటే అడ్డంకులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు సీఎం రేవంత్‌రెడ్డి.

**తెలంగాణకు రికార్డు..** ప్రపంచంలో 40 కిలోమీటర్ల టన్నెల్ ఎక్కడా లేదని చెప్పుకొచ్చారు. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు పూర్తయితే తెలంగాణకు ఆ రికార్డు దక్కుతుందని ఉద్ఘాటించారు. ఆనాడు రూ. 2 వేల కోట్ల ఖర్చుతో ఈ ప్రాజెక్టు పూర్తయ్యేదని స్పష్టం చేశారు. ఇప్పుడు పెరిగిన అంచనాలతో రూ. 4600 కోట్ల మేర ఖర్చవుతోందని తెలిపారు. కేసీఆర్ హయాంలో ఈ ప్రాజెక్టును పూర్తి చేయకపోవడమే కాదని.. కృష్ణా నదిపై ఏ ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేశారని ధ్వజమెత్తారు. కేసీఆర్ పదేళ్లలో రూ. 1.86 లక్షల కోట్లు కాంట్రాక్టర్లకు ఇచ్చారని ఫైర్ అయ్యారు. అందులో రూ. 1.5 లక్షల కోట్లు కాళేశ్వరం కోసమే ఖర్చు చేశారని మండిపడ్డారు. కృష్ణాలో తెలంగాణ వాటాని మనం తీసుకోకపోవడం వల్ల ఆ నీటిని ఆంధ్రప్రదేశ్ తరలించుకుపోతోందని చెప్పుకొచ్చారు. 299 టీఎంసీలు చాలని ఆనాడు హరీశ్‌రావు సంతకం పెట్టి వచ్చారని ధ్వజమెత్తారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.



చురకలు






దేశాన్ని, బిహార్‌ను అవమానించారంటూ ప్రతిపక్ష నేతలందరిపై ప్రధాని నరేంద్ర మోదీ ముద్ర వేస్తున్నారని కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ విమర్శించారు. దీనికోసం కేంద్రంలో కొత్తగా 'అవమానాల మంత్రిత్వశాఖ'ను ఏర్పాటు చేయాలంటూ ఎద్దేవా చేశారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సోన్‌బర్సాలో నిర్వహించిన ప్రచార సభలో ఈమేరకు ప్రసంగించారు. ప్రధాని అనవసర విషయాలన్నీ మాట్లాడుతున్నారని, కానీ.. రాష్ట్రంలో ఎన్డీయే సర్కారు అవినీతి, దుష్పరిపాలనపై మాత్రం నోరు మెదపడం లేదన్నారు. "అభివృద్ధి గురించి మాట్లాడటానికి బదులుగా.. ప్రతిపక్ష నేతలు దేశాన్ని, బిహార్‌ను అవమానిస్తున్నారంటూ ప్రధాని మోదీ పదేపదే ఆరోపిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ వ్యవహారాలపైనే ఎక్కువ దృష్టి సారించినట్లు కనిపిస్తోంది. కాబట్టి.. దీని కోసం నూతనంగా 'అవమానాల శాఖ'ను ఏర్పాటు చేయాలి" అని ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో రాష్ట్రానికి వరాలు ప్రకటించే ముందు.. గత 20 ఏళ్లలో ఎన్డీయే సర్కారు ఏం చేసిందో మోదీ, అమిత్ షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బిహార్ ప్రభుత్వాన్ని నీతీశ్ కుమార్ నడపడం లేదని.. ప్రధాని, ఇతర వ్యక్తులు దిల్లీ నుంచి రిమోట్ కంట్రోల్ ద్వారా నియంత్రిస్తున్నారని ప్రియాంక పేర్కొన్నారు. ప్రజల ఓటు హక్కును లాక్కొనేందుకు చూస్తున్నారని ఆరోపించారు. స్థానికంగా ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతోనే యువత ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సి వస్తోందన్నారు. ఉపాధి కల్పించే ప్రభుత్వ రంగ సంస్థలను భాజపా సన్నిహిత కార్పొరేట్‌లకు అప్పగించారని ఆరోపించారు. ఇదిలా ఉండగా.. ఛఠ్ పూజ, మహా కుంభమేళాలను ప్రతిపక్ష నేతలు అవమానించారంటూ ప్రధాని మోదీ ఆదివారం ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ప్రియాంక గాంధీ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.




తాండూరు పట్టణం: రంగారెడ్డి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదం ఓ కుటుంబంలో అంతులేని విషాదం నింపింది. వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన ఎల్లయ్య గౌడ్ ముగ్గురు కుమార్తెలు ఈ ప్రమాదంలో మృతిచెందారు. అక్కాచెల్లెళ్లు తనూష, సాయి ప్రియ, నందిని మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. హైదరాబాద్‌లోని కోఠి మహిళా కళాశాలలో చదువుతున్న ముగ్గురూ.. గత నెల 15న జరిగిన ఓ పెళ్లివేడుకలో సందడిగా గడిపారు. తల్లిదండ్రులతో పాటు బంధువులు ఘటనాస్థలికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. ఎల్లయ్యగౌడ్ డ్రైవర్‌గా పనిచేస్తూ పిల్లల్ని చదివించారు. ఆయనకు నలుగురు కుమార్తెలు. ఒక కుమార్తెకు వివాహం కాగా.. మిగిలిన ముగ్గురు కుమార్తెలు ఇవాళ జరిగిన రోడ్డు ప్రమాదంలో విగత జీవులుగా మారడంతో ఆ కుటుంబం, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. మరోవైపు యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్‌కు చెందిన అఖిలరెడ్డి అనే యువతి కూడా ఇదే ప్రమాదంలో చనిపోయారు. ఎంబీఏ చదువుతున్న కుమార్తె మృతితో అఖిల తల్లి, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఘటనాస్థలానికి వచ్చి బోరున విలపించారు.




హైదరాబాద్: రంగారెడ్డి జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనాస్థలిలో సహాయక చర్యలు ముమ్మరం చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రమాద వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేయాలని జిల్లా అధికారులకు సూచించారు.

క్షతగాత్రులను హైదరాబాద్‌కు తరలించి మెరుగైన వైద్యం అందించాలని సీఎస్, డీజీపీని ఆదేశించారు. అందుబాటులో ఉన్న మంత్రులు ఘటనాస్థలికి వెళ్లి పర్యవేక్షించాలని కోరారు. క్షతగాత్రులకు తగిన వైద్యం అందించేందుకు గాంధీ, ఉస్మానియా ఆసుపత్రుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సీఎం అదేశించారు. పరిస్థితి విషమంగా ఉన్న వారందరినీ కాపాడేందుకు వైద్య బృందాలను అందుబాటులో ఉంచాలని.. హెల్త్ ఎమర్జెన్సీ తరహాలో అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ రోడ్డు ప్రమాదంపై మంత్రి పొన్నం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంపై ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో మంత్రి ఫోన్‌లో మాట్లాడారు. ఆర్టీసీ అధికారులు హుటాహుటిన ఘటనాస్థలికి వెళ్లాలని ఆదేశించారు. ఈ ఘటనపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఘోర రోడ్డు ప్రమాదంపై ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.


మృతుల కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు.




చేవెళ్ల: రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలో చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాద ఘటనపై విచారణకు ఆదేశించినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు పరిహారం ప్రకటించినట్లు వెల్లడించారు. చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శించిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. 'ఈ బస్సు ప్రమాదంలో 19 మంది చనిపోయారు. మృతదేహాలకు పోస్టుమార్టం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో జరుగుతోంది. మృతుల్లో పది మంది మహిళలు, 8 మంది పురుషులు, ఒక చిన్నారి ఉన్నారు. 19 మందిలో 13 మృతదేహాలను పోలీసులు గుర్తించారు. వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, క్షతగాత్రులకు రూ. 2 లక్షల పరిహారం ప్రకటించాం. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందిస్తున్నాం" అని మంత్రి తెలిపారు.

## రంగారెడ్డి జిల్లాలో రోడ్డు ప్రమాదం.. ప్రధాని తీవ్ర దిగ్భ్రాంతి



దిల్లీ: తెలంగాణలోని చేవెళ్లలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. క్షతగ్రాతులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50 వేల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు.

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాగూడ సమీపంలో చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో 19 మంది మృతి చెందారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు.

## పత్తి కొనుగోళ్లలో సీసీఐ నిబంధనలు మార్చండి.. కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖ



హైదరాబాద్: పత్తి కొనుగోళ్లలో సీసీఐ విధించిన నిబంధనలు మార్చాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రాన్ని కోరారు. ఎకరాకు 7 క్వింటాళ్ల పత్తి మాత్రమే కొనుగోలు చేయాలన్న సీసీఐ కొత్త నిబంధన నేపథ్యంలో కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్, సీసీఐ సీఎండీ లలిత్‌కుమార్ గుప్తాకు లేఖ రాశారు. సాధారణంగా ఇప్పటి వరకు ఎకరాకు 12 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేస్తుండగా.. ఎకరాకు 11.74 క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడులు ఉన్నట్లు జిల్లా కలెక్టర్ల నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం డిక్లరేషన్ ఇచ్చిందని ఆ లేఖలో ప్రస్తావించారు. "ఈ ఏడాది అధిక వర్షాల వల్ల పత్తి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.

ఈ నేపథ్యంలో సీసీఐ తీసుకొచ్చిన కొత్త నిబంధన పత్తి రైతులకు నష్టం చేసేలా ఉంది. తేమ శాతం విషయంలో 20శాతం వరకు ఉన్నా సరే పత్తి పంట సీసీఐ కొనుగోలు చేయాలి. కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన లేకపోవడం వల్ల కూడా పత్తి రైతులకు ఇబ్బందులు తలెత్తాయి. రాష్ట్ర రైతాంగ ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకుని 7 క్వింటాళ్ల నిబంధన ఎత్తి వేసి పాత పద్ధతిలో పత్తి కొనుగోళు చేయాలి. జిన్నింగ్ మిల్లర్ల సమస్యలను కూడా వెంటనే పరిష్కరించాలి"అని మంత్రి తుమ్మల కేంద్రానికి రాసిన లేఖలో పేర్కొన్నారు.




## ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులపై సీఎం రేవంత్‌రెడ్డి స్పెషల్ ఫోకస్

నాగర్ కర్నూల్ జిల్లా, నవంబరు3 : ఎస్ఎల్‌బీసీ టన్నెల్ సర్వే పనులపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఇందులో భాగంగానే ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులను చేపట్టేందుకు అత్యంత కీలకమైన ఏరియల్ ఎలక్ట్రోమాగ్నెటిక్ సర్వేని ఈరోజు(సోమవారం) నుంచి ప్రారంభించనున్నారు సీఎం రేవంత్‌రెడ్డి. తొలిరోజు సర్వేను స్వయంగా పరిశీలించేందుకు ముఖ్యమంత్రి బేగంపేట నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్దకి బయలుదేరారు. సీఎం వెంట మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఉన్నారు. ముందుగా నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం మన్నెవారిపల్లికి సీఎం, మంత్రులు చేరుకుంటారు.

అక్కడ హెలీ మాగ్నెటిక్ సర్వేకు సిద్ధంగా ఉన్న సర్వే హెలికాప్టర్‌ని.. అందులో ఉన్న అధునాతన పరికరాలను ముఖ్యమంత్రి, మంత్రులు పరిశీలిస్తారు. అక్కడే సర్వే హెలికాప్టర్‌కి జెండా ఊపి టేకాఫ్ సిగ్నల్ ఇస్తారు ముఖ్యమంత్రి. మన్నెవారిపల్లె సమీపంలో ఎస్ఎల్‌బీసీ అవుట్ లెట్ వైపు నుంచి ఈ సర్వేని ప్రారంభించనున్నారు. ముఖ్యమంత్రి, మంత్రులున్న హెలికాప్టర్ కూడా సర్వే హెలికాప్టర్‌తో పాటు బయలుదేరి సమాంతరంగా కొన్ని కిలోమీటర్ల దూరం వరకు ప్రయాణించనుంది. ఏరియల్ వ్యూ నుంచే సర్వే చేస్తున్న విధానాన్ని ముఖ్యమంత్రి, మంత్రులు పరిశీలిస్తారు. ఎన్‌జీఆర్ఐ ఆధ్వర్యంలో ఈ హెలిబోర్న్ మాగ్నెటిక్ సర్వే జరుగనుంది. హెలికాప్టర్‌కు అమర్చిన స్పెషల్ ట్రాన్స్‌మీటర్‌తో ఈ సర్వేని చేపట్టనున్నారు. అలాగే, భూమిలో 1000 మీటర్ల లోతు వరకు జియోలాజికల్ డేటాను సేకరిస్తారు. భూమి లోపల ఉండే షీర్‌జోన్లు, నీటి ప్రవాహాలని గుర్తించేందుకు ఇది హైటెక్ సర్వే పద్ధతి అని అధికారులు చెబుతున్నారు.




## పత్తి రైతులను తేమ పేరిట మోసం చేస్తున్నారు: కవిత

ఆదిలాబాద్, నవంబర్ 3: రాష్ట్రంలో పత్తి రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని.. తేమ పేరిట రైతులను మోసం చేస్తున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. వేరే దిక్కు లేక రైతులు ప్రైవేటుకు అమ్ముకుంటున్నారని చెప్పారు. ఇక్కడ బీజేపీ ఎమ్మెల్యే, ఎంపీలు ఉండి కూడా రైతులకు ప్రయోజనం లేకుండా పోయిందని ఫైర్ అయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ప్రచారం ఆపేసి రైతుల సమస్యలపై దృష్టి సారించాలన్నారు. తేమతో సంబంధం లేకుండా గిట్టుబాటు ధరకు సీసీఐ పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కవిత జాగృతి జనం బాట కార్యక్రమం ఆదిలాబాద్‌కు చేరుకుంది. షెడ్యూల్ ప్రకారం ఇవాళ ఆమె ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పర్యటించారు. ఈ మేరకు కవితకు సంప్రదాయ వాయిద్యాలు, గుస్సాడీ నృత్యాలతో ఆదివాసీలు, తెలంగాణ జాగృతి నాయకులు ఘన స్వాగతం పలికారు. జిల్లా కేంద్రంలో ఆదివాసీల ఆరాధ్య దైవం కొమురం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె ఆదివాసీల, రైతుల సమస్యలపై మాట్లాడారు.





వరంగల్ : కాల్పుల విరమణపై మావోయిస్టు పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ రాష్ట్రంలో మరో ఆరు నెలల పాటు కాల్పుల విరమణను పొడిగిస్తూ మావోయిస్టు పార్టీ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) తెలంగాణ రాష్ట్ర కమిటీ పేరుతో లేఖ విడుదలైంది. తెలంగాణలో శాంతియుత వాతావరణం కొనసాగాలని పెద్ద ఎత్తున ఉద్యమాలు జరిగాయని.. అందుకు తెలంగాణ సర్కార్ కూడా స్పందించిందని పేర్కొంది. ఈక్రమంలో గత మే నెలలో ఆరు నెలల పాటు కాల్పుల విరమణను ప్రకటించామని తెలిపింది. ఇదే విధంగా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మరో 6 నెలల పాటు కాల్పుల విరమణను ప్రకటిస్తున్నట్లు మావోయిస్టు పార్టీ లేఖలో వెల్లడించింది.

**లేఖలో ముఖ్యాంశాలు:** కాల్పుల విరమణను మరో 6 నెలల పాటు కొనసాగిస్తున్నామని.. గత ఏప్రిల్, మే, జూన్ నెలల్లో తెలంగాణ రాష్ట్రంలో అన్ని పార్టీలు, ప్రజాసంఘాలు, సామాజిక వర్గాలు శాంతియుత వాతావరణం కొనసాగాలని పెద్దఎత్తున ఉద్యమాలు చేశారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా స్పందించింది. ఈ క్రమంలో గత మే నెలలో తాము 6 నెలల పాటు కాల్పుల విరమణను ప్రకటించాం. ఈ 6 నెలల కాలంలో అనుకున్న పద్ధతులను మా వైపు నుంచి అమలు జరిపి శాంతియుత వాతావరణం కొనసాగేలాగా వ్యవహరించాం. ఇదే శాంతియుత వాతావరణం కొనసాగాలని తెలంగాణ సమాజం కోరుకుంటోంది. కావున ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మరో 6 నెలల పాటు కాల్పుల విరమణను ప్రకటిస్తున్నాం. గతంలో కొనసాగిన విధంగానే మా వైపు నుంచి శాంతియుత వాతావరణాన్ని కొనసాగించేందుకు కృషిచేస్తాం. ప్రభుత్వం వైపు నుంచి కూడా గతంలో వ్యవహరించిన విధంగానే ఉండాలని కోరుతున్నాం. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న శాంతియుత వాతావరణాన్ని భంగం చేసేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఇటువంటి ప్రయత్నాలకు వ్యతిరేకంగా అన్ని పార్టీలు, అన్ని సామాజిక వర్గాలు, సంఘాలు, విద్యార్థులు, మేధావులు, ప్రజాస్వామికవాదులు ముక్త కంఠంతో కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాలకు వ్యతిరేకంగా పోరాడాలని కోరుతున్నట్లు మావోయిస్టు అధికార ప్రతినిధి జగన్ పేరుతో లేఖ విడుదల అయ్యింది.

# అపర అన్నవరం...మరో శబరి మల

## - గూడెం సత్యనారాయణ స్వామి కార్తీక పౌర్ణమి జాతర





"శ్రీ రత్నగిరీశాయ గౌతమీ తీరవాసినే, ఆదినారాయణాయ శ్రీసత్య దేవాయ మంగళమ్", తెలంగాణ ప్రాంతంలోనే అరుదైనదై, పవిత్ర గోదావరి నదీ తీరాన గుట్టపై వెలసి, సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ధర్మపురికి 11కిలో మీటర్ల దూరాన మంచిర్యాల జిల్లా సరిహద్దున దండేపెల్లి మండలం గూడెం వద్ద భక్తుల పాలిటి వరదునిగా వాసి కెక్కిన సర్వజన బాంధవుడైన గూడెం రమా సహిత సత్యనారాయణ స్వామి కార్తీక పౌర్ణమి జాతర వేడుకలు నవంబర్ 3 నుండి అత్యంత వైభవంగా జరుగ నున్నాయి. పూర్వము గూడెం గ్రామ వాస్తవ్యుడైన శ్రీ గోవర్ధన పెరుమాండ్ల స్వామి అనే చాత్తాద శ్రీ వైష్ణవునికి శ్రీ స్వామి, స్వప్న దర్శనం గావించి, మీగ్రామ శివారు రాట్నపు చెవులు కొండపై వెలిశాను అని చెప్పారట.

అది స్వప్నమే కదా! అని విశ్వసించక మిన్నకుండి నాడట. కాని మరునాడు స్వప్నములో మళ్ళీ స్వామి రావడంతో... పెరుమాండ్ల స్వామి కొండ ఎక్కి, స్వామి వెలసిన చోటు కోసం వెతక నారంభించి తిరిగి తిరిగి ఎంత వెతికినా 'జాడ తెలియక పోవడంతో సాయంత్రం ఇంటి కేగి నిద్రకు ఉపక్రమించగా, నీవుండే జాడ తెలుసుకునేంత జ్ఞానము నాకెక్కడిది స్వామి? నన్ను మన్నించి దర్శనమివ్వు! అని మనసులో తలచుకొని నిద్రించడం జరిగింది. ఆ రాత్రి స్వప్నములో స్వామి అగుపించి ఆ కనపడుతున్న అదే రాట్నపు చెవుల కొండపై ఒక చిన్ననీటి కొలను (సారితే) దానికి దగ్గరగా ఉత్తర దిశలో ఉన్న గుహలో నేనున్నాను అని చెప్పి అదృశ్యమైనాడు. తెల్ల వారగానే ఆతృత పట్ట జాలక కొండపై వేగి కలలో అగుపించిన గుహలో వెదికితే, గుహలో చిన్న విగ్రహం దర్శన మిచ్చింది. విగ్రహన్ని వెంటనే పెరుమాళ్లు పరుగున వెళ్ళి గోదావరిలో శుచిగా స్నానమాచరించి పూజా ద్రవ్యాలతో కొండ చేరుకొని విగ్రహమున్నచోట శుభ్రపరచి స్వామివారికి అభిషేకాదులు, పూజలు జరిపి నైవేద్యం పెట్టగా, విషయం తెలుసుకున్న . గ్రామ ప్రజలు కొండను చేరుకొని స్వామి దర్శనం చేసుకున్నారు. దైవ ప్రభావము చేత వారి కోరికలన్నియు తీరాయట. ఇలా కొండ పై దేవుడు వెలిశాడన్న వార్త ఊరూరా పాకి అందరూ దర్శనానికి రావడం మొక్కడము భక్తుల కోర్కెలు తీరడము, పెరుమాండ్లు ప్రతి రోజు స్వామి వారికి పూజాధికాలు, నిర్వహించడము ద్వారా స్వామి మహత్యము తొందరలో అందరికి తెలిసి పోవడము జరిగింది. రోజులు గడిచిన కొలది శ్రీ పెరుమాండ్లు స్వామి ఆలోచించి శ్రీ సత్యనారాయణ స్వామి, రమాదేవి విగ్రహాలు పెద్దవి చేయించి భక్తుల సహకారముతో ఆలయ నిర్మాణము గావించి శ్రీ క్రోధి నామ సంవత్సర మాఘ శుద్ధ దశమి (1964) లో విగ్రహా ప్రతిష్ట చేశారు. కొండ పైకి వెళ్ళుటకై దారి, మంచి నీటి బావి త్రవ్వించారు. నాటి నుండి అసంఖ్యాక భక్తుల కోర్కెలు తీర్చుతూ శ్రీ స్వామి వారు నిత్య వినూత్న కళలతో వెలుగొందు చున్నాడు. ఈ దేవాలయము తెలంగాణలో ఎంతో ప్రసిద్ధి గాంచిన ఏకైక శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయము. కొండకు దాదాపు 1.కి.మీ. దూరాన పరమ పవిత్రమైన గోదావరి నది ప్రవహిస్తున్నది. భక్తులు అందు స్నానమాచరించి శ్రీ స్వామి వారిని దర్శించుకొనుట పరిపాటి. ఈ దేవస్థానములో ఎక్కువ సంఖ్యలో శ్రీ స్వామి వారి వ్రతమును చేసుకుంటారు. కుంకుమార్చనలు, అష్టోత్తరములు, అభిషేకము, హారతులు, ఇత్యాది అర్చనలు చేయించుకొని భక్తులు భగవదనుగ్రహ పాత్రులు అవుతున్నారు. గోదావరి తీరాన ఒక గుట్టపై సత్యనారాయణ స్వామి, అదే ప్రాంతంలో పక్కన ఎత్తైన ప్రదేశంలో అయ్యప్ప స్వామి వెలసి, తెలంగాణలో అపర అన్నవరంగా, మరో శబరిమలైగా పెరిన్నకగన్న గూడెం గుట్ట విశేష ప్రాధాన్యత కలిగి ఉంది. కార్తీక పౌర్ణమి జాతర నిర్వహణకై దేవస్థానం వ్యవస్థాపక కుటుంబ సభ్యులు, అర్చకులు, కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యక్రమాల నిర్వహణకై తగు ఏర్పాట్లు గావిస్తున్నారు. మారహిత శ్రీసత్యనారాయణ స్వామి ఆలయంలో ఈ నెల 5న కార్తీక పౌర్ణమి రోజున నిత్య హవనం, బలిహరణం, మహా పూర్ణాహుతి, యజ్ఞ పరి సమాప్తి, మహదాశీర్వచనం, తీర్థ ప్రసాదాల వితరణ తదితర ఉత్సవ కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో రానున్న నేపథ్యంలో మంచిర్యాల, కరీంనగర్, జగిత్యాల ఆర్టీసీ వారు ప్రత్యేకంగా బస్సులు నడప నున్నారని ఈఓ శ్రీనివాస్ సంకటాల వివరించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# వైకుంఠ చతుర్దశి వైభవం



భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయంలో ప్రతి పర్వదినం ఒక విశిష్టమైన ఆత్మార్థాన్ని, దైవభక్తి పరమార్థాన్ని ప్రతిబింబిస్తుంది. అందులో కార్తీక మాసంలో జరిగే వైకుంఠ చతుర్దశి పర్వదినం అత్యంత పవిత్రమైనది. ఈ రోజున భగవంతుని ద్వంద్వారాధన జరుగుతుంది. మహావిష్ణువు, మహాదేవుడు ఇద్దరినీ సమానంగా ఆరాధించడం దాని ప్రధాన విశిష్టత. హరిహర ఏకత్వాన్ని బోధించే ఈ రోజు భక్తులను వైకుంఠమార్గం వైపు నడిపిస్తుంది. కార్తీక శుద్ధ చతుర్దశి తిథినే వైకుంఠ చతుర్దశి అని పిలుస్తారు. ఈ రోజు పుణ్యదాయక మైనదిగా శాస్త్రోక్తంగా చెప్పబడింది. పద్మపురాణం, స్కాందపురాణం, శివపురాణం వంటి గ్రంథాల్లో వైకుంఠ చతుర్దశి ప్రాధాన్యం విపులంగా వివరించ బడింది. ఒకసారి శ్రీమహా విష్ణువు కాశీ క్షేత్రానికి వచ్చి మహాదేవుని దర్శించి రాత్రంతా జాగరణ చేశాడట. విష్ణువు తులసీదళాలతో శివారాధన చేసినట్లు పురాణములు చెబుతున్నాయి. ఆ భక్తిని చూసి మహాదేవుడు సంతోషించి, "మధువిష్ణో! త్వమేవాహం, త్వమేవ మమ బంధువః, త్వయా విన్నపితం దత్తం మమార్ధం దేహి మాధవ" అని అన్నాడట. దీనర్థం "ఓ మాధవా! నీవు నేనే, నేను నీవే, నీకు నా అర్ధ భాగాన్ని ప్రసాదిస్తున్నాను" అని. అందుకే కాశీ విశ్వనాథ ఆలయంలో నేటికీ విష్ణు లింగం దర్శనమిస్తుంది. స్కాంద పురాణంలో ఇలా శ్లోకం ఉంది

**"కార్తీక శుక్ల చతుర్దశ్యాం యః కాశ్యాం శివ పూజకః?**
**స్వర్గ మోక్షప్రదం పుణ్యం లభతే నాత్ర సంశయః?"**

అంటే, కార్తీక శుద్ధ చతుర్దశి రోజున కాశీ క్షేత్రంలో శివారాధన చేసినవారికి స్వర్గ మోక్షాలు లభిస్తాయి, దీనిలో సందేహం లేదు.

వైకుంఠ చతుర్దశి రోజున శివవిష్ణువుల ఉభయారాధన జరగడం వల్ల హరిహర ఏకత్వం స్పష్టమవుతుంది. ఉపనిషత్తులు కూడా ఈ సత్యాన్ని నొక్కిచెబుతాయి ం

**"శివో హరిరహంకారో హరో శివః",**
**అంటే "శివుడు హరుడే, హరుడే శివుడు"** అని. ఈ తత్త్వం ద్వంద్వారాధనకు ఆధ్యాత్మిక పునాది.

భక్తులు ఈ రోజున ఉపవాసం పాటించి సాయంత్రం పూజలు ప్రారంభిస్తారు. ముందుగా విష్ణువుకు తులసీ దళం సమర్పించి, ఆ తరువాత శివునికి బిల్వ దళాలతో అభిషేకం చేస్తారు. ఓం నమో నారాయణాయ, ఓం నమః శివాయ అనే ద్వంద్వ మంత్రజపం చేస్తారు. విష్ణువుకు బిల్వ దళం, శివునికి తులసీ దళం సమర్పించడం ద్వారా హరిహర ఐక్యత వ్యక్తమవుతుంది. రాత్రంతా జాగరణ చేసి దీపారాధన చేయడం శాస్త్ర సమ్మతం. ఈ జాగరణ పుణ్యాన్ని శివపురాణం ఇలా వర్ణిస్తుంది ం

**"యః పశ్యతి చ జాగర్తి చతుర్దశ్యాం మహేశ్వరమ్?**
**తస్య పాపాని నశ్యంతి సూర్యోదయ మివాంధకమ్?"**

అంటే వైకుంఠ చతుర్దశి రాత్రి జాగరణ చేసి మహేశ్వరుడిని దర్శించినవారి పాపాలు సూర్యోదయాన్నిచూసిన చీకటి వలె నశిస్తాయని అర్థం.

కాశీలో ఈ రోజు విశ్వనాథ ఆలయంలో హరిహర మేళనం జరుగుతుంది. గంగానది తీరంలో దీపాల సముద్రం విరాజిల్లుతుంది. వేలాది భక్తులు దీపాలు తేలుస్తూ గంగా తీరమంతా దివ్యవెలుగుతో నింపుతారు. ఈ రోజున శివవిష్ణు పూజలు, వేద పఠనాలు, భజనలు జరుగుతాయి. కాశీ క్షేత్రంలో ఈ రోజున దర్శనం చేసే భక్తులకు వైకుంఠ ప్రాప్తి కలుగుతుందని విశ్వాసం. దక్షిణ భారతం లోనూ ఈ పర్వదినం అత్యంత వైభవంగా జరుగుతుంది. తిరుమలలో శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, నైవేద్యాలు, దీపదానాలు జరుగుతాయి. శివాలయాల్లో రాత్రంతా రుద్రాభిషేకాలు, భజనలు, రామనామ సంకీర్తనలు జరుగుతాయి. భక్తులు ఉపవాసం పాటించి, దీపదానాలు చేసి, పుణ్యనదుల్లో స్నానం చేస్తారు. వైకుంఠ చతుర్దశి యొక్క ఆధ్యాత్మిక భావం మనిషి మనసును సమభావానికి తీసుకు వెళ్తుంది. శివుడు, విష్ణువు ఇద్దరూ ఒకే పరమాత్ముడి విభిన్న రూపాలని, భక్తిలో భేదం లేదని ఈ రోజు బోధిస్తుంది. భక్తి ద్వారా హృదయం శుద్ధి చెంది ఆత్మ పరమాత్మలో లీనమవ్వడం మోక్ష స్వరూపం. ఉపవాసం ద్వారా శరీర శుద్ధి, జాగరణ ద్వారా మనశు శ్రద్ధి, దానం ద్వారా కర్మశుద్ధి, భక్తి ద్వారా ఆత్మశుద్ధి లభిస్తుందని ఈ పర్వదినం స్ఫురింప జేస్తుంది. వైకుంఠ చతుర్దశి రోజున దీపదానం చేయడం, పేదలకు అన్నదానం చేయడం అత్యంత పుణ్యప్రదం. తులసీదీపం లేదా గంగాదీపం వెలిగించడం వలన పాపాలు నశించి సాత్వికత పెరుగుతుందని శాస్త్రోక్తంగా చెబుతారు. భక్తులు రాత్రంతా హరిహర నామస్మరణతో గడిపితే వైకుంఠమార్గం కలుగుతుంది. ఈ పర్వదిన సారాంశాన్ని పద్మపురాణ శ్లోకం ఇలా వ్యక్తం చేస్తుంది.

**"హరిశ్చ శంకరశ్చైవ ద్వావేతౌ భిన్నచేతసౌ?**
**ఏకమేవ పరబ్రహ్మా ద్విభిన్నం దివ్య దృష్టయా?"**

అంటే హరుడు, హరుడు ఇద్దరూ భిన్నంగా కనబడినా వారు ఒకే పరబ్రహ్మా స్వరూపమని.వైకుంఠ చతుర్దశి భక్తికి ప్రతీక, ఐక్యతకు సూచిక, మోక్షానికి మార్గదర్శక పర్వదినం. హరిహరుల అనుగ్రహంతో జగత్తంతా శాంతి, సమృద్ధి, ధర్మమార్గం వైపు నడవాలని సంకల్పించాలి. మనలో ప్రేమ, సాత్వికత, సమతా భావం నిలవడం ఈ పర్వదినం యొక్క నిజమైన ఆరాధన. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# మార్కెట్ లో నయా ట్రెండ్.. అద్దెకు బంగారు నగలు..



సాధారణంగా అమ్మాయిలకి.. బంగారానికి మధ్య విడదీయరాన్ని సంబంధం ఉంటుంది. సందర్భం ఏదైనా సరే ఒంటినిండా నగలు ఉండాల్సిందే. ముఖ్యంగా ఏదైనా పండుగ వచ్చిందంటే చాలు సాంప్రదాయమైన దుస్తులు ధరించడమే కాకుండా వాటికి అనుకూలంగా బంగారు ఆభరణాలతో తమ అందాన్ని రెట్టింపు చేసుకుంటూ ఉంటారు. అయితే అలాంటి అమ్మాయిలకు ఇప్పుడు భారీ షాక్ తగులుతోందని చెప్పాలి. రోజురోజుకీ బంగారం ధరలు ఆకాశాన్ని అంటుతున్న నేపథ్యంలో సామాన్యులు బంగారం వైపు ఆలోచించడమే మానేశారు. గత వారం రోజులుగా సుమారుగా 11,000 వరకు తగ్గిన బంగారం ధరలు ఇప్పుడు మళ్లీ అనూహ్యంగా పెరిగిపోయి అందరిని ఆశ్చర్య పరుస్తున్నాయి. ఇక ఇలా బంగారం ధరలు భారీగా పెరిగిపోతున్న నేపథ్యంలో తాజాగా ఒక కొత్త ట్రెండు మార్కెట్లో మొదలయ్యింది. ఈ ట్రెండ్ చూసి కొంతమంది సంతోషం వ్యక్తం చేస్తే.. మరి కొంతమంది ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు బట్టలు, రోల్డ్ గోల్డ్ ఆఖరికి లగ్జరీ కార్లను కూడా అద్దెకు ఇవ్వడం చూసాం.. కానీ ఇప్పుడు ఏకంగా బంగారాన్ని కూడా అద్దెకు ఇస్తున్నారా అని అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇదే ఈ కొత్త ట్రెండు. మరి ఈ ట్రెండ్ ఎప్పుడు ఎక్కడ మొదలయ్యింది దీని పూర్తి వివరాలేంటో ఇప్పుడు చూద్దాం.. విషయంలోకి వెళ్తే.. ప్రతి వేడుకకు సరికొత్తగా తయారవ్వాలనుకునే ఈతరాన్ని దృష్టిలో పెట్టుకొని మార్కెట్లో కొన్ని సంస్థలు పార్టీవేర్ డ్రస్సులను, వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలను అద్దెకు ఇవ్వడం మొదలుపెట్టాయి. వీటి సహాయంతో తక్కువ ఖర్చుతోనే అనుకున్నట్టుగా తయారయ్యే విధంగా వీలు ఉండడంతో ఈ ట్రెండ్ చాలా వరకు కూడా అందర్నీ ఆకట్టుకుంది. అయితే ఇప్పుడు ఇదే పద్ధతిని బంగారు దుకాణాలు కూడా ప్రారంభించాయి. కర్ణాటకకు చెందిన శ్రీ స్టార్ గోల్డ్ కంపెనీలో బంగారు నగలను కొనుక్కోవడం అమ్ముకోవడమే కాదు అద్దెకు కూడా తీసుకోవచ్చుట. వి గివ్ గోల్డ్ ఆన్ రెంట్ అనే పేరుతో ఈ సర్వీస్ ను అందిస్తున్నారు. చెన్నై , హైదరాబాద్ నగరాలలో కూడా ఈ సంస్థ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ అద్దె ఒక రోజు నుంచి వారం రోజుల వరకు అందుబాటులో ఉంటుంది. దానికి కొన్ని ఖచ్చిత మైన నిబంధనలు కూడా ఉంటాయి. ఎవరైతే బంగారు ఆభరణా లను అద్దెకు తీసుకోవాలనుకుంటున్నారో అలాంటివారు ఐడి ప్రూఫ్ కూడా ఇవ్వాల్సి ఉంటుంది . కాబట్టి ఇక బంగారు నగలను తీసుకొని పారిపోయే అవకాశాలు ఉండవు. గడువు పూర్తయిన తర్వాత ఆ నగలను భద్రంగా తెచ్చి అప్పగించాల్సి ఉంటుంది.. ముఖ్యంగా నగ విలువను బట్టి, తీసుకునే రోజులను బట్టి కూడా అద్దె వసూలు చేస్తారు . పైగా నగ ధరను బట్టి డబ్బు కూడా డిపాజిట్ చేయించుకొని ఆ వివరాలన్నింటినీ చెక్ చేశాకే అద్దెకు ఇస్తుంటారు. మొత్తానికి అయితే పెరిగిన బంగారు ధరలను దృష్టిలో పెట్టుకొని ఈ సంస్థ తీసుకొచ్చిన ఈ వినూత్న ట్రెండు మార్కెట్లో బాగా పాపులారిటీని సొంతం చేసుకుంది. ఇక ప్రతిసారి ఒకే నగ ధరించాలా అని ఆలోచించే మహిళలకు.. ధరలు చూసి అమ్మో ఇంత మనం పెట్టి కొనగలమా అని ఆలోచించే వారికి ఇది చక్కటి సదుపాయం అని చెప్పవచ్చు. ఇక ప్రస్తుతం ఈ ట్రెండు అందరిని ఆశ్చర్యపరుస్తోంది.

# పండుగ నెలలో అమ్మకాల్లో అదరగొట్టిన టాప్ 5 కార్ల కంపెనీలు ఇవే

ఓవైపు పండుగ నెల.. మరోవైపు జీఎస్టీ తగ్గింపు. ఈ డబుల్ ధమాకా కార్ల అమ్మకాలు భారీగా సాగాయి. ఏడాది మొత్తంలో అక్టోబరు నెలలో కార్ల అమ్మకాలు జోరుగా సాగుతుంటాయి. ఈసారి జీఎస్టీ తగ్గింపు కూడా తోడు కావటంతో.. రికార్డుస్థాయిలో అమ్మకాలు సాగాయి. అయితే.. ఈ పండుగ నెలలో కార్ల అమ్మకాల్లో టాప్ 5 అమ్మకాలు సాగించిన కంపెనీలు.. గత ఏడాది ఇదే అక్టోబరులో వాటి అమ్మకాల మధ్య ఉన్న వ్యత్యాసం చూస్తే.. ఈసారి అమ్మకాల జోరు ఏ రేంజ్ లో సాగిందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఈసారి పండుగ నెలలో ఎప్పటిలానే మారుతి సుజుకీ చార్టో టాప్ పొజిషన్ లో నిలిచింది. 2024 అక్టోబరులో 2,06,434 కార్లను అమ్మితే.. ఈసారి 2,20,894 కార్లను అమ్మింది. కంపెనీ చరిత్రలో అక్టోబరు నెలలో ఇంత భారీగా అమ్మకాలు సాగించింది ఇదేనని చెబుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి వ్రద్ధి రేటు 7 శాతంగా నమోదైంది. ఇక.. తర్వాతి స్థానంలో మహీంద్రా అండ్ మహీంద్రా నిలిచింది.



గత ఏడాది 95,350 వాహనాల్ని అమ్మితే ఈసారి ఏకంగా 1,20,142 వాహనాల్ని అమ్మింది. వ్రద్ధి రేటు ఏకంగా 26 శాతంగా నమోదు చేసింది. ఇందులో కమర్షియల్ వాహనాల సంఖ్యను తీసేసినా.. రెండో స్థానంలో మహీంద్రా నిలిచింది. 71,624 ప్రయాణికుల వాహనాల్ని విక్రయించింది. సంఖ్యా పరంగా చూసినప్పుడు హ్యుందయ్ మోటార్ మూడో స్థానంలో నిలిచింది. 2024 అక్టోబరులో 53,792 వాహనాల్ని అమ్మితే.. ఈసారి69,894 వాహనాల అమ్మకాలు జరిపింది. వ్రద్ధి శాతం 30శాతంగా నిలిచింది. టాటా మోటార్స్ అమ్మకాలు జోరుగా సాగినప్పటికి.. ప్యాసింజర్ వెహికిల్స్, కమర్షియల్ వెహికల్స్ ను వేర్వేరుగా చూస్తే.. అంకెలు కాస్త తగ్గినట్లు కనిపించినా.. గత ఏడాదితో పోలిస్తే 27 శాతం వ్రద్ధి రేటు కనిపిస్తుంది. 2024 అక్టోబరులో టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ 48,423 వాహనాల్ని అమ్మితే.. ఈ ఏడాది 61,295 వాహనాల్ని అమ్మింది.

ఐదో స్థానంలో టయోటా నిలిచింది. గత ఏడాది అక్టోబరులో 30,845 వాహనాల్ని అమ్మితే.. ఈ ఏడాది అక్టోబరులో 42,892 వాహనాల్ని అమ్మకాలు జరిపింది. టాటా అమ్మిన కార్లలో అత్యధికంగా నెక్సాన్ లు ఉంటే ఆ తర్వాతి స్థానాన్ని పంచ్ సొంతం చేసుకుంది. కియా అమ్మకాలు అంతకు ముందు ఏడాది అక్టోబరుతో పోలిస్తే 30 శాతం వ్రద్ధి చెందినట్లుగా పేర్కొంది.

# ఏ438586 టిక్కెట్ కు రూ.11 కోట్లు..

# ఎవరీ అదృష్టవంతుడు!

దీపావళి పండుగను పురస్కరించుకుని పంజాబ్ ప్రభుత్వం నిర్వహించిన బంపర్ డ్రాలో ఓ అదృష్టవంతుడికి ఏకంగా రూ. 11 కోట్ల బహుమతి వరించింది. అయితే డబ్బు తీసుకునేందుకు ఆ వ్యక్తి మాత్రం రాలేదని అంటున్నారు. దీంతో... నిబంధనల ప్రకారం 25 రోజులు వేచిచూశాక ఆ డబ్బు ప్రభుత్వ పరమవుతుందని చెబుతున్నారు. శుక్రవారం రాత్రి పొద్దుపోయాక ఈ లాటరీ ఫలితాలు వెల్లడయ్యాయి. అవును... దీపావళి పండుగను పురస్కరించుకుని పంజాబ్ ప్రభుత్వం నిర్వహించిన బంపర్ డ్రాలో ఓ అదృష్టవంతుడికి ఏ438586 టిక్కెట్ పై ఏకంగా రూ. 11 కోట్ల బహుమతి వరించింది. బఠిండాలో ఓ పంపిణీదారు నుంచి కొన్న టికెట్ కు ఈ ప్రథమ



బహుమతి వరించింది. విషయం తెలియగానే అనేకమంది అక్కడకు చేరి మిఠాయిలు పంచుకుంటూ, డప్పులు వాయిస్తూ పండుగ చేసుకున్నారు. అయితే రూ. 11 కోట్లు గెలుచుకున్న టికెట్ కొన్న విజేత మాత్రం అయిపూఅజా లేరని అంటున్నారు.

ఆన్ లైన్లో ఫలితాలు చూసుకుంటామని చెప్పి చాలామంది తమ వివరాలు ఇవ్వకుండా వెళ్లిపోతారని, అందువల్ల విజేత ఎవరో తెలియడంలేదని పంపిణీదారు చెబుతున్నారు.

**పంజాబ్ దీపావళి బంపర్ లాటరీ 2025 బహుమతి వివరాలు!:** 1వ బహుమతి: రూ. 11 కోట్లు ం ఈ బహుమతిని కేవలం 1 విజేత మాత్రమే అందుకుంటారు. 2వ బహుమతి: రూ. 1 కోటి మొత్తం 3 విజేతలు, ఒక్కొక్కరికి రూ. 1 కోటి. 3వ బహుమతి: రూ. 50 లక్షలు 3 విజేతలు, ఒక్కొక్కరికి రూ. 50 లక్షలు. 4వ బహుమతి: రూ. 10 లక్షలు 9 విజేతలు, ఒక్కొక్కరికి రూ. 10 లక్షలు. 5వ బహుమతి: రూ. 5 లక్షలు 9 విజేతలు, ఒక్కొక్కరికి రూ. 5 లక్షలు. 6వ బహుమతి: రూ. 9,000 ఈ విభాగంలో 2,400 మంది విజేతలు. 7వ బహుమతి: రూ. 7,000 2,400 మంది విజేతలు, ఒక్కొక్కరికి రూ. 7,000 అందుతుంది. ఈ క్రమంలో తాజాగా టాప్ – 3 బహుమతులు గెలుచుకున్న టిక్కెట్ నెంబర్లు ఈ విధంగా ఉన్నాయి. పంజాబ్ లాటరీ దీపావళి బంపర్ 2025 (మొదటి విజేత): ఏ 438586. పంజాబ్ లాటరీ దీపావళి బంపర్ 2025 (2వ విజేతలు): ఏ 821602, బీ 590883, సీ 754234 పంజాబ్ లాటరీ దీపావళి బంపర్ 2025 (3వ విజేతలు): ఏ 469288, బీ 959352, సీ 492061

చురకలు


## సంపాదకీయం

## మేలురకం పోయే, నాసిరకం మిగిలే..

## చందనం మార్కెట్ లో భారత్ కు ఏమైంది?

ఎర్ర చందనంపై 'పుష్ప'ల ప్రభావం ఓ రేంజ్ లో ఉందని అంటారు. ఇదే క్రమంలో చందన మార్కెట్ లో భారత ప్రాభవం కోల్పోయినట్లు కేంద్ర ప్రభుత్వం నియమించిన శాండల్ వుడ్ డెవలప్మెంట్ కమిటీ తన నివేదికలో పేర్కొంది. దీనికి గల ప్రధాన కారణం ఈ వృక్షజాతిని విపరీతంగా నరికేయడమేనని అంటున్నారు. ఫలితంగా మేలురకం జాతులు అంతరించిపోతున్నాయని చెబుతున్నారు. అవును... దక్షిణ భారతదేశంలోని కర్ణాటక, కేరళ, తమిళనాడుల్లో అత్యధికంగా పెరిగే చందనం మొక్కలను విపరీతంగా నరికేయడం వల్ల మేలురకం జన్యురకాలు అంతరించి, నాసిరకం జాతులు మిగిలినట్లు శాండల్ వుడ్ డెవలప్మెంట్ కమిటీ వెల్లడించింది. ఒకవైపు సరఫరా తగ్గి, అంతర్జాతీయ మార్కెట్ లో చందనానికి డిమాండ్ విపరీతంగా పెరిగిందని పేర్కొంది. ఒకప్పుడు ప్రపంచవ్యాప్తంగా చందనం మార్కెట్ లో ఓ వెలుగు వెలిగిన భారత ప్రభావాన్ని పునరుద్ధరించాలంటే, మన ప్రభుత్వాలు జోక్యం చేసుకుని దేశంలో చందన మొక్కల పెంపకంపై దృష్టి సారించాలని కమిటీ సూచించింది. ప్రస్తుతం ఆస్ట్రేలియా కంపెనీలు ప్రపంచవ్యాప్తంగా 70% మార్కెట్ వాటాను గుప్పిట్లో ఉంచుకున్నట్లు ఈ నివేదిక వెల్లడించింది. వాస్తవానికి ఒకప్పుడు ప్రధాన చందన తైలం ఉత్పత్తిదారుగా ఉన్న భారత్.. క్రమంగా భారీ దిగుమతిదారుగా మారింది. తాజా ఘణాంకాలు ఆ పరిస్థితిని క్లియర్ గా చూపిస్తున్నాయి. ఇందులో భాగంగా... 2023-24లో మనదేశం నుంచి 0.62 మిలియన్ డాలర్ల విలువైన చందనం ఎగుమతి జరిగితే దిగుమతులు మాత్రం 5.59 మిలియన్ డాలర్లు జరిగాయి. ప్రపంచ వ్యాప్తంగా చందన మార్కెట్ విస్తరిస్తోంది. ఇందులో భాగంగా... 2023లో 265.8 మిలియన్ డాలర్ల మేర ఉన్న ఈ మార్కెట్, 2030 నాటికి 502.2 మిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉంది. ఈ ఏడేళ్లలో 9.4% మేర వార్షిక వృద్ధిరేటు నమోదు చేస్తుందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని.. దేశంలో అమూల్యమైన ఈ వనరుపై దృష్టిసారించాలని చెబుతున్నారు! ఈ నేపథ్యంలో... కేంద్ర పర్యావరణ, అటవీశాఖ భారత అటవీచట్టం 1927ని సవరించి, పంట పొలాల్లో పెంచిన చందన మొక్కలను అటవీ ఉత్పత్తుల నుంచి తొలగించాలని.. ఆర్థిక సంస్థలు ఈ మొక్కల పెంపకానికి అవసరమైన రుణాలు ఇవ్వడంతో పాటు, బీమా సౌకర్యం కల్పించాలని, అన్నిరకాల ప్రోత్సాహకాలు అందించాలని కోరుతున్నారు. ఇదే క్రమంలో... చందన మొక్కల పెంపకం కోసం సంస్థాగతంగా రుణ సౌకర్యం, ప్రోత్సాహకాలు, బీమా సౌకర్యం కల్పించేందుకు కేంద్ర పర్యావరణం, అటవీ, ఆయుష్ మంత్రిత్వశాఖలు చర్యలు తీసుకోవాలని.. అన్ని రాష్ట్రాల్లో ఒకే విధానం అమలయ్యేలా చూడాలని చెబుతున్నారు. వాస్తవానికి.. చందనం చెట్లు ప్రధానంగా కర్ణాటక, కేరళ, తమిళనాడుల్లో ఎక్కువగా పెరుగుతాయి. అయితే.. ఈ వనరుకున్న ప్రాధాన్యాన్ని గుర్తించకుండా విపరీతంగా కొట్టేయడంతో నాణ్యమైన జాతులన్నీ అంతరించిపోయి, నాసిరకం సరుకు మిగిలిపోయింది. ఈ లోపాన్ని అధిగమించాలంటే మళ్లీ మేలురకం మొక్కల పెంపకంపై దృష్టిసారించాలని సూచిస్తున్నారు. దీనికోసం ప్రధానంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని అంటున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్ లాంటి రాష్ట్రాల్లో చాలా ప్రైవేటు సంస్థలు, సంఘాలు, రైతులు వాణిజ్యపరంగా పెద్దసంఖ్యలో మొక్కల పెంపకం చేపట్టారు. దీనివల్ల పంటపొలాల్లో ఈ మొక్కల పెంపకం 30,000 హెక్టార్ల దాకా చేరే అవకాశం ఉందని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం మాజీ ఐఏఎస్ అధికారి రతన్ పి.వాటాల్ నేతృత్వంలో శాండల్ వుడ్ డెవలప్మెంట్ కమిటీ ఏర్పాటుచేసింది. ఆ కమిటీ ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉన్న పరిస్థితులన్నింటినీ సమీక్షించి ఇప్పుడున్న విధానాలు, న్యాయపరమైన నిబంధనావళిలో మార్పులు సూచిస్తూ సిఫార్సులు చేసింది.

## భారత సాయుధ తిరుగుబాటు పితామహుడు ఫడ్కే - నవంబర్ 4...వాసుదేవ బల్వంత ఫడ్కే జయంతి



వాసుదేవ్ బల్వంత్ ఫడ్కే.. దేశంలో చాలా మందికి తెలియని, విని ఉండని పేరు. ఆ త్యాగ ధనుని గురించి చరిత్ర పుస్తకాలలో కూడా ఎక్కడా కనిపించదు. భారత దేశంలో సాయుధ తిరుగుబాటుకు బీజం వేసిన వ్యక్తి ఆయనే అని, తొలి దేశద్రోహం కేసు నమోదు కాబడింది ఆ ఉద్యమ కారుని మీదే అన్న విషయం తెలిస్తే ఆశ్చర్యం కలుగక మానదు. ఆంగ్లేయుల దురాగతాలను ఎదిరించి, శ్వేత జాతీయులపై తుపాకీ ఎక్కుబెట్టిన వీరుడు. బల ప్రయోగం ద్వారానే ఆంగ్లేయులను దేశం నుండి తరిమి వేయాలని తీర్మానించి, అమలులో ప్రాణాలు అర్పించిన వీర యోధు డు. శక్తి వంత మైన బ్రిటిష్ సామ్రా జ్యాన్ని ఒంటిచేత్తో ఎదిరించి, సాయుధ తిరుగు బాటును రేకెత్తిం చి, భారత్‌లో బ్రిటిష్ అధికారాన్ని నాశనం చేసి హిందూ రాజ్యాన్ని పునః స్థాపిస్తా నని ప్రతిజ్ఞ చేసిన మేరునగ ధీరుడు. 1879 అక్టోబర్ 22న ఆంగ్ల ప్రభుత్వం మొదటి రాజద్రోహ నేరం మోపబడింది ఈ వీరుడి పైనే కావడం గమనార్హం. వాసుదేవ బల్వంత ఫడ్కే (4 నవం బర్ 1845 – 17 ఫిబ్రవరి 1883) బ్రిటీష్ పరిపాలనకు వ్యతిరేకంగా పోరాడిన భారతీయ స్వాతంత్ర్య సమర యోధుడు. ఫడ్కే 1845 నవంబర్ 4న ప్రస్తుతం మహారాష్ట్ర లోని రాయ్‌గఢ్ జిల్లాలో ఉన్న పన్వెల్ తాలూకాలోని షిర్ధోన్ గ్రామంలో మరాఠీ చిత్పవన్ బ్రాహ్మణ రైతుకుటుంబంలో కుటుంబంలో జన్మించిన వాసుదేవ్, ప్రాథమిక విద్య తన గ్రామమైన షిర్ధోన్ లోనే పూర్తి చేశాడు. హైస్కూల్ విద్యకు పూనాకు వెళ్ళగా ఆంగ్లేయులకు వ్యతిరేక కార్య కలాపాలకు పాల్పడు తున్నాడని 9 వ తరగతి లో బడి నుండి బయటకు పంపారు. పుణె నగరం చేరుకుని మిలటరీ అక్కౌంట్స్ డిపార్టుమెంటులో గుమాస్తాగా 15 సంవత్సరాల పాటు పని చేశాడు. సొంత గడ్డపై వ్యవసాయం చేస్తూ, రైతులపై అధిక పన్నులు విధిస్తున్న ఆంగ్లేయు లకు ఎదురు తిరిగాడు. వలస పాలన నుండి భారత స్వాతంత్ర్యం పొందే లక్ష్యంతో కోలి, బిల్లు, దంగర్ ఆదిగా సుమారు 300 మంది ఆదివాసీ యువకుల సహాయంతో 'రామోషి' అనే విప్లవ తిరుగుబాటు బృందాన్ని రూపొందించి, వారికి యుద్ధ విద్యలపై శిక్షణ నిర్వహిం చాడు. వాసుదేవ్ మొదట ప్రభుత్వ ఖజా నాలపై దాడి చేయడం మొదలు పెట్టాడు. అలా కొల్లగొట్టిన డబ్బును రైతులకు, ఆదివాసీలకు పంచే వాడు. ఆయుధాలు సమకూర్చు కొనేవాడు. బ్రిటీష్ సైనికులపై హఠాత్తుగా జరిపిన గెరిల్లా దాడుల వల్ల ఏకంగా పుణె నగరం పైనే ఫడ్కే పట్టు సాధించి, పూనాలో బలవంతు డైన తిరుగుబాటు నాయకుడైనాడు. దానితో ఆంగ్లే యులు పెద్దసైన్యం పంపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏకకాలంలో అనేక దాడులను నిర్వహించడానికి వాసుదేవ బల్వంత ఫడ్కే ప్రణాళికలు రచించినా పరిమిత విజయాన్నే అందించాయి. ఒకసారి ఘనూరు గ్రామంలో సైన్యంతో నేరుగా తలప డ్డాడు. వాసుదేవ్ ను పట్టుకుంటే బ్రిటిష్ ప్రభుత్వం బహుమానం ప్రకటిస్తే... బొంబాయి గవర్నర్‌ను పట్టుకున్నందుకు ఫడ్కే ఎదురు బహుమానం ప్రకటించాడు. ప్రతి యూరోపియన్‌ని చంపినందుకు బహుమతిని ప్రకటించాడు. కొన్ని రోజులు పూనాను వదిలి హైదరాబాద్ కు వచ్చాడు. అప్పుడు హైదరాబాద్ పై రోహిల్లాల తిరుగుబాటు జరుగుతున్నది. వాసుదేవ్ వారితో జత కట్టి నిజాంపై తిరుగుబాటు చేసాడు. రోహిల్లా లతో పాటు అరబ్బులు కూడా ఆయనతో చేతులు కలపారు. కాని ఆంగ్లేయుల గూఢ చారులు వాసుదేవ్ ఆచూకీ తెలుసు కున్నారు. బ్రిటిష్ మేజర్ హెన్రీ విలియం డేనియల్, హైదరాబాద్ నిజాం పోలీసు కమిషనర్ అబ్దుల్ హక్ తదతరులు అవిశ్రాంతంగా ఆయన అచూకి కోసం వెతికారు. 20 జూలై 1879న పండార్‌పూర్ వెళ్తున్న పుడు కలడ్గి జిల్లాలో జరిగిన తీవ్రమైన పోరాటంలో వాసుదేవ్ ను ఒక దేవాలయంలో బంధించారు. ఫడ్కేని విచారణ నిమిత్తం పూణేకు తీసుకెళ్లారు. సర్వజనిక్ కాకా అని పిలువబడే గణేష్ వాసుదేవ్ జోషి ఆయన కేసును వాదించాడు. ఫడ్కేకి జీవిత ఖైదు విధించారు. ఆయన భారత్‌లో ఉంటే ప్రమాదకరమని గ్రహించి, జీవితాంతం ఏడెన్‌లోని జైలుకు తరలించారు. అతనికి సంకెళ్లు వేసి ఏకాంత నిర్బంధంలో ఉంచారు. అక్కడ 13 ఫిబ్రవరి 1883న జైలు నుండి అతను తప్పించుకున్నా మళ్ళీ వెంటనే తిరిగి స్వాధీనం చేసు కున్నారు బ్రిటీష్ పోలీసులు. అప్పటి నుంచి నిరహార దీక్ష చేస్తూ 17 ఫిబ్రవరి 1883న వాసుదేవ బల్వంత ఫడ్కే తుది శ్వాస విడిచాడు. ఫడ్కే భారత సాయుధ తిరుగు బాటు పితామహుడిగా పేరు పొందాడు. స్వతంత్ర ఉద్యమంలో సహ సభ్యులకు స్ఫూర్తిని అందించాడు. ఈ సమయంలో ఆయన కార్య కలాపాలను బంకిం చంద్ర చటో పాధ్యాయ్ రచించిన దేశభక్తి నవల ఆనంద్ మఠ్ లో పొందు పరిచారు. కానీ అప్పటి బ్రిటీష్ వలస ప్రభుత్వం దీన్ని ఆమోదించ లేదు. అందుకని ఈ అంశాలు తొలగించి పుస్తకాన్ని కుదించి ముద్రించా ల్సి వచ్చింది. 1984 లో, భారతీయ పోస్టల్ సర్వీస్ ఫడ్కే గౌరవార్థం 50 పైసల స్టాంపును విడుదల చేసింది. ఆయన గౌరవార్థం దక్షిణ ముంబై లోని మెట్రో సినిమా సమీపంలో ఒక చౌక్ పేరు పెట్టారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## భారత తొలి మహిళా ఎయిర్ మార్షల్ పద్మావతి బందోపాధ్యాయ - నవంబర్ 4...పద్మావతి బందోపాధ్యాయ జయంతి




పద్మావతి బందోపాధ్యాయ ( జననం. నవంబరు 4 1944) భారత దేశం లోని మహిళా సాధికారతకు ప్రతీకగా నిలిచిన వ్యక్తి. భారతీయ వైమానిక దళంలో తొలి మహిళా ఎయిర్ మార్షల్‌గా నిలిచి, మహిళలకు ఏదైనా సాధ్యం అన్న దిశగా మార్గం చూపారు. ఆమె సాధన, అంకితభావం, క్రమశిక్షణ ఆమెను ఇతరులకెందరో స్ఫూర్తిగా నిలిపాయి. పద్మావతి చిన్నప్పటి నుండి దేశ సేవ చేయాలనే తపనతో జీవనం సాగించారు. 1944లో పశ్చిమ బెంగాల్‌లో జన్మించిన ఆమె విద్యకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చారు. 1962లో చైనా-భారత యుద్ధం ఆమె మనసులో జాతీయతా భావాన్ని మరింతగా పెంపొందించింది. ఈ సంఘటన ఆమెను తీవ్రంగా ప్రభావితం చేసి, భారత వైమానిక దళంలో చేరాలని ప్రేరణ నిచ్చింది. వైద్యంలో బోధన పొందిన తర్వాత ఆమె వైమానిక దళంలో ప్రవేశించారు. పద్మావతి బందోపాధ్యాయ కెరీర్‌లో అనేక కీలక ఘట్టాలను అధిగమించారు. ఆమె ప్రతిభతో మహిళలందరికీ నిదర్శనంగా నిలిచారు. 1978లో డిఫెన్స్ సర్వీస్ స్టాఫ్ కాలేజీలో కోర్సును పూర్తి చేసిన మొదటి మహిళా అధికారి అనేది ఆమె సాధించిన అద్భుత విజయాలలో ఒకటి. వైమానిక దళంలో ఏవియేషన్ మెడిసన్‌లో ఆమె నైపుణ్యాలు, ప్రతిభ మరింత మెరుగు పరిచాయి. విమాన పైలట్‌ల ఆరోగ్యం, భద్రత, మరియు సామర్థ్యాలను మెరుగుపరచడం ఆమె ప్రత్యేకతగా నిలిచింది. భారత వైమానిక దళ ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్ జనరల్ మెడికల్ సర్వీసెస్‌గా సేవలందించడం ద్వారా అధిక హోదాలోని బాధ్యతలను విజయవంతంగా నిర్వహించారు. 2002లో, ఎయిర్ వైస్ మార్షల్ హోదా పొందిన మొదటి మహిళగా చరిత్రలో నిలిచారు. వైమానిక రంగంలో మహిళలకు కొత్త నాయికగా మారారు. పద్మావతి తన సేవలకు అనేక అవార్డులు, ప్రశంసలు అందుకున్నారు. భారత దేశం తరపున దక్షిణ ధ్రువం వంటి సాహస ప్రదేశాలలో పరిశోధనలు చేసిన మొదటి మహిళగా నిలవడం గర్వకారణం. ఆమె పరిశోధన ప్రయాణం పఠనశీలత, సాహసాలను సూచిస్తుంది.


ఆమె వృత్తి, సేవా దృక్పథం పట్ల కట్టుబాటు భారత వైమానిక దళానికి కీలకంగా మారాయి. పద్మావతి బందోపాధ్యాయ మహిళలందరికీ ఒక స్ఫూర్తి వంతురాలు. ఆమె చూపిన ధైర్యం, కష్టపడి పనిచేసే తీరు, అంకితభావం ఆధునిక మహిళా సాధికారతకు చిహ్నం. పాఠశాల విద్యార్థులు, యువతీయువకులు ఆమెను ఆదర్శంగా తీసుకుంటూ తన రంగాల్లో రాణిస్తున్నారు. ఆమె కృషి మనకు ఒక స్పష్టమైన సందేశం ఇస్తుంది – కష్టసాధ్యమైనా ప్రతిభతో, సమర్పణతో, మరియు పట్టుదలతో మహిళలు అన్ని రంగాల్లో విజయం సాధించవచ్చు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## అసమాన మేధావి....శకుంతలా దేవి - నవంబర్ 4... మానవ కంప్యూటర్ శకుంతలా దేవి జయంతి



ఆమె అంక గణితంలో నిపుణురాలు. గణితావధాని. చాలా వేగంగా గణనలు చేయగల సామర్థ్యం కలిగిన ఆమెను "మానవ కంప్యూటర్" అని పిలుస్తారు. గణిత మాంత్రికురాలిగా సుప్రసి ద్ధులు. శతాబ్దంలో ఆమెకు ఏదైనా తేదీ ఇస్తే, అది వారంలో ఏ రోజు పడిపోయిందో చెప్పగలిగిన అసాధారణ ప్రజ్ఞాశాలి. మైండ్ డైనమిక్స్' అని పిలిచే భావనను అభివృద్ధి చేసిన మేధావి. ఆమెనే మానవ నిర్మిత కంప్యూటర్ కన్న గొప్ప గణకురాలిగా ప్రపంచ వ్యాప్త గుర్తింపు పొందిన గణిత శాస్త్ర వేత్త శకుంతలా దేవి. శకుంతలా దేవిని (నవంబరు 4, 1929 %-%ఏప్రిల్ 21, 2013 ) మానవ గణన యంత్రము అని పిలుస్తారు. ఆమె ప్రపంచ వ్యాప్తంగా అనేక గణితావ ధానములు నిర్వహించి గణన యంత్రము కంటే వేగంగా పలు సమస్యలను పరిష్కరించారు. ప్రపంచంలో అతి వేగంగా గణనలు చేయుటలో గిన్నిస్ వరల్డ్ రికార్డును స్వంతం చేసుకున్నారు. బెంగళూరులోని బ్రాహ్మణ పూజారుల ప్రసిద్ధ కుటుంబంలో జన్మించిన శకుంతల దేవి తన తాత నుండి గణితంలో ప్రారంభ పాఠాలు పొందారు. ఐదు సంవత్సరాల వయస్సులో ఆమె చైల్డ్ ప్రాడిజీగా మరియు సంక్లిష్ట మానసిక అంక గణితంలో నిపుణురాలిగా గుర్తించ బడింది. ఆ చిన్న వయస్సులో, ఆమె క్యూబ్ మూలాలను లెక్కించటం వంటి గణిత సమస్య లను పరిష్కరించడంలో నిపుణు రాలు అయ్యింది. ఒక సంవత్సరం తరువాత మైసూర్ విశ్వ విద్యా లయంలోని విద్యార్థులు, ప్రొఫెసర్ల పెద్ద సమావేశానికి వెళ్ళి ఆమె తన ప్రతిభను ప్రదర్శించింది. ఎనిమిదేళ్ల వయసులో అన్నామలై విశ్వ విద్యాలయంలో ఆమె ప్రదర్శనతో శకుంతలాదేవిని బాలమేధావిగా గుర్తించారు. శకుంతలాదేవి 1960లో కోల్ కతాకు చెందిన ఐఏఎస్ పరితోష్ బెనర్జీని వివాహం చేసుకున్నారు. బెనర్జీ స్వలింగ సంపర్కం గురించి వెల్లడి కావడంతో ఆ వివాహం త్వర లోనే విడిపోయింది. అయితే ఈ ఘటన శకుంతల దేవికి, ఉత్ప్రేరకంగా పనిచేసింది, ఆమె మానవత్వం గురించి లోతుగా పరిశోధించడానికి సహాయపడింది. 1977 లో ది వరల్డ్ ఆఫ్ హోమో సెక్సువల్స్ అనే పుస్తకాన్ని రాయడానికి ఆమెను దారితీసింది. అమె రాసిన పుస్తకంలో స్వలింగ సంపర్కం అనైతికం అనే విషయాన్ని ఆమె సవాలు చేసింది. శకుంతలాదేవి తన సామర్థ్యాలను, తన సామర్థ్యాలను ఉపయోగించుకుంటూ, తన జీవితాన్ని అన్వే షించి, మానవత్వాన్ని చాటుకునే తపనతో, తన జీవితాన్ని గురించి ప్రసంగాలలో చెబుతూ ఉండేవారు. ఆమె ఎన్నో రచనకు చేశారు. మానవ మనస్సు కంప్యూటర్ కంటే సాటిలేని సామర్థ్యాలను కలిగి ఉందని, మానవ మనస్సును కంప్యూటర్లతో పోల్చడం సము చితం కాదని ఆమె అభిప్రాయ పడ్డారు. శకుంతలా దేవి తమ గణిత ప్రతిభను ప్రదర్శిస్తూ ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలో పర్యటించారు. ఆమె తన తండ్రితో కలిసి 1944 లో లండన్‌కు వెళ్లారు. ఆమె 1950 లో ఐరోపా పర్యటన 1976లో న్యూయార్క్ నగరంలో ప్రదర్శనలు ఇచ్చారు. 1988 లో, బర్కిలీలోని కాలిఫోర్నియా విశ్వ విద్యాలయంలో విద్యా మనస్తత్వ శాస్త్రం ప్రొఫెసర్ ఆర్థర్ జెన్సన్ వద్ద అధ్యయనం చేయటానికి ఆమె వెళ్లారు. ఆర్థర్ జెన్సెన్ స్వయంగా శకుంతలా దేవి గణిత ప్రతిభను పరిశీలించి అవాక్కయ్యారు. 1977లో అమెరికాలో ఓసారి ఒక కంప్యూటర్ తో శకుంతలా దేవికి పోటీ పెట్టారు. 188132517 అనే సంఖ్యకు మూడో వర్గం కనుక్కో వడంలో పోటీ పెట్టగా, ఆమె కంప్యూటర్ ను ఓడించారు. 1980 జూన్ నెలలో 13 అంకెలున్న రెండు సంఖ్యలు తీసుకున్నారు. 76,86,36,97,74,870 అనే సంఖ్యతో 24,65,09,97,45,779 అనే సంఖ్యను హెచ్చవేస్తే ఎంత వస్తుందని లండన్ ఇంపీరియల్ కాలేజిలోని కంప్యూటర్ విభాగంలోని ఓ సూపర్ కంప్యూటర్ శకుంతలా దేవిని ప్రశ్నించింది. దానికిఅయితే ఆమె కేవలం 28 సెకన్లలో... 18,947,668,177,995,426,462,773,730...సమాధానం ఇచ్చారు. ఆలా గిన్నీస్ బుక్ రికార్డ్ ఆమె సొంతం అయింది. ఆమె గత శతాబ్ద కాలంలో ఏ తేదీ చెప్పినా అది ఏ వారం అవుతుందో క్షణంలో ఆమె చెప్పేవారు. దేవి 1969 లో ఫిలిప్పీన్స్ విశ్వ విద్యాలయం విశిష్ట మహిళల పురస్కారాన్ని గెలుచుకుంది. ఆమె 1988 లో వాషింగ్టన్ డిసిలో రామానుజన్ మ్యాథమెటికల్ జీనియస్ అవార్డుతో సత్కరించింది. తమ 83వ ఏట 2013 ఏప్రిల్ 21న ఆమె బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో కన్ను మూశారు. గణితశాస్త్రాన్ని, ప్రాచీనకాలం నుండి ఎంతోమంది భారతీయులు అభివృద్ధి పరుస్తూ వచ్చారు. భారతీయ గణిత ఆవిష్కరణల్లో ముఖ్యమైనవిగా సున్నా వాడకం, బీజ గణితం వంటివాటిని చెబుతారు. ప్రపంచంలో మేధావులుగా గుర్తించ బడిన ఆర్యభట్ట, వరాహ మిహిర కాలం నుండి అంకగణిత ప్రాధాన్యత ఉన్నప్పటికీ, ఇటీవలి సంవత్సరాలలో విద్యార్థులలో గణిత ఫోబియా అధికం అవుతుంది. ఉన్నత చదువుల కోసం గణితాన్ని ఎంచుకునే విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నది. భారతదేశంలో సుమారు 1.3 మిలియన్ల పాఠశాలలు, 800 విశ్వవిద్యాలయాలను కలిగి ఉన్నా, గణిత ఉపాధ్యాయుల సంఖ్య నానాటికీ దిగదుడుపే అవుతున్నది. దేశంలో ఇంజనీరింగ్, ఉత్పత్తి, సమాచార సాంకేతికత, అంతరిక్ష తదితర శాస్త్రాలలో గణిత శాస్త్ర నిపుణులు అవసరం ఉన్న దృష్ట్యా, ప్రభుత్వాలు గణిత శాస్త్ర నిపుణులను తయారు చేయాల్సి ఉంది. అలాగే ఐదేళ్ళ నుండి 80ఏళ్ళ పైబడిన వయసు దాటే వరకు వరకు అవిశ్రాంతంగా కృషి గణిత శాస్త్రం లో విశేష కృషి చేసిన మాస్టర్ మైండ్ శకుంతలా దేవి ఆదర్శంగా, విద్యార్థులు భయాన్ని వీడి గణితంలో నిపుణులు కావలసిన అవసరం అనివార్యంగా ఉంది. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## హనుమ పాత్రలో సజీవుడు జనార్ధన్ రావు - నవంబర్ 4...అర్జా వర్ధంతి



అర్జా జనార్ధనరావు (డిసెంబర్ 21, 1926 – నవంబర్ 4, 2007) ప్రసిద్ధ తెలుగు నాటక, సినిమా నటుడు. ఆయన ఎక్కువగా పౌరాణిక చిత్రాలలో హనుమంతుడు వేషంతో మంచిపేరు సంపాదించుకున్నాడు. హనుమ అనగానే గుర్తువచ్చే విధంగా ఆయన నటన ఉండేది. అర్జా జనార్ధన రావు 1926 డిసెంబరు 21న కాకినాడలో జన్మించాడు. స్వస్థలం కాకినాడలోనే బి.ఎ., బి.ఎస్.సి చదువుకున్నాడు. చదువుకొనే సమయంలోనే ఆయనకు నాటక రంగంలో కొంత అనుభవం కలిగింది. ఆయనకు చిన్నతనం నుండి ఆటలమీద, కసరత్తులు చేయడం మీద ఉత్సాహం ఉండేది. ఆ ఉత్సాహమే ఆయనను మిస్టర్ ఆసియా, మిస్టర్ హెర్క్యులస్ (1954), మిస్టర్ ఇండియా (1955)గా ఎన్నిక చేసింది. ఇతడు శబ్దగ్రహణ శాఖలో డిప్లొమా చదివి కొన్నాళ్ళు శ్యామలా స్టుడియోలో రికార్డిస్ట్‌గా పనిచేశాడు. లవకుశ (1963)బీ శ్రీకృష్ణావతారం (1967)బీ వీరాంజనేయ (1968)బీ శ్రీ రామాంజనేయ యుద్ధం (1974)బీ ముత్యాల ముగ్గు (1975)బీశంకరా భరణం (1979)బీ త్యాగయ్య (1981)బీ శ్రీ ఆంజనేయ చరిత్ర (1981)బీ దేవాంతకుడు (1984)బీ తదితర చిత్రాలలో జనార్ధన్ రావు విభిన్న పాత్రలు పోషించారు. 2007 నవంబరు 4 (వయసు 80)న ఆయన మరణించాడు. డిటెక్టివ్ నవలా రచయిత విశ్వప్రసాద్ కథ, మాటలు సమకూర్చిన, 1969 జూలై 25న సినిమా విడుదలైన, కృష్ణ, గుమ్మడి, ఎస్వీ రంగారావు, వాణిశ్రీ లు ప్రధాన పాత్రధారులుగా ఉన్న జగత్ కిలాడీలు' చిత్రంలో జనార్ధన్ రావు భిన్నమైన పాత్రలో నటించాడు. ఈ సందర్భంగా రామాంజనేయ యుద్ధం చిత్రంలో ఒక పాటను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. జనార్ధన్ రావు ... ఆంజనేయ పాత్రలో లీనమై నటించగా, ఆ సన్నివేశంలో, ఆయన హావభా వాలు నాటి సినిమా ప్రియులు ఎన్నటికీ మరచి పోలేనివి. 1975లో పొట్లూరి వెంకట నారాయణ, ఎన్.ఎస్.మూర్తి కలిసి శ్రీరామాంజనేయ యుద్ధం పేరుతో కలర్ సినిమా నిర్మించారు. బాపు దర్శకత్వం వహించిన సినిమాకు ముళ్లపూడి వెంకటరమణ మాటలు రాయకుండా ఉన్న అరుదైన సినిమా శ్రీ రామాంజనేయ యుద్ధం. బాపు-ఎన్టీఆర్ కాంబినేషన్‌లో వచ్చిన తొలి సినిమా శ్రీరామాంజనేయ యుద్ధం. గతంలో గబ్బిట వెంకటరావు రాసిన పద్యనాటకం లోని పద్యాలను యథాతథంగా వాడడంతో సంభాషణలు కూడా అతని చేత రాయించారు. ఎన్టీఆర్ రాముడిగా, అర్జా జనార్దనరావు ఆంజనేయుడుగా, బి.సరోజదేవి సీతగా, ధూళిపాళ్ల యయాతిగా నటించిన ఈ చిత్రానికి కె.వి.మహదేవన్ సంగీతం సమకూర్చారు. ఇందులో ఆంజనేయుడు ఆలపించే రెండు ఆర్ద్రమైన పాటలను వినూత్నంగా ఉంటుందని రఘురామయ్య చేత పాడించారు. వాటిలో మొదటిది 'రామ నీలమేఘ శ్యామా కోదండరామా' కాగా, రెండవది 'శరణు శరణయా జానకిరామా, కరుణ జూపవా మారుతిపై సాకేత సార్వభౌమా' అనే పాట. ఈ రెండవ పాటకు కె.వి. మహదేవన్ ఒక హిందీ పాట బాణీని అనుకరించడం వింతగా చెప్పుకున్నారు. అందుకు కారణం...మహదేవన్ ఎప్పుడూ ముందుగా ఇచ్చే బాణీకి పాట స్వరపరచ లేదు. కవి రాసిన ఎటువంటి పాటకైనా అద్భుతంగా బాణీలు కట్టటం మహదేవన్ నైజం. తద్భిన్నంగా 'సాకేత సార్వభౌమ' పాటకు మహదేవన్ అనుకరించిన హిందీ పాట 1964లో రాజశ్రీ ప్రొడక్షన్స్ నిర్మాత తారాచంద్ బర్జాత్యా సత్యన్‌బోస్ దర్శకత్వంలో నిర్మించిన సూపర్ డూపర్ హిట్ చిత్రం 'దోస్తీ'లో మహమ్మద్ రఫీ పాడిన 'చాహూంగా మై తుఝే సాంఝ్ సవేరే...ఫిర్ భి కభీ అబ్ నామ్ కో తేరే ఆవాజ్ మై న దూంగా' మహదేవన్ అనుకరించడాన్ని విశేషంగా చెప్పుకుంటారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## గురుకులం.. వానొస్తే కలకలం

దేవరకొండ : నిరుపేద విద్యార్థులకు ఉన్నత చదువులు అందించాలన్న సంకల్పంతో 2023లో దేవరకొండ మండలం కొమ్మెపల్లిలో గిరిజన బాలుర గురుకుల పాఠశాల ఏర్పాటు చేశారు. అది నేడు వానొస్తే ద్వీపంలా మారి కలకలం రేపుతోంది.

వర్షాలు, వరదలు వస్తే నీరు పల్లపు ప్రాంతానికి చేరుతుందన్న విషయం అందరికీ తెలిసిందే. అలాంటప్పుడు 500 మంది విద్యార్థులు విద్యనభ్యసించే దేవరకొండ మండలం కొమ్మెపల్లి గిరిజన గురుకుల పాఠశాలను ఎత్తైన ప్రదేశంలో నిర్మించాలి. కానీ అవేవీ చూసుకోకుండా ప్రభుత్వ స్థలం ఉందనే ఉద్దేశంతో లోతట్టు ప్రాంతంతో పాటు చుట్టూ కుంటలు, చెరువులు ఉండే చోట నిర్మించారు. 2023, 2024, 2025లో మూడు పర్యాయాలు వర్షాకాలంలో చుట్టూ నీరు చేరి విద్యార్థులను ఇబ్బందులపాలు చేసింది.

గురుకుల హాస్టల్‌కు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంతో త్రిఫేజ్



కరెంట్ లేక తాగునీటి సమస్య, ఆర్వో ప్లాంట్ నడవక, రాత్రి వేళలో విద్యుత్ కోతలు, తెల్లవారితే స్నానం చేయాలంటే నీళ్లు రాక అవస్థలు పడుతున్నారు. వరద నీరు పాఠశాల ఆవరణలోకి రాకుండా రిటెన్షన్ గోడ నిర్మాణం చేపట్టక పోవడంతో చిన్నపాటి వర్షాలకు సైతం వరద నీరు పాఠశాల చుట్టూ చేరుతోంది. సాధారణ పరిస్థితుల్లోనూ, వర్షాకాలంలో హాస్టల్‌లోకి విష కీటకాలు వస్తుండటంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. వీటికి తోడు వంటశాల గది కురుస్తుందని విద్యార్థులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా పాఠశాల ప్రహరీ నిర్మాణం జాప్యానికి భూ వివాదమే కారణమని తెలుస్తుంది. ఈ విషయంపై ప్రిన్సిపల్ వెంకట్ నారాయ ణను వివరణ కోరగా ..ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లానని, ప్రహరీ త్వరలో ప్రారంభం కానుందని,విద్యుత్తు సమస్య తీరనుందని తెలిపారు.

## బడిలో.. స్వచ్ఛత అడుగులు

నేరేడుచర్ల: ప్రతి ప్రభుత్వ పాఠశాలను ఆకర్షణీయంగా, సురక్షిత ప్రాంతంగా తీర్చిదిద్దడం లక్ష్యంగా ఐదు అంశాలతో కూడిన 5.0 ప్రత్యేక కార్యాచరణ అమలుకు రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు డీఈవోలకు ఆదేశాలు జారీ చేశారు. ఆదర్శ కమిటీ సభ్యులు, ఎస్ఎంసీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, దాతలు, విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ కలిసి ఈ కార్యక్రమం అమలుకు కార్యాచరణ చేపట్టాల్సి ఉంది. అక్టోబరు 30 నుంచి ప్రతి పాఠశాలలో వారం రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**చేయాల్సిన పనులివే**

పాత భవనాలు, ప్రమాదకర నిర్మాణాలను మండలస్థాయి అధికారులు పరిశీలించి.. గుర్తించి కూల్చి వేసేందుకు ఆదేశాలు ఇవ్వడం, మరమ్మతులు చేయాల్సి ఉంటే డీఈవోలకు నివేదించాలి. గేట్‌లు, ప్రహరీలు సురక్షితంగా ఉన్నాయా పరిశీలించాలి.

పాఠశాలలో ఉన్న పాత ఫర్నిచర్, పాడైన వస్తువులు, ప్లాస్టిక్, మెటల్ స్క్రాప్ వేరు చేయాలి. ఇంజినీరింగ్ అధికారులతో కూడిన కమిటీ జాబితా తయారు చేయాలి. పాడైన వస్తువులను సురక్షితంగా తరలించాలి. కాల్చకూడదు.



పాఠశాల ఆవరణలో చెత్తా చెదారం, నీటి నిల్వలు లేకుండా చూడాలి. తాగునీటి ట్యాంకులు బ్లీచింగ్ వేసి శుభ్రం చేయించాలి.


పాఠశాలలో విద్యుత్తు వైర్లు, స్విచ్‌లు, ఇతర విద్యుత్తు పరికరాలు దెబ్బతిని ఉంటే తొలగించి కొత్తవి అమర్చాలి. ఫ్యాన్‌లు, ట్యూబ్‌లైట్లు ప్రమాదరహితంగా ఉండేలా చూడాలి. ఎంసీబీలు అమర్చి సరైన ఎర్తింగ్ ఏర్పాటు చేయాలి. వేలాడే తీగలు లేకుండా చూడాలి.

వంట గదిలో తగినంత వెలుతురు ఉండేలా, అగ్ని ప్రమాద నివారణ, గ్యాస్‌సిలిండర్ల లీకేజీ వంటి అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించాలి.

పాఠశాల గోడలపై ఆరోగ్య సంరక్షణ చర్యలను సందేశాల రూపంలో రాయించాలి. అత్యవసర నంబర్లను పాఠశాల ముందు సూచికలో రాయించాలి. ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా కార్యాచరణ చేపడతామని నేరేడుచర్ల ఎంఈవో పి.సత్యనారాయణరెడ్డి తెలిపారు.

## ఆశలు మొంథాం నీళ్లలో..!

సూర్యాపేట: ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా ఏకధాటిగా కురిసిన వర్షం వరి రైతుల ఆశలను నిండా ముంచింది. 61 మండలాల్లోని 571 గ్రామాల్లో మరో 15 రోజుల్లో కోత చేయాల్సిన 89,773 ఎకరాల వరి పైరు వాన, వరదధాటికి కొన్ని చోట్ల అడ్డం పడగా, మరికొన్ని చోట్ల వరదనీటిలో మునిగి ఉన్నాయని వ్యవసాయాధికారులు ప్రాథమిక అంచనాలను సిద్ధం చేశారు. ఇలాంటి సందర్భాల్లో పంటకోత చేయడం తమకు సవాలుతో కూడుకున్న పని అంటూ రైతులు ఆందోళన



చెందుతున్నారు. నేలవాలిన పైరును యంత్రాలు కోసినా.. కొంత మేర చేతికిరాదని వాపోతున్నారు. అడ్డం పడిన పంట నేలలో తేమ అధికంగా ఉంటే మొలక వచ్చే అవకాశాలున్నాయని ఆవేదన చెందుతున్నారు. వర్షం తమకు నష్టాన్ని మిగిల్చిందని కన్నీరు పెట్టుకుంటున్నారు. రైతులు నష్టపోకుండా ఉండేందుకు తగిన సూచనలు పాటించాలంటూ వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

# తుపాను తెచ్చిన కష్టం.. రైతుకు తీవ్ర నష్టం



సిరిసిల్ల : మొంథా తుపాను జిల్లాలో తీవ్ర ప్రభావం చూపింది. కురిసిన భారీ వర్షానికి 178 ఎకరాల్లో కోతకు వచ్చిన వరి పంట నీట మునిగినట్లు వ్యవసాయ అధికారులు అంచనాకు వచ్చారు. 234 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. 96 కేంద్రాల్లో వడ్లు సేకరిస్తున్నారు. దాదాపు అన్ని కేంద్రాల్లోకి వరద వచ్చింది. ధాన్యపు రాశులు తడిసిపోయాయి.

**అధికారుల పరిశీలన**

కొనుగోలు కేంద్రాల్లో కుప్పలు నీట మునగటంతో పాటు ధాన్యం నీటిలో కొట్టుకుపోయింది. రైతులు సేకరించి ఆరబోస్తున్నారు. అంకుశాపూర్‌లో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, ఆయా మండలాల్లో ఏఈవోలు నీట మునిగిన పంటలను పరిశీలించారు. తంగళ్లపల్లి మండలం బస్వాపూర్ కొనుగోలు కేంద్రం చెరువు పక్కనే ఉండటంతో ధాన్యం కుప్పలు నీట మునిగాయి. గురువారం రైతులు నీటిలోని వడ్లను ట్రాక్టర్లలోకి ఎత్తి వేరే చోటుకు ఆరబోయటానికి తరలించారు.పత్తి చేనులు కూడా నీటిలో ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వీర్నపల్లి మండలం అడవిపదిరకు చెందిన కొమ్ము జలపతి రెండెకరాల్లో సాగు చేసిన 40 క్వింటాళ్లకు పైగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో ఆరబోశాడు. కురిసిన భారీ వర్షానికి ఎగువ నుంచి వచ్చిన వరదతో గింజలు కొట్టుకుపోయి మట్టిలో కలిశాయి. మట్టిలో కలిసిన ధాన్యపు రాశులు ఒక్కచోట చేర్చేందుకు రైతు మోకరిల్లిన ఈ చిత్రం కర్షకుల కష్టాన్ని ప్రతిబింబిస్తోంది. సుమారు 4 క్వింటాళ్లకు పైగా ధాన్యం వరదకు కొట్టుకుపోయింది.

# చేతికొచ్చిన పంట.. ముంచిన మొంథా



పెద్దపల్లి : రెక్కలు ముక్కలు చేసుకుని ఆరుగాలం శ్రమించిన అన్నదాత ఆశలు ఆవిరయ్యాయి. కళ్ల ముందే పంట నేలవాలగా కర్షకుల నోటికాడి ముద్ద నీటిపాలైంది. జిల్లాలో మొంథా తుపాను రైతులను నిలువునా ముంచింది. వరి, పత్తి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కల్లాల్లో ఆరబోసిన ధాన్యమంతా వరదలో కొట్టుకుపోయింది. చేతికొచ్చిన పత్తి తడిసిముద్దయింది. పెద్దపల్లి, కమాన్‌పూర్ మండలాల్లో ఒకటి చొప్పున ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి.

**కొట్టుకుపోయిన ధాన్యం**

జిల్లాలో మంథని, సుల్తానాబాద్ మార్కెట్ యార్డులతోపాటు అన్ని గ్రామాల్లోని కల్లాల్లో ఆరబోసిన ధాన్యం వరద ధాటికి కొట్టుకుపోయింది. అధికారులు మాత్రం మంథని మార్కెట్‌లో ఆరబోసిన 450 క్వింటాళ్లు, జిల్లావ్యాప్తంగా కల్లాల్లో 15 వేల క్వింటాళ్లు ఆరబోయగా దీనిలో 400 క్వింటాళ్లు తడిసిపోయిందని అంచనా వేశారు. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

**తెల్లారేసరికి నీటిపాలు**

జిల్లాలో 2.14 లక్షల ఎకరాల్లో వరి, 50 వేల ఎకరాల్లో పత్తి పంట సాగైంది. వరి కోత దశలోకి వచ్చింది. మరికొద్ది రోజుల్లో పంట చేతికిరానుంది. కొన్ని చోట్ల కోతలు ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతున్నాయి. రెండు రోజులుగా మబ్బులు కమ్ముకోవడంతో చాలా మంది రైతులు కోతలు ప్రారంభించేందుకు వెనకాడారు. తెల్లారేసరికి వరి పంట నీటిలో తేలియాడటంతో అన్నదాతలు గుండెలు బాదుకుంటున్నారు. కాల్వశ్రీరాంపూర్, ఓదెల, మంథని, సుల్తానాబాద్ మండలాల్లో భారీగా నష్టం జరిగింది. దెబ్బతిన్న పంటలను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్ మండలాల్లో 196 రైతులకు చెందిన 271 ఎకరాల్లో నష్టపోయినట్లు ప్రాథమికంగా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించారు.ఓదెల మండలం కనగర్తి గ్రామానికి చెందిన స్వామి తనకున్న రెండెకరాలతోపాటు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశారు. రూ.లక్ష పెట్టుబడులు పెట్టగా కోత దశలో పంట ఉంది. వర్షానికి వరి నీటిలో మునిగిపోయింది. రూ.రెండు లక్షల వరకు నష్టం జరిగిందని తెలిపారు.

# స్వచ్ఛ బడి.. అడుగులు పడి..



పరిగి: ప్రభుత్వ విద్యాలయాల రూపురేఖలు మార్చేందుకు ప్రభుత్వం వివిధ రకాల చర్యలు చేపడుతోంది. ఇప్పటికే అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట అభివృద్ధి పనులు చేపట్టింది. ఎంపిక కాని కొన్ని బడులు మాత్రం శిథిలావస్థకు చేరాయి. తరగతి గదులకు తాళం వేసి ఉండటంతో పాములు, తేళ్లు తిరుగుతున్నాయి. పాత పుస్తకాలు, ఇతర సామగ్రికి చెదలు పడుతున్నాయి. దీంతో దుర్వాసన వస్తోంది. అపరిశుభ్రంగా మారడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులకు నిత్యం అవస్థలు తప్పడం లేదు. ఇలాంటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతోపాటు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఈనెల 31 నుంచి పలు కార్యక్రమాలు నిర్వహించేలా ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులిచ్చింది.

అమలు ఇలా..: బడుల పరిసరాలు, తరగతి గదుల్లో చెత్తాచెదారం, వ్యర్థాలు లేకుండా ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. ఏళ్ల కిందట నిర్మించినవి, శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించి చర్యలు తీసుకుంటారు. తరగతి గదుల్లో విద్యుత్తు తీగలు తేలితే సరిచేయనున్నారు. ఏళ్లుగా బడుల్లో పేరుకున్న పాఠ్యపుస్తకాలు, ఇతర లోహవస్తువులను గుర్తించి తీసేస్తారు. స్వచ్ఛమైన తాగునీరు అందించడం, మరుగుదొడ్లు, మూత్రశాలల శుభ్రత పనులు చేయనున్నారు.

జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు: 774

ప్రాథమికోన్నత: 116

ఉన్నత: 176

విద్యార్థులు: 77,454

**కార్యక్రమాలు ఇలా..**

ఈనెల 31న చెత్త తొలగింపు, శుభ్రతపై కమిటీ ఏర్పాటు, తరగతి గదుల్లో నిరుపయోగంగా మారిన వస్తువులను గుర్తించడం.

నవంబరు 1న తరగతి గదుల్లో కలప, లోహ, విద్యుత్తు తీగల గుర్తింపు.

నవంబరు 2న గదుల్లో నిరుపయోగంగా ఉన్న వాటిని అక్కడ్నుంచి తొలగించేందుకు మండల స్థాయి కమిటీ నిర్ణయం తీసుకోవడం.

నవంబరు 3న డ్రైనేజీ, మ్యాన్‌హోల్స్, ఇంకుడు గుంతల శుభ్రత, తాగునీటి ట్యాంకులను శుభ్రపర్చడం, విద్యుత్తు పరికరాలు, ఫ్యాన్స్, స్విచ్‌లను గుర్తించడం.

4న పాడైన గదుల తలుపుల గుర్తింపు, వంటగది, పరిసరాల పరిశుభ్రం, డెస్కులు బాగు చేయడం, ఇతర వాటిపై దృష్టి సారించడం.

**ఆహ్లాదంగా తీర్చిదిద్దుతాం..**

రేణుకాదేవి, జిల్లా విద్యాధికారిణి

పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి వాటిని ఆహ్లాదంగా తీర్చిదిద్దుతాం. ఇందుకోసం ప్రభుత్వం మరమ్మతులకు రూ.1.55 కోట్లు మొదటి విడత గ్రాంటును విడుదల చేసింది. చిన్న సమస్యలను కలెక్టర్ నిధుల ద్వారా పరిష్కరిస్తూ పెద్దవాటిని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నాం.

## ఆరునెలలు.. నలుగురు ఈవోలు

నల్గొండ : యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి పూర్తిస్థాయిలో కార్యనిర్వహణ అధికారి లేకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఆరు నెలల వ్యవధిలో నలుగురు ఈవోలు మారడం, వారిలో ముగ్గురు ఇన్‌ఛార్జి ఈవోలుగానే విధులు నిర్వర్తించడం గమనార్హం. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రొటోకాల్ ఉల్లంఘన వివాదం తర్వాత గతేడాది మార్చిలో అప్పటి ఈవో భాస్కర్‌రావును బదిలీ చేశారు. ఆ తర్వాత మే 2025న దేవాదాయ కమిషనర్‌గా ఉన్న ఐఏఎస్ వెంకట్రావుకు దేవస్థానం ఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. అటు కమిషనర్‌గా, ఇటు ఈవోగా ఆయన కొనసాగడంతో కేవలం వారంలో నాలుగు రోజులు హైదరాబాద్‌లో, రెండు రోజులు గుట్టలో అందుబాటులో ఉండేవారు. ఆగస్టు 31న పదవి విరమణ పొందగా.. రాష్ట్ర ప్రభుత్వం ఆయన సర్వీసు తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఆలయ ఈవోగా పూర్తి స్థాయిలో బాధ్యతలు కట్టబెట్టింది. ఆయన సెప్టెంబరు 25 నుంచి అక్టోబరు 25 వరకు సెలవు పెట్టి అమెరికా వెళ్లారు. ఆయన స్థానంలో ప్రభుత్వం పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) బోర్డు ఛైర్మన్‌గా ఉన్న రవినాయక్ సెప్టెంబరు 25 నుంచి అక్టోబరు 24 వరకు ఈవోగా వ్యవహరించారు. ఆయన కూడా తమ శాఖకు సంబంధించి విదేశీ పర్యటన ఉండటంతో అక్టోబరు 25 నుంచి



నవంబరు 2 వరకు సెలవు పెట్టి వెళ్లారు.

అక్టోబరు 22న జెన్‌కో సీఎండీగా వ్యవహరిస్తున్న ఐఏఎస్ ఎస్.హరీశ్‌కు దేవాదాయ శాఖ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. అక్టోబరు 26న తిరిగి ఆయననే మళ్లీ యాదగిరిగుట్ట ఆలయ ఇన్‌ఛార్జిగా ఈవోగా నియమిస్తూ దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు బాధ్యతలు స్వీకరించలేదు.అమెరికాలో ఉన్న వెంకట్రావ్ నవంబరు 6 వరకు సెలవు పొడిగించాలని ప్రభుత్వాన్ని కోరారు. నవంబరు 7 తర్వాత ఆయన విధుల్లో చేరుతారని ఆలయ సిబ్బంది ఒకరు తెలిపారు.

గుట్టలో స్వామివారు, అమ్మవార్లకు సమర్పించే వస్త్రాలను భక్తులకు విక్రయించేందుకు టెండర్లు పిలిచారు. ఓ వ్యాపారి రూ.52.15 లక్షలతో టెండర్ దక్కించుకోగా ఈ సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి మార్చి 31 వరకు గడువు ఉంది. అయితే వ్యాపారం సక్రమంగా జరగడం లేదనే సాకుతో సదరు వ్యాపారి స్థానిక ఎమ్మెల్యేతో సిఫారసు చేసుకుని ఆలయ ఉన్నతాధికారులకు విన్నవించుకున్నారు. వ్యాపారి టెండర్‌ను మూడేళ్లకు కొనసాగిస్తూ 2028 మార్చి 31 వరకు వస్త్రాలు సేకరించుకోవచ్చని ఆదేశాలు ఇవ్వడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.తాజాగా ఆలయ విద్యుత్తు విభాగం పర్యవేక్షక ఇంజినీర్(ఎస్ఈ) రూ.1.90 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు. ఇటీవలే ఆలయంలో అనుమతులు లేకుండా ఓ శీతల పానీయాల సంస్థకు సంబంధించిన ప్రకటనలు కూడా వినియోగించి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

## పల్లెల్లో.. కాలుష్యం మరకలు

నల్గొండ: ప్రమాదకర వ్యర్థాలను పారబోస్తూ.. పచ్చటి పల్లె సీమలను కాలుష్యమయంగా మారుస్తున్నాయి పరిశ్రమలు.. హైదరాబాద్ పారిశ్రామిక వాడల నుంచి తీసుకొచ్చి జిల్లాలోని మూరు మూల గ్రామాల్లో పోస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నా.. అధికారుల నిఘా కొరవడింది.

మోటకొండూరు, వలిగొండ, అడ్డగూడూరు, బీబీనగర్, చౌటుప్పల్, పోచంపల్లి, భువనగిరి మండలాల్లోని పలు గ్రామాల్లో కాలుష్య వ్యర్థాలను ఇష్టానుసారంగా వేస్తున్నారు. కొందరు రాత్రి పూట రసాయన వ్యర్థాల ద్రావణాలను ట్యాంకర్ల ద్వారా తెచ్చి బీబీనగర్, భువనగిరి చెరువులు, చౌటుప్పల్ మండలాల్లో పలు గ్రామాల్లో పారబోసిన ఘటనలు గతంలో జరిగాయి.

గతంలో మోటకొండూరు మండలంలో వ్యర్థాల రసాయనాల డ్రమ్ములను గుర్తించి ప్రజలు ఫిర్యాదు చేయడంతో యాదగిరిగుట్ట పోలీసులు విచారణ జరిపి పట్టుకున్నారు.

భువనగిరి పట్టణ శివారులోని పరిశ్రమను లీజుకు తీసుకుని నడిపిస్తున్న ఓ ఫార్మా కంపెనీలోనూ ప్రమాదకర వ్యర్థాల నిల్వలను గుర్తించిన పట్టణ పోలీసులు ఆగస్టు 30న పీసీబీ అధికారుల దృష్టికి తెచ్చారు. విచారణ జరిపిన పీసీబీ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ప్రమాదకర వ్యర్థాలు, రసాయనాలను నిల్వ చేసినందుకు ఎందుకు



చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని సదరు ఫార్మా యాజమాన్యానికి షోకాజ్ నోటీస్‌లు జారీ చేశారు.

పర్యావరణానికి హాని చేకూర్చే వ్యర్థాలు, రసాయనాలను బహిరంగ ప్రాంతాల్లో నిల్వచేయడం, పారబోసినందుకు ఎందుకు చర్యలు తీసుకోవద్దో సమాధానం ఇవ్వాలని షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు. వలిగొండ-తొర్రూరు రహదారిలో, సదరు ఫార్మా కంపెనీలో ఉన్న వ్యర్థాలు ఒక్కటిగా గుర్తించారు. ఆ కంపెనీని రెండు రోజుల క్రితం సీజ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన పీసీబీ విద్యుత్తు సరఫరా నిలిపి వేయాలని సంబంధిత అధికారులను కోరారు.

తాజాగా ఆగస్టు నెలలో వలిగొండ- తొర్రూరు రహదారిలో ఎనిమిది ప్రాంతాల్లో ఈ వ్యర్థాలను ప్రజలు గుర్తించారు. ఈ విషయమై అడ్డగూడూరు పోలీసులు ఆగస్టు 15న పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వలిగొండ మండలం అరూరు, అడ్డగూడూరు మండలం కంచనపల్లి శివారులో ప్రమాదకర వ్యర్థాలను పడేశారు.

## వరిని కాపాడుకుందామిలా!


మెదక్ : ప్రస్తుత యాసంగిలో ఉమ్మడి మెదక్ జిల్లాలో వరి 8,11,103 ఎకరాల్లో, వికారాబాద్ జిల్లాలో 1,31,000 ఎకరాల్లో సాగవుతోంది. మొంథా తుపానుతో వరి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ సందర్భంగా రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ టి.రాజేశ్వర్‌రెడ్డి, సిద్దిపేట జిల్లా వ్యవసాయ అధికారిణి స్వరూపరాణి పలు సూచనలు చేశారు. రోజంతా కలియ నేర్పుతూ రాత్రిపూట టార్పాలిన్ కవర్లు కప్పాలి. ఎండలో ఆరబోసి తేమ 17 శాతానికి రాగానే కొనుగోలు కేంద్రాలకు



తరలించాలి.తేమ అధికంగా ఉంటే అనుకూల వాతావరణంలో ఆరబోయాలి.వర్షం పడుతుంటే వరి కోతలు కోయవద్దు. నూర్పిడి చేసిన ధాన్యాన్ని తడి బస్తాల్లో నింపొద్దు.గాలి, వెలుతురు వచ్చే ఎత్తయిన ప్రదేశంలో టార్పాలిన్ కవర్లు పరిచి ఆరబోయాలి.పొలాన్ని పూర్తిగా ఆరబెట్టుకోవాలి. లేదంటే నూర్పిడి సమయంలో ఇబ్బంది ఎదురవుతుంది.కోతకు సిద్ధంగా ఉంటే లీటరు నీటిలో ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలి.ప్రస్తుతం కొన్ని చోట్ల పైరు గింజపట్టే దశలో ఉంది. మరికొన్ని చోట్ల కోతకు సిద్ధంగా ఉంది. అధిక వర్షాల బారి నుంచి రక్షించుకునేందుకు దుబ్బులను పైకి ఎత్తి కట్టుకోవాలి. ధాన్యం తడిసి రంగుమారకుండా ఉండేందుకు పూర్తిగా పట్టాలతో కప్పి ఉంచాలి.

## పౌరుల భద్రత.. బల్దియా బాధ్యత

హైదరాబాద్: ప్రతి సహాయ ఇంజినీరు రోజూ డివిజన్‌లో పర్యటించాలంటూ ఇంజినీర్లకు జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ కొత్త బాధ్యత అప్పగించారు. రోడ్లపై గుంతలు, మ్యాన్‌హోళ్ల మూతలు పగిలి పోవడం, కాలిబాటలపై అడ్డంకులు, ఇతరత్రా సమస్యలను స్వయంగా గుర్తించి.. ఆన్‌లైన్‌లో రికార్డు చేయాలని ఆదేశించారు. ఆ మేరకు బల్దియా ఐటీ విభాగం 'పబ్లిక్ సేఫ్టీ' పేరుతో మొబైల్‌యాప్‌ను నెలక్రితం అందుబాటులోకి తీసుకొచ్చింది. నగరవాసుల భద్రతే లక్ష్యంగా.. ఇంజినీర్లు రోజూ డివిజన్లలో తిరుగుతూ సమస్యలను గుర్తించడం, వాటిని 24గంటల్లో పరిష్కరించడం ప్రారంభమైంది. దశలవారీగా.. యాప్‌ను మరిన్ని సమస్యల పరిష్కారానికి ఉపయోగిస్తామని జీహెచ్ఎంసీ స్పష్టం చేస్తోంది.




**మొబైల్ యాప్ ప్రత్యేకత..**

ప్రతి డివిజన్‌లో ఓ సహాయ ఇంజినీరు బాధ్యులుగా ఉంటారు. రోడ్లపై గుంతలు, పగిలిన మ్యాన్‌హోల్ మూతలు, కాలిబాటలపై అడ్డంకులు, ఇతరత్రా సమస్యలను గుర్తించి ఫొటోలను అప్‌లోడ్ చేయాలి ఇంజినీర్లు అప్‌లోడ్ చేసే ఫొటోలు, సమస్యలను ఐటీ విభాగం అదనపు కమిషనర్ అనురాగ్ జయంతి, ఉన్నతాధికారులు డ్యాష్‌బోర్డులో నిత్యం పరిశీలిస్తుంటారు. గూగుల్ పటంపై ఆయా సమస్యలు ఎరుపు రంగులో కనిపిస్తుంటాయి. పరిష్కారం చూపాక.. ఇంజినీర్లు మళ్లీ ఫొటోను అప్‌లోడ్ చేయగా.. ఆకుపచ్చరంగులోకి మారుతుంది. జీఐఎస్ మ్యాపింగ్ సాంకేతికతతో పనిచేసే పబ్లిక్ సేఫ్టీ యాప్ సేవలను మరింత విస్తరిస్తామని అనురాగ్ జయంతి తెలిపారు.

ఇప్పటివరకు.. గుర్తించినవి
బారికేడ్లు లేకపోవడం 14
ఓపెన్ మ్యాన్‌హోళ్లు 263
ఇతర..75
ధ్వంసమైన మ్యాన్‌హోళ్లు 23
మూతలేని ఎలక్ట్రికల్ జంక్షన్ బాక్సులు 10
మొత్తం.. 1,818
పరిష్కరించినవి 907

## ఓటర్లు ఎక్కువ.. ఓటింగ్ తక్కువ

హైదరాబాద్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనది. నగరవాసులు మాత్రం ఆ హక్కును విస్మరిస్తున్నారు. కనీసం సగం మంది కూడా ఎన్నికల్లో ఓటు వేయట్లేదు. ఓటరు కార్డు పొందడానికి చూపుతున్న ఆసక్తి.. ఓటు వేయడంలో కనిపించట్లేదు. ఎన్నిక రోజును సెలవుదినంగా, విశ్రాంతి తీసుకునేందుకు, విహారయాత్రలకు వెళ్లేందుకు ఉపయోగించుకుంటున్నారు. గడిచిన ప్రతి ఎన్నికలోనూ ఈ విషయం స్పష్టమైంది. ముఖ్యంగా.. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పోలింగ్ శాతం క్రమేణా తగ్గుతోంది. 2009 సంవత్సరం నుంచి 2023లో జరిగిన శాసనసభ ఎన్నికల వరకు నియోజకవర్గంలో నమోదైన పోలింగ్ శాతమే అందుకు నిదర్శనం. ఈ నేపథ్యంలో.. నవంబరు 11న జరగబోయే ఎన్నికలో 60 శాతం ఓటింగ్ లక్ష్యంగా జీహెచ్ఎంసీ చైతన్య కార్యక్రమాలు, ఇతర ఏర్పాట్లు చేస్తోంది.

**ఎన్నికల సరళిని పరిశీలిస్తే..**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2009లో సాధారణ ఎన్నికలు జరిగాయి. అప్పుడు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ఓటర్లతో పోలిస్తే.. ప్రస్తుతం 54 శాతం మంది ఓటర్లు అదనంగా జాబితాలో చేరారు. పోలింగ్ శాతం మాత్రం ప్రతి ఎన్నికలోనూ తగ్గుతూ వస్తోంది. 2014లో 50శాతం పోలింగ్ నమోదవగా, తర్వాత జరిగిన ఏ ఎన్నికలోనూ.. ఈ నియోజకవర్గంలో 50 శాతానికి మించి పోలింగ్ నమోదు కాలేదు.

**పోలింగ్ పెంపే లక్ష్యంగా కార్యాచరణ**

జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఏర్పాటైనప్పటి నుంచి మొదటిసారి ఉప ఎన్నిక జరుగుతోంది. ఇప్పటి వరకు సాధారణ ఎన్నికలు జరిగాయని, వాటితో పోలిస్తే.. పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఉప ఎన్నికలో ఎక్కువ అవకాశాలు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. అధికార యంత్రాంగమంతా నియోజకవర్గంపై దృష్టి పెడుతోందని, కాలనీ సంఘాలు, యువతను చైతన్యవంతం చేసేందుకు ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నామని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తెలిపారు. మహిళలు, వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇంటింటికీ ఓటరు చీటీల పంపిణీ, ఓటరు సహాయ కేంద్రాలు, ఇతరత్రా చర్యలతో పోలింగ్ శాతాన్ని పెంచగలుగుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# కష్టం కన్నీరై.. గుండె చెరువై!



కరీంనగర్ : మొంథా తుపానుతో అన్నదాత గుండె చెరువైంది ఆరుగాలం శ్రమించి పండించిన పంట నీటిపాలైంది నోటికాడికి వచ్చిన బుక్క.. అందకుండాపోయింది.

కళ్ల ముందు నష్టం వాటిల్లుతున్నా చేష్టలుడిగిపోయారు తెల్లవారక నేలవాలిన పంటను చూసి బిక్కముఖం వేశారు కొట్టుకుపోయిన ధాన్యంను చూసి ఆవేదన చెందారు దుఃఖాన్ని దింగమింగుకొని వడ్లను ఆరబెట్టారు నష్టపరిహారమిచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నారు

**జిల్లాలో 34,127 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు**

జిల్లా వ్యాప్తంగా 15 మండలాల్లోని 183 గ్రామాల్లో 29,797 మంది రైతులకు సంబంధించి 34,127 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. 30,565 ఎకరాల్లో వరి, 3,512 ఎకరాల్లో పత్తి, 50 ఎకరాల్లో మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక నివేదిక తయారు చేశారు.

**మండలాల వారీగా నష్టం ఇలా..**

మండలాల వారీగా దెబ్బతిన్న వరి(పత్తి) పంటలు ఎకరాల్లో... హుజూరాబాద్ 3,959 (105), చిగురుమామిడి 3,383, వి.సైదాపూర్ 4,123, (324), మానకొండూరు 3,800 (300), కొత్తపల్లి 2,500 (1200), శంకరపట్నం 2,100, కరీంనగర్ రూరల్ 2,055 (593), గన్నేరువరం 1,740 (270), ఇల్లందకుంట 1,200 (300), గంగాధర 1,650, జమ్మికుంట 1,400 (200), వీణవంక 1,650 (220), చొప్పదండి 550 (50), తిమ్మాపూర్ 280, రామడుగు 175.

**ధాన్యం నీటి పాలు**

8 ఎకరాల్లో వరి సాగు చేశాను. 2.5 ఎకరాల్లో వరికోత యంత్రంతో కోసి సుమారు అయిదు ట్రాక్టర్ల ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఆరబోసుకున్నాం. రెండు రోజుల్లో తూకం వేయాల్సి ఉంది. వర్షంతో ధాన్యం కొట్టుకుపోయింది. 6 ఎకరాల్లో కోయాల్సిన వరి పైరు నీట మునిగింది. రూ.రెండు లక్షల వరకు నష్టం వాటిల్లింది.

దండవేని రాజు, రైతు సైదాపూర్

**తెల్లవారే సరికే పూర్తిగా కొట్టుకుపోయింది..**

నేను 30 గుంటల్లో వరి పంట సాగు చేశా. వరి పంట కోసి బుధవారం పొలం వద్దనే ధాన్యం కుప్పగా నిల్వ చేశా. తెల్లవారుజామున చూసేసరికి ధాన్యం అంతా వరదకు కొట్టుకుపోయింది. సాగు కోసం రూ.20 వేల పెట్టుబడి పెట్టగా ధాన్యం విక్రయిస్తే రూ.50 వేలు చేతికందేవని, ఒక రూపాయి కూడా చేతికందకుండా పోయిందని కన్నీరు మున్నీరవుతున్నారు.

గంగిపల్లి రాయమల్లు, రైతు, చింతగుట్ట శంకరపట్నం మండలం

**ఒక్క రోజులోనే కన్నీరు మిగిల్చింది..**

నేను రెండున్నర ఎకరాలు కౌలుకు తీసుకొని రూ.70 వేల పెట్టుబడితో వరి సాగు చేశా. వరి కోసి తొమ్మిది రోజుల కిందట మార్కెట్ యార్డులోని కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చా. తూకాల కోసం కేంద్రంలో ఆరబెడుతూ నిల్వ చేశా. గురువారం తెల్లవారుజామున కేంద్రంలోకి ఒక్కసారిగా వచ్చిన వరదతో కుప్పలు కొట్టుకుపోయాయి. రూ.1.80 లక్షల నష్టం వాటిల్లింది.

తాడవేని కనకరాజు, రైతు, కేశవపట్నం

జాగ్రత్తలు తీసుకోండి : భాగ్యలక్ష్మి, జేడీ, జిల్లా వ్యవసాయ శాఖ

పంట కోత సమయంలో భారీ వర్షం, గాలులకు తీరని నష్టం వాటిల్లింది. రైతులు పొలాల్లో జాగ్రత్తలు తీసుకొని నష్టనివారణ చర్యలు చేపట్టాలి. అందుకోసం సమీపంలో ఉన్న ఏఈవోలను సంప్రదించాలి.

# బాబోయ్ పాములు!



పెద్దపల్లి :గ్రామాల్లో బీడు భూములు తగ్గిపోవడం, పంట పొలాల్లో క్రిమిసంహారక ముందుల వినియోగం పెరగడంతో పాముల సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. మిగిలినవి నివాస ప్రాంతాలవైపు ఆవాసాలను ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ఇంటి ఆవరణ, గడ్డివాములు, పశువుల షెడ్ల వద్ద పాముల సంచారం పెరగగా తరచూ గ్రామీణ ప్రజలు పాముకాటుకు గురవుతున్నారు. ఇటీవల జిల్లాలోని పలు విద్యాలయాల్లో కూడా పాముల సంచారం పెరిగింది. నెల రోజుల వ్యవధిలో జిల్లాలో పాముకాటు బాధితుల సంఖ్య గణనీయంగా పెరిగింది. వీరిలో కొంత మందికి సకాలంలో వైద్యం అందకపోవడంతో మృత్యువాతపడగా మరికొందరు ఆరోగ్యం కుదుటపడేందుకు రోజుల తరబడి చికిత్స పొందారు.

**గ్రామీణ ప్రాంతాల్లో ఇబ్బందులే..**

గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసర వైద్య సేవలు అంతంతమాత్రంగానే అందుతున్నాయి. రాత్రి ఆరోగ్య కేంద్రాలు, పల్లె దవాఖానాలు సక్రమంగా పని చేయకపోవడం, ఆర్ఎంపీలు అత్యవసర సేవలకు దూరంగా ఉంటుండటం ప్రమాద తీవ్రతను పెంచుతున్నాయి. ఆసుపత్రికి తీసుకొచ్చే ముందు ప్రాథమిక వైద్యం అందించకపోవడంతో పలువురు మృత్యువాతపడుతున్నారు. కాగా జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పాముకాటు మందులు అందుబాటులో ఉన్నట్లు జిల్లా వైద్యాధికారి వాణిశ్రీ తెలిపారు.

ఇటీవల ఓదెల మండలం రూప్‌నారాయణపేట గ్రామానికి చెందిన గుర్రం అక్షిత అనే డిగ్రీ విద్యార్థిని తన ఇంటి ఆవరణలో పాముకాటుకు గురయ్యారు. సుల్తానాబాద్ ఆసుపత్రిలో సరైన చికిత్స అందకపోవడంతో కరీంనగర్‌కు తీసుకెళ్లే క్రమంలో మృత్యువాత పడ్డారు.

పెద్దపల్లి మండలం పెద్దకల్వల గ్రామానికి చెందిన బత్తుల సమ్మయ్య అనే యువకుడు పంట పొలం వద్ద పాముకాటుకు గురయ్యారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం హైదరాబాద్‌కు తరలించారు. వైద్యం కోసం రూ.2 లక్షల వరకు వెచ్చించగా అతికష్టం మీద కోలుకున్నారు.

# సర్వీసు రోడ్లే శరణ్యం



గోదావరిఖని : ఉమ్మడి జిల్లాలో గుండ్లపల్లి నుంచి గోదావరిఖని కోల్‌బెల్టు వంతెన వరకు ప్రధాన పట్టణాల మీదుగా రాజీవ్ రహదారి విస్తరించింది. రెండు నగరపాలక, మూడు పురపాలక సంస్థల పరిధిలో ఈ రహదారి ఉంది. జనసాంద్రత ఎక్కువగా ఉన్న రామగుండం, పెద్దపల్లి, సుల్తానాబాద్, కరీంనగర్, అల్గునూరు ప్రాంతాల్లో సర్వీసు రహదారులు తప్పనిసరి. అల్గునూరు, రామగుండం పట్టణాల్లో కొంత వరకు మాత్రమే సర్వీసు రోడ్లు నిర్మించారు. 11 ఏళ్లుగా వాహనాలకు టోలు వసూలు చేస్తున్నా సర్వీసు రోడ్లు నిర్మించడం లేదు. రాజీవ్ రహదారి విస్తరించి ఉన్న పట్టణ ప్రాంతాల్లో ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకొంటున్నాయి.

**బైపాస్ పేరుతో పక్కన**

పెద్దపల్లి పట్టణంలో బైపాస్ రహదారి కోసం ప్రణాళికలు చేశారు. పెద్దకల్వల నుంచి బందంపల్లి వరకు పట్టణ శివారు నుంచి బైపాస్ రహదారి నిర్మించాలని మార్కింగ్ కూడా చేశారు. ఇప్పటి వరకు దానిపై ఎలాంటి కదలిక లేదు. ఇటు బైపాస్ లేక.. అటు సర్వీసు రోడ్డు లేక పెద్దపల్లి పట్టణ ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. సుల్తానాబాద్ పట్టణంలో కూడా బైపాస్ రహదారికి ఆలోచన చేసినా ఎలాంటి కార్యాచరణ చేపట్టలేదు.

జిల్లా కేంద్రమైన పెద్దపల్లితో పాటు సుల్తానాబాద్ పట్టణాల్లో ఆరు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న రాజీవ్ రహదారికి ఇరువైపులా సర్వీసు రోడ్లు లేకపోవడంతో ప్రమాదాలు పెరుగుతున్నాయి. రామగుండం ప్రాంతంలో కొన్ని చోట్ల నిర్మించి మరి కొన్ని ప్రాంతాల్లో వదిలేశారు. ఇటీవల రూ.10 కోట్లు వెచ్చించి సర్వీసు రోడ్ల పూర్తికి చర్యలు చేపట్టారు. రామగుండంలో 10 కిలోమీటర్ల మేర పనులు చేపట్టేందుకు ప్రత్యేక నిధులు కేటాయించారు.

పెద్దపల్లి పట్టణంలో సుమారు 4 కిలోమీటర్ల మేర రాజీవ్ రహదారి విస్తరించి ఉంది. పట్టణంలో ఇరువైపులా సర్వీసు రోడ్లు నిర్మించలేదు. స్థానికులు ప్రతి పనికీ రాజీవ్ రహదారిపైకి రావాల్సి వస్తోంది. భారీ వాహనాలు, పట్టణంలోని వాహనాలతో రద్దీగా ఉంటుంది. దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

సుల్తానాబాద్ పట్టణంలో రెండు కిలోమీటర్ల మేర రాజీవ్ రహదారి విస్తరించి ఉంది. పట్టణానికి ఆనుకొని ఉండటంతో రహదారిపై వెళ్లే వాహనాలకు తోడు పట్టణంలోని ప్రజలు ఇదే మార్గం మీదుగా వెళ్లాల్సి వస్తోంది. వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో ప్రమాదాలకు కేంద్రంగా మారుతోంది. ఈ ప్రాంతంలో వాహనదారులు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలున్నాయి.

## ఖాళీ స్థలం.. గజానికో వివాదం..

## అయ్యప్ప సొసైటీలో స్థలాలకు భద్రత కరవు

హైదరాబాద్: హైటెక్‌సిటీలోని ఖరీదైన అయ్యప్పసొసైటీ, సర్వే ఆఫ్ ఇండియా, విఘ్నేశ్వర సొసైటీ భూముల్లో ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. అమాయకులు, విదేశాల్లో స్థిరపడ్డ యజమానులే లక్ష్యంగా ఆక్రమణదారులు నకిలీ పత్రాలు సృష్టిస్తున్నారు. ఒక్కో ఇంటి స్థలానికి ముగ్గురు, నలుగురు యజమానులను సృష్టిస్తున్నారు. అసలైన యజమాని పారిపోయేలా చేస్తున్నారు. సదరు భూములపై కోర్టు వివాదం ఉండటంతో.. జీహెచ్ఎంసీ అధికారులు, స్థానిక పోలీసులు బాధితులకు న్యాయం చేయలేకపోతున్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులను చూస్తే.. ఆక్రమణదారులకు మద్దతుగా నిలుస్తున్నారనే విమర్శలొస్తున్నాయి.

**సీజ్ చేసినా ఫలితం లేదు..** విఘ్నేశ్వర సొసైటీలో 600గజాల విస్తీర్ణంలోని 968 నెంబరు ప్లాటు, దాని పక్కనున్న స్థలాన్ని కలిపి తాజాగా ఓ వ్యక్తి 2వేల గజాల విస్తీర్ణంలో నిర్మాణ పనులు చేపట్టారు. ప్రకాశ్‌రెడ్డి అనే వ్యక్తి 968వ ప్లాటు తనదంటూ జీహెచ్ఎంసీని ఆశ్రయించారు. తన స్థలంలో చేపట్టిన పనులను అడ్డుకోవాలని కోరారు. చందానగర్ సర్కిల్ కార్యాలయం అధికారులు స్థలాన్ని సీజ్ చేసి, అక్కడ నిర్మాణ పనులను చేపట్టవద్దని ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అయినప్పటికీ నిర్మాణదారు పనులు కొనసాగిస్తున్నారు. మరో ఇద్దరు ఆ స్థలం తమదేనంటూ బల్దియాను, పోలీసులను ఆశ్రయించారు. "ప్రస్తుతం ఆ భూమి బలరామయ్య అనే వ్యక్తి ఆధీనంలో ఉంది. ఆయనే పనులు చేపట్టారు. మరో ముగ్గురు యజమానులమని



పత్రాలు చూపుతున్నారు. నిజమైన పత్రాలు ఎవరివనేది న్యాయస్థానమే నిర్ణయిస్తుంది"అని పోలీసులు చెబుతున్నారు. సీజ్ చేసినా పనులు కొనసాగుతున్నాయని సర్కిల్ ఉపకమిషనర్ శశిరేఖను వివరణ కోరగా.. నిర్మాణదారుపై మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని చేతులు దులిపేసుకున్నారు. అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాల్సింది జీహెచ్ఎంసీనే అని మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ సమాధానమిచ్చారు. ఇరు శాఖల మధ్య స్పష్టత వచ్చేలోపు.. అక్కడ నిర్మాణం పూర్తవుతుంది. కట్టిన భవనాన్ని ఎలా కూల్చుతామంటూ ఇదే యంత్రాంగం కొత్త రాగం అందుకుంటుందని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లుగా యాజమాన్య వివాదం కొనసాగుతున్నందున.. అయ్యప్పసొసైటీ, దాని చుట్టూ ఉన్న హౌసింగ్ సొసైటీ భూముల్లో ఇళ్ల నిర్మాణానికి అనుమతి మంజూరవదు. స్థానిక నేతలు, అధికారులకు లంచాలిచ్చి.. ఎవరికి వారు ఇళ్లు నిర్మించుకుంటున్నారు.

## 'ఓసి'నీ.. ఇదా కనెక్షన్!


హైదరాబాద్: భవన నిర్మాణదారులు విద్యుత్తు కనెక్షన్లు పొందేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. యాభై, వంద గజాల్లో ఇళ్లు కట్టుకునే సామాన్యులు కాదు.. ఆకాశహర్మ్యాలు నిర్మిస్తున్న బడా సంస్థలే ఈ అక్రమాలకు పాల్పడుతున్నాయి. నకిలీ ఆక్యుపెన్సీ పత్రాలు (ఓసీ) సమర్పించి, ఇంజినీర్లతో కుమ్మక్కై అక్రమంగా కనెక్షన్లు పొందుతున్నాయి. విజిలెన్స్, విద్యుత్తు చౌర్య నిరోధక విభాగం (డీపీఈ) విచారణలో ఈ తరహా అక్రమాలు ఒక్కోటిగా వెలుగు చూస్తున్నాయి.

**10 మీటర్ల ఎత్తు దాటితే.. తప్పనిసరి**

విద్యుత్తు కనెక్షన్ పొందాలంటే జీహెచ్ఎంసీ/ హెచ్ఎండీఏ/ మున్సిపాలిటీల నుంచి అనుమతి తప్పనిసరి. నిర్మాణ సమయంలో కేటగిరి-8 కింద తాత్కాలిక కనెక్షన్ జారీ చేస్తారు. పూర్తయ్యాక గృహ, వాణిజ్య కనెక్షన్లు ఇస్తారు. 10 మీటర్ల ఎత్తు దాటిన భవనాలకు ఆయా సంస్థలు జారీ చేసే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ తప్పనిసరి. ఇది లేకుండా జారీ చేయవద్దని ఇటీవల హైకోర్టు సైతం డిస్కంను ఆదేశించింది. గతంలో ఓసీ లేకుండా జారీ చేసిన భవనాల కనెక్షన్లపై టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ఆదేశాల మేరకు డీపీఈ, విజిలెన్స్ విచారణ చేపట్టాయి.

**అక్రమంగా అంటగడుతున్నారు..**

నల్లగండ్ల సెక్షన్ శేరిలింగంపల్లిలో ఆర్‌డీబీ హైదరాబాద్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ 19 అంతస్తుల ఆకాశహర్మ్యాన్ని నిర్మించింది. 625 ఫ్లాట్లు నిర్మించారు. తొలుత 285 విద్యుత్తు కనెక్షన్లు కావాలని 2022 ఫిబ్రవరిలో దరఖాస్తు చేసింది. ఈ కనెక్షన్లు అన్ని 2024 డిసెంబరులో జారీ చేసినట్లు డిస్కం రికార్డులు చెబుతున్నాయి. ఓసీ సమర్పించకపోయినా 285 సర్వీసులను గృహ విభాగం కింద విడుదల చేశారు. 220 ఫ్లాట్లు ఖాళీగా ఉన్నాయి. ఇప్పటికే భవనంలోకి దిగిన వినియోగదారులు అందరికీ తాత్కాలిక కనెక్షన్ కేటగిరి-8 కిందకు మార్చేందుకు నోటీసులు జారీ చేశారు. కొందరు రియల్టర్లు విద్యుత్తు అధికారులు,



సిబ్బందితో కుమ్మక్కై అక్రమ కనెక్షన్లు పొంది కొనుగోలుదారులకు ఇళ్లను అమ్మేస్తున్నారు. ఆ తర్వాత కొన్న వాళ్లు నానాపాట్లు పడుతున్నారు.

ఓల్డ్ బోయిన్‌పల్లిలో అంజద్‌బేగ్ నాలుగంతస్తులకు అనుమతి తీసుకొని జీ+5 భవనం కట్టారు. 22 కరెంటు కనెక్షన్లు తీసుకున్నారు. విజిలెన్స్ విచారణలో ఫోర్జరీ ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ సమర్పించినట్లు గుర్తించారు. బోయిన్‌పల్లి ఐసీఎస్‌సీ ఏడీఈ రోషన్, బోయిన్‌పల్లి ఏఈ అఖిల్‌పై చర్యలకు విజిలెన్స్ సిఫారసు చేసింది.

ఇబ్రహీంబాగ్ సబ్‌డివిజన్, నార్సింగి సెక్షన్ పరిధిలో 2024 అక్టోబరులో ధాన్వి ఇన్‌ఫ్రా ఎల్‌టీఎం నుంచి దరఖాస్తు వచ్చింది. 65 ఫ్లాట్లు ఉన్నాయి. త్రీఫేజ్ 65 కనెక్షన్ల కోసం, ఒక కామన్ మీటర్‌కు దరఖాస్తు చేశారు. 2025 జులైలో వీటి కనెక్షన్లు మంజూరు చేశారు. విచారణ చేపట్టగా ఓసీ లేకుండా కనెక్షన్లు మంజూరైనట్లు గుర్తించారు. మూణ్నెళ్ల తర్వాత ఓసీని ఆన్‌లైన్ ద్వారా సమర్పించారు. విచారించగా నకిలీదని తేలింది.

# అనంతగిరి.. వైద్య సిరి

వికారాబాద్ : అనంతగిరిలోని శ్రీ అనంత పద్మనాభ కళాశాల ఎదురుగా రూ.30కోట్లతో కొత్తగా భవనాన్ని నిర్మించారు. 300పడకలను ఏర్పాటు చేశారు. ఆసుపత్రి భవనం పక్కనే రూ.16కోట్ల వ్యయంతో క్రిటికల్ కేర్ విభాగం నిర్మిస్తున్నారు. ఈ కేంద్రం కూడా ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఈ నేపథ్యంలో అందిస్తున్న కథనం.

**17 రకాల సేవలు**

కొత్తగా ప్రారంభించిన జనరల్ ఆసుపత్రిలో 17రకాల సేవలను అందిస్తున్నారు. ఈ కేంద్రంలో సాధారణ రోగుల పరీక్షలు, ప్రత్యేక వైద్య పరీక్షలు, మహిళలకు సంబంధించిన వ్యాధులను పరీక్షిస్తున్నారు. నేత్ర సమస్యలు, పిల్లల వ్యాధులు పరీక్షించి మందులు పంపిణీ చేస్తున్నారు. మానసిక రోగులకు పరీక్షిస్తున్నారు. మూడు రకాల ప్రయోగశాల పరీక్షలకు సంబంధించిన సేవలున్నాయి. పోస్టుమార్టం సేవలు, క్యాన్సర్ డే కేర్ కేంద్రం ఉన్నాయి. ఈ కేంద్రానికి 25 మంది క్యాన్సర్ రోగులను పంపించారు. ఎముకలు, దంత వ్యాధులున్న వారిని పరీక్షిస్తున్నారు. త్వరలో వయోవృద్ధులకు ప్రత్యేకమైన గదిని కేటాయించి సేవలను అందించనున్నారు. ఐసీయూ, వెంటిలేటర్లు గదులను ఏర్పాటు చేశారు. విశాలమైన గదులు, వార్డులు ఉన్నాయి.

**ఇదిగో ఇలా..**



ఆసుపత్రిలో ప్రత్యేక వైద్యులు: 80 మంది
నర్సులు: 135
ఫార్మసిస్టులు 04
ల్యాబ్ టెక్నీషియన్లు: 03
బయటి రోగులు రోజుకు: 500-600

సేవలు సద్వినియోగం చేసుకోండి

వికారాబాద్ పట్టణ ప్రజలే కాకుండా పరిసరాల ప్రాంతాల ప్రజలు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలి. ఈ ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలను అందిస్తున్నాం. రోగులను ప్రత్యేకమైన వైద్య నిపుణులు పరీక్షిస్తారు. అధునాతనమైన పరీక్షా పరికరాలుఅందుబాటులో ఉన్నాయి.
డాక్టర్. రాజ్యలక్ష్మి, సూపరింటెండెంట్

# రూ.20తో బీమా.. కుటుంబానికి ధీమా

సిరిసిల్ల : గ్రామీణ ప్రాంతాల్లో వలసలు అరికట్టడమే ధ్యేయంగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం అమలవుతోంది. పల్లెవాసులకు వ్యవసాయ పనులు లేని సమయంలో స్థానికంగా ఉపాధి కల్పించడమే ఈ పథకం ఉద్దేశం. దురదృష్టవశాత్తు పని ప్రదేశాల్లో ప్రమాదాల్లో బాధితులకు అందే సాయం ఏ మాత్రం సరిపోయేది కాదు. ప్రస్తుతం కేంద్రం ఉపాధిహామీ కూలీలకు అమలు చేస్తున్న పీఎంఎస్‌బీవై (ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన)తో అదనంగా పరిహారం అందనుంది.

**అదనపు సాయం ఇలా..**

ఈజీఎస్‌తోపాటు పీఎంఎస్‌బీవై ద్వారా అందే సాయం కుటుంబాలకు అదనంగా ప్రయోజనం చేకూరనుంది. 18 నుంచి 70 ఏళ్లలోపు ఉపాధి కూలీలు దరఖాస్తుకు అర్హులు. పోస్టాఫీస్, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఖాతాలున్న కూలీలు రూ.20 చెల్లించి నమోదు చేసుకోవాలి. అయితే ఈ పథకంపై చాలామంది కూలీలకు అవగాహన లేదు. బీమా వాటాధనం తక్కువైనా తెలియక చాలామంది చెల్లించడం లేదు. దీంతో ఉపాధిహామీ సిబ్బంది అవగాహన కల్పిస్తూ బీమా చేయిస్తున్నారు. అనుకోని ఘటనలతో కూలీ మృతి చెందినా, శాశ్వత వైకల్యం పొందిన రూ.2 లక్షలు సాయం అందుతుంది. పాక్షిక వైకల్యానికి రూ. లక్ష పరిహారం వస్తుంది. ప్రమాదాలు జరిగిన సమయంలో కూలీలకు భరోసా దక్కనుంది.

**కేంద్రం ఆదేశాలు..**

జిల్లాలోని 12 మండలాల పరిధిలో ఉపాధిహామీ పనులు జరుగుతున్నాయి. ఈ ఏడాది కేంద్రం 12 లక్షల పనిదినాలు కేటాయించగా ఇప్పటికే 10 లక్షల పనిదినాలు పూర్తయ్యాయి.
కార్డులో సుమారు 1.99 లక్షల మంది నమోదైనప్పటికీ యాభై శాతం మాత్రమే జనాలు ఉపాధి హామీ పథకంలో ఆర్థికంగా లబ్ధి



పొందుతున్నారు. మిగతావారు ప్రభుత్వ ప్రయోజనాలకు నమోదై ఉన్నారు. - పనులకు హాజరయ్యే కూలీల్లో నిరుపేద కుటుంబాలే అధికం. వృద్ధాప్యంలో సైతం కుటుంబ పోషణకు ఉపాధి పనులకు వస్తున్నారు. కూలీల శ్రమ ఫలితంగా జిల్లాలో పనులు బహుళ ప్రయోజనాలు ఇస్తున్నాయి. ఇక్కడి వరకు బాగానే ఉన్నా పని ప్రదేశాల్లో ఏవైనా అనుకోని ప్రమాదాలు బాధితులకు నిబంధనల ప్రకారం పరిహారం అందేది. మరణం సంభవిస్తే రూ.2 లక్షలు, అంగవైకల్యానికి రూ.లక్ష, గాయాలకు అవసరమైన వైద్య ఖర్చులు అందేవి. ఈ సాయం కుటుంబాలకు ఏమాత్రం సరిపోయేది కాదు. దీంతో అదనంగా సాయం అందించాలని కేంద్ర ప్రభుత్వం పీఎంఎస్‌బీవైని కూలీలకు వర్తింపజేయాలని ఆదేశాలిచ్చింది.

జిల్లా వివరాలు
గ్రామాలు 260
ఉపాధి హామీ కార్డులు 98,036
కార్డుల్లో సభ్యులు 1,99,728
యాక్టివ్ కార్డులు 60,697
యాక్టివ్ సభ్యులు 93,353

# అడిగినంత ఇస్తే.. 'రెడీ'మిక్స్



హైదరాబాద్ : కొల్లూరు సమీపంలోని ఉస్మాన్‌నగర్‌లో నివాసాలకు సమీపంలోనే రెడీమిక్స్ కాంక్రీట్ (ఆర్ఎంసీ) యూనిట్ ఏర్పాటైంది. వసూళ్లకు అలవాటు పడిన ఓ అవినీతి అధికారి నిర్వాకంతో నిబంధనలకు విరుద్ధంగా ఇప్పటికీ ఆ యూనిట్ నడుస్తోంది. దుమ్ము, వాయు కాలుష్యంతో ఈ ప్రాంతవాసులు ఇబ్బందులు పడుతున్నారు. వరుస ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా చర్యలు శూన్యం. ఇలా ఈ ఒక్కచోటే కాదు, నిబంధనలకు విరుద్ధంగా ఓఆర్ఆర్‌కు అతి సమీపంలో అనేక చోట్ల అక్రమ యూనిట్లు వెలిశాయి.

**యూనిట్‌కు రూ.3 లక్షలు..** నిబంధనలు ఎలా ఉన్నా.. ఆమ్యామ్యా ఇస్తే ఆర్ఎంసీలకు అనుమతి వచ్చినట్టే. ఓ పీసీబీ ఉన్నతాధికారి నిర్వాకంతో నకిలీ పత్రాలు సృష్టిస్తున్నారు. ఆర్ఎంసీ, క్రషర్లకు అనుమతుల జారీలో అవకతవకలు జరుగుతున్నాయని గుర్తించి ప్రాంతీయ స్థాయిలో అనుమతులు జారీ చేయొద్దని పీసీబీ సభ్య కార్యదర్శి ఆదేశించినా పట్టించుకున్న దాఖలాలు లేవు. యూనిట్‌కు సుమారు రూ.3లక్షల చొప్పున వసూలు చేస్తూ ఇష్టానుసారం అనుమతులివ్వడంతో నిషేధిత ప్రాంతాల్లో పుట్టగొడుగుల్లా ఈ యూనిట్లు వెలిశాయి.

**'కన్సల్టెన్సీ'లో హాజరు.. ఆ తర్వాతే అనుమతి**

ఎంతో చాకచక్యంగా వ్యవహరిస్తున్న సదరు అధికారి శేరిలింగంపల్లిలో కుటుంబ సభ్యులు, కిందిస్థాయి సిబ్బందితో కలిపి ఓ ఏజెన్సీని ఏర్పాటు చేశారు. అక్కడ హాజరు వేసిన తర్వాతే కార్యాలయంలో అడుగుపెట్టాలంటూ హుకుం జారీ చేశారు. అక్కడ పచ్చజెండా ఊపితేనే ఇక్కడ కాగితాలు ముందుకు కదులుతాయనేలా వ్యవహారం సాగుతోంది. దీంతో ప్రయివేటు దందా చేసేవారంతా కన్సల్టెన్సీని సంప్రదించి అడిగినంతా ముట్టజెబుతున్నారు. అనంతరం కన్సల్టెన్సీ వారు రోడ్ల నిర్మాణం, ప్రభుత్వ కాంట్రాక్టు పనులు అంటూ ఇంజినీరింగ్ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు నకిలీ పత్రాలు సృష్టించి కార్యాలయానికి పంపితే ఇట్టే అనుమతులు జారీ అవుతున్నాయి. ఇలా కొల్లూరు, నల్లగండ్ల, బీహెచ్ఇఎల్, పటాన్‌చెరు, తెల్లాపూర్, లింగంపల్లి, అమీన్‌పూర్, సుల్తాన్‌పూర్ ప్రాంతాల్లో పదుల సంఖ్యలో యూనిట్లు ఏర్పాటయ్యాయి. దుమ్ము రేగకుండా స్ప్రింక్లర్లు, క్లోజ్డ్‌షెడ్‌లో ఆర్ఎంసీని ఏర్పాటు చేయాలన్న నిబంధనను పట్టించుకోకపోవడంతో విపరీతంగా కాలుష్యం నమోదవుతోందంటూ స్థానికులు వాపోతున్నారు.

# రూపాయి రాకెంత.. పోకెంత?



తాండూరు: జిల్లాలోని గ్రామ పంచాయతీలకు మంజూరైన నిధులు, ఆదాయం, వివిధ పనులకు చేసిన వ్యయాలపై ఉన్నతాధికారులు లెక్కలు తీసే పనిలో నిమగ్నమయ్యారు. నిర్ణీత ఫార్మాట్‌లో వివరాలను పంపించాలని ప్రభుత్వం పంచాయతీరాజ్‌శాఖను ఆదేశించింది. అన్ని పంచాయతీల కార్యదర్శులు ఆ పనుల్లో నిమగ్నమయ్యారు. 2019 ఏప్రిల్ నుంచి 2025 మార్చి చివరకు సంబంధించిన ఆదాయ, వ్యయాలు, మంజూరైన నిధుల దస్త్రాలు పరిశీలించి వివరాలను నమోదు చేస్తున్నారు.

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులే ఎక్కువ**

ఆర్థిక సంవత్సరాల వారీగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రామ పంచాయతీలకు 2011 జనాభా ప్రాతిపదికన ప్రతి మూడు నెలలకు ఒకసారి కేంద్ర ప్రభుత్వం నుంచి, రెండు నెలలకోసారి రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరవుతాయి. ఈలెక్కన ఎక్కువ జనాభా ఉన్న పంచాయతీలకు రూ.లక్షల్లో మంజూరైతే తక్కువ జనాభా ఉన్న వాటికి రూ.వేలల్లోనే విడదలయ్యాయి. పంచాయతీలకు 2024 మార్చి నుంచి పాలక వర్గాలు లేవు. ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది. దీంతో నిధుల మంజూరులో స్తబ్ధత నెలకొంది. అందుబాటులో ఉన్న సాధారణ నిధులతోనే కార్యకలాపాలు కొనసాగిస్తూ వచ్చారు. అయితే చేసిన పనులకు వెచ్చించిన నిధులెన్ని అనే వివరాలను ఆరా తీస్తున్నారు.

**అంశాల వారీగా..**

గ్రామ పంచాయతీల్లో అమలయ్యే పదిహేను అంశాల వారీగా చేసిన ఖర్చు పద్దులకు సంబంధించి లెక్కలు అడుగుతున్నారు. సంతలు (తైబజార్‌లు), మార్కెట్లు, కార్యాలయం నిర్వహణ, మౌలిక వసతులు, వీధి దీపాలు, పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బంది వేతనాలు, సాంకేతిక నైపుణ్యం, దళిత, గిరిజన సంక్షేమం, చిన్నారులు, మహిళల భద్రత, కుటుంబ ఆరోగ్య సంరక్షణ, తాగునీటి వనరుల నిర్వహణ, పారిశుద్ధ్యం అంశాలున్నాయి.

గ్రామ పంచాయతీల్లో సంతల నిర్వహణకు ఏడాది కోసారి తైబజార్ వేలం వేస్తారు. నీటి శుద్ధి ప్లాంట్లు ఉంటే వాటి నిర్వహణకు వేలం వేస్తారు. వచ్చిన ఆదాయాన్ని దేని కోసం వ్యయం చేశారు? ఎంత చేశారు? వివరాలను వెల్లడించాల్సి ఉంటుంది.

మంజూరైన నిధులను ఏ పనికి ఎంత వ్యయం చేశారు. మిగిలిన డబ్బులు ఎన్ని? చేసిన పనికి డబ్బులు సరిపోక పోతే వేరొక పద్దు నుంచి ఎంత మేరకు తీసుకుని ఖర్చు చేశారు. అనే వివరాలను వెల్లడించాల్సి ఉంది.

ఇవీ వివరాలు
మండలాలు: 20
గ్రామ పంచాయతీలు: 594
వార్డులు: 5,058

**వివరాలు పంపించాలని ఆదేశించాం**

జిల్లాలోని అన్ని పంచాయతీ కార్యదర్శులను 2019 నుంచి 2025 వరకు నిధుల మంజూరు వ్యయాలకు సంబంధించిన వివరాలను పంపించాలని కార్యదర్శులను ఆదేశించాం. ఉన్నతాధికారులు ఆదేశించిన మేరకు పద్దుల వారీగా లెక్కలు అడుగుతున్నాం. జయసుధ, జిల్లా పంచాయతీ అధికారిణి

# ప్రచారం చేస్తున్నా.. ఫలితం లేదు



జమ్మికుంట : శుభకార్యాలు, చిన్నపాటి వేడుకలు, విందులు ఇలా కార్యక్రమం ఏదైనా ప్లాస్టిక్ వస్తువులు అనివార్యంగా మారాయి. ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు తదితర రకాల వస్తువులకు స్వస్తి పలికి పర్యావరణాన్ని కాపాడే దిశగా జిల్లాలో ఎంపిక చేసిన పురపాలికల పరిధుల్లో ఏర్పాటు చేసిన బర్తన్(స్టీల్) బ్యాంక్‌ల వినియోగం తక్కువగా ఉంది. స్టీల్ సామగ్రి తక్కువ ధరకు అద్దెకు ఇస్తున్నా.. పుర, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) అధికారులు ప్రచారం చేసినా స్పందన నామమాత్రంగానే కనిపిస్తోంది.

**14 రకాల సామగ్రి**

ఏడాది క్రితం మెప్మా ఆధ్వర్యంలో జమ్మికుంట పాత మున్సిపల్ కార్యాలయంలో స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేశారు. వండే పాత్రలు, 200 స్టీల్ ప్లేట్లు, గ్లాసులు, నీటి జగ్గులు, ఆహార పదార్థాలు వడ్డించే బకెట్లు తదితర 14 రకాల సామగ్రి అందుబాటులో ఉంచారు. మెప్మా చేయూతతో రూ.55 వేల విలువతో కేంద్రాన్ని ప్రారంభించారు. చిన్నపాటి వేడుకకు సామగ్రి అద్దె రోజు రూ.2,536 నిర్ణయించినా స్పందన కనిపించటం లేదు. ఏడాది కాలంలో రూ.16,500 ఆదాయం లభించింది. మున్సిపల్ ఆధ్వర్యంలోని కార్యక్రమాలు, ఓ ప్రైవేట్ వ్యక్తి మాత్రమే ఉపయోగించుకున్నారు. హుజూరాబాద్‌లో ఒకటి, కరీంనగర్ నగరపాలికలో 7 బర్తన్ బ్యాంక్‌ల నిర్వహణ గ్రామైఖ్య సంఘాల ఆధ్వర్యంలో జరుగుతోంది. హుజూరాబాద్‌లో రెండేళ్ల క్రితం రూ.40వేల పెట్టుబడితో ఏర్పాటు చేయగా.. రూ.21వేల ఆదాయం లభించింది. తక్కువ ధరకే అద్దెప్లాస్టిక్ నిర్మూలనలో భాగంగా జమ్మికుంట పాత మున్సిపల్ కార్యాలయంలో బర్తన్ బ్యాంక్‌ను ఏర్పాటు చేశాం. చిన్నపాటి వేడుకలకు సరిపడేలా 14 రకాల స్టీల్ సామగ్రిని తక్కువ ధరకే అద్దెకు ఇస్తున్నాం. పుర పరిధిలోని మహిళా సంఘాలు, ప్రజలు వినియోగించుకోవాలి.

# వన్యప్రాణులతో కర్షకుల్లో కలవరం

వీర్నపల్లి : మెడలో ఒడిసెతో పొలానికి కాపలాగా ఉన్న ఈ రైతు పేరు పిట్టల చిన్న లింబయ్య. కంచర్లకు చెందిన ఈయన.. అటవీ సరిహద్దులో రెండు ఎకరాల విస్తీర్ణంలో పత్తి, అర ఎకరంలో వరి సాగు చేశారు. ప్రస్తుతం పత్తి కాతకు వచ్చింది కానీ.. నిత్యం వానరాలు పంట పొలంపై దాడికి దిగుతున్నాయి. రాత్రి వేళలో పత్తిని ఆనుకుని ఉన్న వరి పొలంలోకి అడవి పందులు వస్తున్నాయి. దీంతో భోజన సమయం మినహా రోజంతా లింబయ్య అక్కడే ఉంటున్నారు. సవాళ్లను అధిగమించి పంట సాగు చేసిన రైతులను అడవి జంతువులు



కలవర పెడుతున్నాయి. వనాల సరిహద్దులోని పంట పొలాలపై వరుస దాడులకు దిగుతున్నాయి. అన్నదాతల ఆరుగాలం కష్టాన్ని ఒక్క రాత్రిలోనే తుడిచిపెడుతున్నాయి. ఫలితంగా కర్షకులు రేయింబవళ్లు వ్యవసాయ క్షేత్రాల్లో కాపలా కాయాల్సిన పరిస్థితి నెలకొంది.

**ఇదీ పరిస్థితి**

మెట్టప్రాంతమైన రాజన్న సిరిసిల్ల జిల్లాలో బోరుబావులు ప్రధాన ఆధారం. గతంతో పోలిస్తే భూగర్భ జలాలు పెరగడంతో ఆరుతడి పంటలతో పోలిస్తే వరిసాగుకు అన్నదాతలు ఆసక్తి కనబరుస్తున్నారు. ఆ తర్వాత స్థానంలో పత్తిని వేస్తున్నారు.

వరి ఇప్పటికే చేతికి రాగా, పత్తి పంట కాత దశలో ఉంది. చివరి దశలో పంటలపై వన్యప్రాణుల దాడులు పరిపాటిగా మారాయి. అటవీ సరిహద్దు గ్రామాల్లో వరిపై అడవిపందులు, దుప్పులు, మనుబోతులు, జింకల దాడులు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

పత్తి చేలల్లో వానరాలు, పక్షులు, మర్నాగిలు కలవరపెడుతున్నాయి. అడవిలో ఉండాల్సిన జంతువులు పంట పొలాల్లోకి రావడంతో అన్నదాతలు కమతాలకు కాపలాగా ఉండాల్సి వస్తుంది.

ఇటీవల వీర్నపల్లి, చందుర్తి మండలాల్లో అడవి పందులు పదుల ఎకరాల్లో పంటను ధ్వంసం చేశాయి. దీంతో పగలు, రాత్రి తేడా లేకుండా పొలాల వద్ద ఉంటున్నారు. పత్తి రైతులు కోతులను తరిమేందుకు కూలీలను పెడుతుండటం సమస్యకు అద్దం పడుతోంది.

**జిల్లాలో ఇలా..**

అటవీ సరిహద్దు గ్రామాలు: 64
సాగు విస్తీర్ణం: 2.4 లక్షల ఎకరాలు
వరి సాగు: 1.84 లక్షలు పత్తి: 49,760
ఇతర పంటలు: 9,153

# పత్తి రైతులకు అధనపు భారం..

కొణిజర్ల : అధిక వర్షాలతో పత్తి దెబ్బతింది.. పంట కళకళలాడుతున్న తరుణంలో ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలకు కాయలు నల్లబడి ఆగం కావడంతో పాటు పత్తిపై తీవ్ర ప్రభావం పడింది. వాతావరణ పరిస్థితుల వల్ల కొన్నేళ్లుగా పత్తి సగటు దిగుబడి ఐదు క్వింటాళ్లకు మించి రావడం లేదు. అన్నదాతలు ఈ పంటను సాగుచేయడానికి వెనకడుగు వేస్తున్నారు. మరో పంటను వేయలేక నష్టాలు వస్తున్నా సాగు చేయాల్సిన పరిస్థితి. ప్రస్తుతం పత్తి రైతులను కూలీల కొరత వేధిస్తోంది.

గతేడాది ఈ సమయంలో పత్తి తీసేందుకు కిలోకు రూ.10 చెల్లించిన రైతులు ప్రస్తుతం రూ.15 చెల్లిస్తున్నారు. మరికొందరు రోజు కూలీ రూ.350వరకు ఇవ్వాల్సి రావడంతో అదనపు భారం పడుతోంది. వర్షాల వల్ల కాయల్లోకి నీరు వెళ్లి సరిగ్గా విచ్చుకోలేదు. ఈ పరిస్థితి వల్ల అందులోని పత్తిని తీసేందుకు కూలీలకు అధిక సమయం పడుతోంది. అందుకే ఎక్కువ కూలి అడుగుతున్నారు. మొదటి పత్తితీత ఎకరాకు రెండు క్వింటాళ్ల వరకు వస్తోంది. ఇందుకోసం కూలీలకు రూ.1,500 అవుతుండగా, పొలం నుంచి ఇంటి వరకు పత్తిని రవాణా చేసేందుకు రూ.700 వరకు వెచ్చించాల్సి వస్తోంది. తీసినదాన్ని తరుగుపోను అమ్మినా గిట్టుబాటయ్యే పరిస్థితి లేదు.

**సగటు దిగుబడి గగనం..**



ఈ ఏడాది అధిక తేమ వల్ల పత్తి ఎర్రబారటం, వర్షాల వల్ల కాయల్లోకి నీరు చేరి నల్లబడి రాలిపోయాయి. కొణిజర్ల, ఏన్కూరు, జూలూరుపాడు, సుజాతనగర్, తిరుమలాయపాలెం, కూసుమంచి, బోనకల్లు, రఘునాథపాలెం, ఇల్లెందు మండలాల్లో పత్తి అధికంగా దెబ్బతింది. సీసీఐ కేంద్రాలు లేకపోవడంతో క్వింటా రూ.3వేల చొప్పున మాత్రమే అమ్ముకోవాల్సిన పరిస్థితి.

విస్తీర్ణం ఇలా.. (ఎకరాల్లో)
ఖమ్మం: 2,25,613
భద్రాద్రి: 2,40,345

కూలీల కొరత, వర్షాలు వస్తుండటంతో ఉన్న కొద్ది పత్తిని తీయడానికి కష్టాలు పడుతున్నాం. కాయలు నల్లబడి రాలిపోయాయి. ఎకరాకు నాలుగైదు క్వింటాళ్ల దిగుబడే వచ్చే పరిస్థితి ఉంది. సుమన్, మల్లుపల్లి

# వీడాలి.. 'చెక్కు'ముడి..!

వైరా : వైరా పురపాలిక ఖజానాకు చిల్లు పడింది. ఓ ఉద్యోగి తన పేరిట రూ.50లక్షలకు పైగా విలువైన 25 చెక్కులను రాసుకుని డ్రా చేసుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పురపాలికలో జరిగే అభివృద్ధి పనులు, వాహన మరమ్మతులు, సామగ్రి కొనుగోలు సహా ప్రతి అంశానికి చెల్లించే చెక్కుల బాధ్యతలు తన వద్దే ఉండటంతో సదరు ఉద్యోగి ఆలోచన పక్కదారి పట్టింది.

**నిబంధనల ప్రకారం..** ఉద్యోగుల పేరిట ఏ ఒక్క చెక్కు రాయకూడదు.. మున్సిపాలిటీ పనులు, కొనుగోళ్లకు చెందిన చెల్లింపులు జరపకూడదు. మున్సిపాలిటీ నుంచి ఏమైనా కొన్నా లేదా చేపట్టిన పనులకు ఇతర వ్యక్తులు లేదా సంస్థల పేరిట చెక్కులు ఇవ్వాలి. ప్రతి చెక్కు నంబర్, చెల్లింపు విలువ, ఏ పనికి ఇస్తున్నామనే వివరాలను క్యాష్‌బుక్‌లో నమోదుచేయాలి. ఉద్యోగి తన పేరిట రాసుకున్న 25 చెక్కుల్లో 13 చెక్కుల వివరాలను క్యాష్‌బుక్‌లో నమోదు చేయకపోవటం గమనార్హం. **ఏం జరిగింది?** నూతన కమిషనర్ గురులింగం ఈ ఏడాది ఆగస్టు మూడో వారంలో బాధ్యతలు చేపట్టారు. నెల క్రితం కొత్తగా అకౌంట్స్ బాధ్యతలు స్వీకరించిన అధికారి ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. గత ఏడాది కాలంలో అక్రమాలు జరిగాయని గుర్తించారు. చెక్కుల అవినీతిపై కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు ఇటీవల లిఖితపూర్వక ఫిర్యాదు వెళ్లింది.

# వీడని వరద!

కనిగిరి : మొంథా తుపాను తీరం దాటి 48 గంటలు గడిచినా జిల్లాలో దాని ప్రభావం కొనసాగుతోంది. పశ్చిమ ప్రకాశం నుంచి ప్రవహిస్తున్న పాలేరు, ముసి, గుండ్లకమ్మ నదులు తూర్పున బంగాళాఖాతంలో కలుస్తాయి. మార్గమధ్యలో మూడు నదులకు అనుసంధానంగా పలుచోట్ల వాగులున్నాయి. ఆ మూడు నదులు ఉగ్రరూపం దాల్చడంతో జిల్లా వ్యాప్తంగా వాగులు, వంకలు, చెరువులు పొంగి పొర్లుతున్నాయి. నాలుగో రోజైన కూడా పలు గ్రామాల మధ్య వంతెనలు, రహదారులపై వరదనీరు ఉద్ధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. గుండ్లకమ్మ జలాశయం గేట్లు ఎత్తడంతో దిగువన ఉన్న మద్దిపాడు, నాగులుప్పలపాడు, ఒంగోలు మండలాల్లోని 12 గ్రామాల్లోకి నీరు చేరింది. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడు వద్ద ప్రధాన రహదారిపై భారీగా వరద నీరు ప్రవహిస్తుండడంతో ఒంగోలు-చీరాల మధ్య వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.



**రహదారులకు రూ.21 కోట్ల నష్టం**

జిల్లాలోని పంచాయతీరాజ్ పరిధిలోని 12 వంతెనలతోపాటు 15 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతినగా రూ.11.98 కోట్ల మేర నష్టం జరిగింది. ఆర్అండ్‌బీ పరిధిలో మొత్తం 375 కిలోమీటర్ల మేర రహదారులు కోతకు గురికాగాబీ రూ.9 కోట్ల మేర నష్టం వాటిలినట్లు ప్రాథమిక అంచనా వేశారు. చదలవాడ విద్యుత్తు ఉపకేంద్రంలోకి వరదనీరు చేరడంతో రూ.1.50 కోట్లు, ఒంగోలులోని స్టోర్ రూంలోకి నీరు చేరడంతో రూ.50 లక్షల విలువైన సామగ్రి దెబ్బతింది. పరివర్తకాలు, స్తంభాలు నేలకొరగడంతో మరో రూ.2 కోట్లు నష్టం వాటిల్లింది.

**పునరావాస కేంద్రాల్లో 9,335 మంది**

ఒంగోలు నగరంతోపాటు జిల్లాలోని 27 మండలాల్లో లోతట్టు ప్రాంతాలకు చెందిన వరద బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 125 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయగా, 3,346 కుటుంబాలకు చెందిన 9,335 మందిని తరలించారు. రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో భోజన, అల్పాహారం, తాగునీటి వసతి కల్పించారు.

# ప్రభుత్వ వాహనం.. ప్రైవేటు పెత్తనం

నెల్లూరు : 'నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రభుత్వం 26 స్వీపింగ్ వాహనాలను మంజూరు చేసింది. రోడ్లను శుభ్రం చేసేందుకు వీటిని వినియోగించాల్సి ఉంది. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ 50శాతం, నగరపాలక సంస్థ 50 శాతం నిధులు ఖర్చు చేసి వీటిని కొనుగోలు చేశారు. 26 వాహనాల్లో 5 చిన్నవి ఉండగా- రెండు బ్యాటరీతో నడిచేవి ఉన్నాయి.'ఎక్కడైనా ప్రైవేటు వాహనాలను ప్రభుత్వం అద్దెకు తీసుకోవడం చూశాం. నెల్లూరు నగరపాలక సంస్థలో మాత్రం ప్రభుత్వ వాహనాల నిర్వహణను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించడంతో పాటు గంటకు రూ. 1485 చొప్పున చెల్లిస్తుండటం గమనార్హం. దీంతో ప్రజలు పన్నుల రూపంలో చెల్లిస్తున్న ప్రజాధనాన్ని అధికారులు, కొందరు పాలకులు కాంట్రాక్టర్లకు దోచిపెడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**24 కోట్ల కేటాయింపు**

ప్రభుత్వ వాహనాల పెత్తనాన్ని ప్రైవేటుకు అప్పగించిన అధికారులు... డ్రైవరు, ఆయిల్, రెండేళ్లపాటు నిర్వహణకు రూ. 24 కోట్ల నగరపాలక సంస్థ సాధారణ నిధులు కేటాయించారు. రోజూ ఒక్కో వాహనం 8 గంటలపాటు రోడ్లను శుభ్రం చేయాల్సి ఉండగా- గంటకు రూ. 1485 చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. గుత్తేదారులు మాత్రం రోజుకు మూడు గంటలు కూడా పనిచేయడం లేదు. రాత్రిళ్లు రోడ్డు పక్కన నిలిపి నిద్రపోతున్నారు. పగలు మినీ స్వీపింగ్ యంత్రాలు అంతర్గత రహదారులను శుభ్రం చేయాల్సి ఉండగా.. ఈ ప్రక్రియ మొక్కుబడిగానే సాగుతోంది. కార్పొరేషన్‌లో 30 మంది వరకు డ్రైవర్లు అదనంగా ఉండటంతో పాటు డీజిల్ బంకు ఉన్నా.. ప్రైవేటు సంస్థలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఓ వైపు 105 ట్రాక్టర్లతో పాటు కార్లు అద్దెకు తీసుకుని నిర్వహిస్తూ.. మరోవైపు ప్రభుత్వ వాహనాల నిర్వహణ బాధ్యతను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం ఏమిటన్న ప్రశ్న ఎదురవుతోంది. వాహనాల పార్కింగ్‌కూ కార్పొరేషన్‌లోనే కేటాయించడం గమనార్హం.



**జీపీఎస్.. ఆపై పర్యవేక్షణ**


స్వీపింగ్ వాహనాలకు జీపీఎస్‌ఉంది. ఇద్దరు సూపర్‌వైజర్లు పర్యవేక్షిస్తున్నారు. రోడ్లను శుభ్రం చేయకుంటే పరిశీలించి.. చర్యలు తీసుకుం టాం.
రామమోహన్‌రావు, కార్పొరేషన్ ఎస్‌ఈ

స్వీపింగ్ వాహనాలు: 26
నిర్వహణకు గంటకు చెల్లింపు: రూ.1485
రోజుకు 8 గంటలకు : రూ.11,880
26 వాహనాలకు రోజుకు: రూ.3,08,880
నెలకు చెల్లింపు: రూ.92,66,400

# గర్జించిన గుండ్లకమ్మ!

ఒంగోలు : జిల్లాలో ఎంతో కీలకమైన గుండ్లకమ్మ జలాశయం గర్జించింది. వరదనీటితో ఉప్పొంగింది. ఒంగోలు, చీమకుర్తి, నాగులుప్పలపాడు, మద్దిపాడు మండలాల ప్రజల సాగు, తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఈ జలాశయం నిర్మాణం చేపట్టారు. దీని ద్వారా ఖరీఫ్‌లో 62 వేల ఆయకట్టు, రబీలో 80 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు,. అద్దంకి, సంతనూతపాడు, ఒంగోలు నియోజకవర్గాల్లోని గ్రామాలకు తాగునీరు అందిస్తున్నారు. 2008లో ప్రాజెక్టు నిర్మాణం పూర్తయిన అనంతరం ఇప్పటి వరకు గరిష్ఠంగా 75 వేల క్యూసెక్కుల నీటిని మాత్రమే దిగువకు విడుదల చేశారు. మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు భారీగా వరద నీరు చేరడంతో 1.30 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. అర్ధరాత్రి నుంచి లక్షకుపైగా క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరడంతో అన్ని గేట్లు ఎత్తి సముద్రంలోకి వదిలిపెట్టారు. వరద ప్రవాహం తగ్గడంతో నీటి విడుదల తగ్గిస్తూ వచ్చారు. నిండుకుండలా ఉన్న జలాశయాన్ని, దిగువకు గలగల పారే నీటి గలగలలను తామెప్పుడూ ఈ స్థాయిలో చూడలేదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# వాడని సిమ్‌కార్డులను తొలగించుకున్నారా?



చెన్నేకొత్తపల్లి: ఇప్పటివరకు సైబర్ మోసగాళ్లు మొబైల్ ఫోన్‌లకు అవాంఛిత లింకులు పంపి నగదు కాజేసిన సంఘటనలు ఉన్నాయి. వినియోగంలోని లేని సిమ్ ద్వారా మోసాలకు పాల్పడిన ఘటన ఇటీవల చెన్నేకొత్తపల్లిలో వెలుగులోకి వచ్చింది. ఈనేపథ్యంలో మీ పేరున ఎన్ని సిమ్‌కార్డులు ఉన్నాయి? వాటిని తెలుసుకోవడం ఎలా? అవసరం లేకుంటే వాటిని తొలగించుకోవడం లేదా డి యాక్టివేట్ చేయడం వంటి విషయాలను దశల వారీగా తెలుసుకుందాం.
మొదట మీ మొబైల్‌లో బ్రౌజర్‌లో 'సంచార్ సాథీ (ఎస్ఏఎన్‌సీహెచ్ఏఆర్ ఎస్ఏఏటీహెచ్ఐ) పోర్టర్'ను సందర్శించి దానిపై క్లిక్ చేయాలి. అందులో కేంద్ర మంత్రి జ్యోతిరాధిత్యాయ సింధియా, రాష్ట్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఫొటోలు కనిపిస్తాయి. వాటిని పైకి జరిపితే సిటిజన్ సెంట్రిక్ సర్వీసెస్ ఐచ్ఛికాలు కనిపిస్తాయి.
అందులో 'నో మొబైల్ కనెక్షన్స్ ఇన్ యువర్ నేమ్' అనే ఇచ్ఛికం కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేయాలి.
వచ్చిన ఐచ్ఛికాలను కొంచెం పైకి జరిపితే 'పది అంకెల మొబైల్ నంబరు' ఐచ్ఛికం కనిపిస్తుంది. అందులో మీ ఫోన్ నంబరు నమోదు చేయాలి. ఆ నంబర్ మీ ఆధార్ నంబర్‌కు లింక్ అయి ఉండాలి.
తరువాత 'క్యాప్చా' నమోదు చేయాలి.
మీ మొబైల్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. దాన్ని 'ఓటీపీ' అని ఉన్నచోట నమోదు చేయాలి.మీ పేరున నమోదైన మొబైల్ నంబర్లు కనిపిస్తాయి. వాటి పక్కనే 'నాట్ మై నంబర్', 'నాట్ రిక్వైర్డ్' 'రిక్వైర్డ్' అనే ఐచ్ఛికాలు కనిపిస్తాయి.

**అవసరంలేని వాటిపై క్లిక్ చేసి, రిపోర్ట్ చేయాలి**

మీ రిపోర్ట్ ఆధారంగా నంబర్లు డీ యాక్టివేట్, లేదా యాక్టివేట్ అవుతాయి. ఈవిధంగా మీ పేరున ఉన్న మొబైల్ సిమ్ నంబర్లను తెలుసుకుని అవసరం లేని వాటిని సులభంగా తొలగించుకోవచ్చు.
ఎన్ని తీసుకోవచ్చు..సిమ్‌కార్డు కొనుగోలు చేసేందుకు ఆధార్ లింకును కేంద్ర టెలికామ్ రంగ సంస్థ తప్పనిసరి చేసింది. ఒక వ్యక్తి తన ఆధార్‌తో 9 సిమ్‌కార్డులు తీసుకోవచ్చు జమ్ము, కశ్మీర్, అస్సాం, ఈశాన్య రాష్ట్రాల్లో 6 సిమ్ కార్డులు తీసుకోవచ్చనే నిబంధన ఉంది.

# చోటా నాయకుల బడా దందా!!



విశాఖపట్నం: మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) వార్డుల్లో చోటా నాయకులు కొందరు బడా దందాకు తెరలేపారు. అదనపు అంతస్తు ఆరంభించినా, కొత్త నిర్మాణం చేపట్టినా అక్కడ వాలిపోతున్నారు. కూటమి, వైకాపా కార్పొరేటర్ల పేరుతో స్థానిక నేతలు ఆ భవన నిర్మాణదారుల నుంచి డబ్బులు భారీగా గుంజుతున్నారు. చెప్పినంత సమర్పించకపోతే, అక్రమ నిర్మాణాలంటూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ఫిర్యాదులు చేయిస్తూ అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. అక్కడితో ఆగడం లేదు. కొన్ని చోట్ల స్థానిక సచివాలయ, పట్టణ ప్రణాళిక సిబ్బందితో కుమ్మక్కై భవన యజమానులను బెదిరించి జేబులు నింపేసుకుటున్నారు.

**వెంటాడి వేధిస్తూ...**

నగరంలో కంచరపాలెంలో నివాసం ఉంటున్న దుర్గాప్రసాద్ టైల్స్ పనులు చేస్తూ జీవనం చేస్తుంటారు. ఇంటిపై అదనపు అంతస్తు నిర్మిస్తుండగా.. సచివాలయ సిబ్బంది నీ జోలికిరాకుండా ఉండలాంటే రూ.2లక్షలు ఇవ్వాలంటూ కొందరు నాయకులు డిమాండ్ చేశారు. ప్లాన్ అనుమతులు పొంది పైకప్పు వేస్తుండగా అడ్డుకున్నారు. అక్రమ నిర్మాణం అంటూ ఫిర్యాదులు చేయించారు. మనస్తాపంతో సదరు యజమాని ఆత్మహత్యాప్రయత్నం చేయడం నగరంలో కలకలం రేపింది. పేద, మధ్యతరగతి ప్రజలు సొంతింటి కలను నిజం చేసుకునేందుకు అడుగులు వేస్తే... నిబంధనల ఉల్లంఘన, సెట్‌బ్యాక్‌లు వదల్లేదు, అదనపు అంతస్తులకు అనుమతుల్లేవు అంటూ బెదిరించి రక్తం పీల్చే జలగల్లా ముక్కుపిండి డబ్బులు వసూలు చేయడం చర్చనీయాంశమవుతోంది.

**వాళ్లకు చెప్పాలంట:** వార్డుల్లో ఎవరైనా ప్లాన్ అనుమతి పొందినా తమ దృష్టికి రాకుండా నిర్మాణం చేయొద్దని కొందరు కార్పొరేటర్లు, ఎమ్మెల్యేల అనుచరులుగా ఉండే చోటా నాయకులు హుకుం జారీ చేస్తున్నారు. నిర్మాణాన్ని బట్టి రూ. లక్ష నుంచి రూ. 2 లక్షల వరకూ వసూలు చేస్తున్నారు. గోపాలపట్నం, పెందుర్తి, కొమ్మాది, మధురవాడ పరిధిలో ఎక్కువ నిర్మాణాలు జరుగుతుండటంతో అక్కడ కొందరు భారీగా దందా చేస్తున్నారు. గాజువాక పరిధిలో దువ్వాడ, షీలానగర్, అగనంపూడి, జగ్గయ్యపాలెం, కూర్మన్నపాలెం శివారు కాలనీల్లో ఈ తరహా ఘటనలపై ఎక్కువగా ఫిర్యాదులందుతున్నాయి. తూర్పు పరిధిలోని 15, 17, 21, 23వార్డుల్లో నిర్మాణాల వద్ద వసూళ్లలో కూటమి చోటా నాయకుల హడావుడిపై చర్చ సాగుతోంది. 29వ వార్డు, సీతంపేట, 39వ వార్డుల్లో కొందరు చక్రం తిప్పుతున్నారు. విశాఖ ఉత్తరం పరిధిలో 46, 47, 51, 54 వార్డుల్లో ఇదే తరహాలో బెదిరింపులు ఎక్కువ ఉన్నాయి.అంతా కలిసి: సోషల్ మీడియా, సహ చట్టం ముసుగులో కొందరు, స్థానిక చోటా నాయకులు సచివాలయాల్లో వార్డు ప్లానింగ్ సెక్రటరీలతో కుమ్మక్కై చక్రం తిప్పుతున్నారు. సచివాలయ సిబ్బంది ఇచ్చే సమాచారంతో క్షేత్రస్థాయిలోకి వెళ్లి నిర్మాణదారుల్ని బెదిరిస్తున్నారు. మాట వినని యాజమానులు చేపడుతున్న నిర్మాణాల్లో నిబంధనల ఉల్లంఘన ఉందంటూ వాట్సప్ గ్రూపుల్లో పెడుతున్నారు. ఇలా వైరల్ చేసిన స్క్రీన్‌షాట్‌లు పట్టుకుని వెళ్లి సచివాలయ వార్డు ప్లానింగ్ కార్యదర్శులు, ఇతర సిబ్బంది కొందరు డబ్బులు వసూలు చేస్తున్నారు.

# శారదా.. ముంచెత్తిన వరద..



అనకాపల్లి : మొంథా తుపాను తీరం దాటింది, వర్షాలు తగ్గుముఖం పట్టాయి. ముప్పు తప్పినట్లేనని అంతా అనుకున్న తరుణంలో పరిస్థితి తారుమారయింది. ఎగువ నుంచి నుంచి వచ్చిన వరదతో ఇటీవల కాలంలో ఎన్నడూలేని విధంగా శారదానది ఉగ్రరూపం దాల్చింది. ఎలమంచిలి నియోజకవర్గంలోని నాలుగు మండలాలను అతలాకుతలం చేసింది. ముఖ్యంగా రాంబిల్లి మండలంపై తీవ్ర ప్రభావం పడింది. ఈ ఒక్క మండలంలోనే రెండు గండ్లు పడ్డాయి. రాంబిల్లి మండలం వై.లోవ వద్ద మేజర్ శారదా నది ఎడమ గట్టుకు సుమారు 30 మీటర్ల వెడల్పున అతిపెద్ద గండి పడింది. ఒక్కసారిగా చుట్టుముట్టిన వరదతో నది పరివాహక గ్రామాలు ఉక్కిరిబిక్కిరి అయ్యాయి. రెవెన్యూ, జాతీయ, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళాలు, పోలీసులు హుటాహుటిన రక్షణ చర్యలు చేపట్టారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో నదులు, వాగులు పోటెత్తి ప్రవహిస్తున్నాయి.
ఎలమంచిలి-గాజువాక రహదారిలో పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. ఈ మార్గంలో నారాయణపురం వద్ద వంతెనపై నుంచి వరదనీరు గురువారం ఉదయం నారాయపురం గ్రామంలోకి ప్రవహించింది.ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ దగ్గరుండి అధికారులు, గ్రామస్థులతో ఇసుక బస్తాలను వేసి వరదనీటిని నియంత్రించారు.
మునగపాక మండల పరిధిలో ఇరువైపులా గట్ల అంచులను తాకుతూ శారదా నది ప్రవహిస్తోంది. ఆవలో నీరు విడిచిపెట్టడంతో కొండకర్ల ఆవ మీదుగా రోలుగెడ్డ ప్రవహిస్తూ ఇటు చూచుకొండ, గణపర్తి, మెలిపాక, యాదగిరిపాలెం గ్రామాలకు ముంచెత్తుతోంది.
చూచుకొండ- గణపర్తి గ్రామాల మధ్య రోలుగెడ్డ వంతెనపై మూడు అడుగుల ఎత్తున వరదనీరు ప్రవహిస్తోంది. రెండుగ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. జగన్నాథపురం- మెలిపాక రోడ్డు పైనుంచి వరదనీరు ప్రవహిస్తోంది.
మైనర్ శారదా నదికి నారాయణపురం వద్ద గట్టుకు గండి పడింది. వరదనీరు మరీ ఎక్కువైతే నారాయణపురం గ్రామంతోపాటు ఎలమంచిలి పురపాలిక పరిధిలో సోమలింగపాలెం, కట్టుపాలెం గ్రామాలకు ముప్పు పొంచి ఉందని స్థానికులు చెబుతున్నారు.
అనకాపల్లి సమీపంలో దొంగలగొడ్డ పొంగింది. దీంతో ప్రజలు పలు వీధులు జలమయం అయ్యాయి. నది పరివాహక ప్రాంతంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.
వెంకుపాలెం - కుంచంగి మధ్య వెదుళ్లగెడ్డ పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి.
రాంబిల్లి మండలం వై.లోవ వద్ద పడిన గండితో రజాల, కుమ్మరాపల్లి, మర్రిపాలెం, కట్టుబోలు, కొప్పుగొండుపాలెం గ్రామాలు పూర్తిగా నీటమునిగాయి. ఇళ్లలోకి వరదనీరు చేరడంతో ప్రజలు భయంతో వణికిపోతున్నారు. ఈ ఒక్క మండలంలోనే సుమారు ఐదు వేల ఎకరాల్లో వరిపంట, 240 ఎకరాల్లో రొయ్యల చెరువులు జలమయం అయ్యాయి. 70 మంది బాధితులను రాంబిల్లి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి అధికారులు తరలించారు.
తుపానులు వస్తే శారదానది చివరలో ఉన్న రాంబిల్లి మండలానికి తీవ్రమైన నష్టం జరుగుతుంది. ఈసారీ అదే పరిస్థితి పునరావృతమైంది. రోలుగెడ్డ నీటితోపాటు శారదానది నీరు కలిసి పెదయాదగిరి పాలేన్ని పూర్తిగా ముంచేసింది. గ్రామంలో ఐదడుగుల మేర నీరు నిలిచి, 150కు పైగా గృహాల్లోకి నీరు చేరింది.

# నాసిరకం పనులపై గురి

నెల్లూరు : నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగంలో అవినీతి అక్రమాలకు అడ్డూ ఆపూ లేకుండా పోతోంది. అధికారులు, ఉద్యోగులు రావడం.. గుత్తేదారులతో కుమ్మక్కై దండుకోవడం.. వెళ్లిపోవడం షరామామూలుగా మారింది. తాజాగా గత ప్రభుత్వంలో జరిగిన ఇలాంటి వ్యవహారమే మరోసారి వెలుగులోకి వచ్చింది. నెల్లూరు నగరపాలక సంస్థలో నాసిరకం పనులు జరిగాయన్న అంశాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. సంబంధిత అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకునేందుకు విచారణకు ఆదేశించింది. ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేయగా.. సంబంధిత ప్రతులు కమిషనర్ వైవో నందన్‌కు చేరాయి.

**నలుగురిపై విచారణ**

కార్పొరేషన్ పరిధిలో ప్రత్యేక అభివృద్ధి నిధి(ఎస్‌డీఎఫ్) పథకం కింద సిమెంట్ రోడ్లు, కాలువలు, కల్వర్టులతో పాటు వివిధ పనులు చేపట్టారు. అవన్నీ నాసిరకంగా జరిగాయని విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న నలుగురు అధికారులపై విచారణకు ఏపీ టిడ్కో చీఫ్ ఇంజినీరు కె.ఎస్.రామమూర్తిని విచారణాధికారిగా నియమించింది. ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎ.శేషగిరిరావు,



డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎ.శ్రీనివాసరావు, అప్పటి అసిస్టెంట్ ఇంజినీర్లు ఎస్.కె.ఖాదర్‌మస్తాన్, షేక్ ఫాజిల్‌పై మూడు నెలల్లో విచారణ పూర్తి చేసి నివేదిక అందించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రక్రియను ప్రభుత్వం తరఫున ముందుకు తీసుకువెళ్లేందుకు నెల్లూరు పబ్లిక్ హెల్త్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీరును ప్రెజెంటింగ్ అధికారిగా నియమించింది. ప్రభుత్వం తీవ్రంగా పరిగణించిన నేపథ్యంలో బాధ్యులపై చర్యలు తప్పవన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ?
దీనిపై కమిషనర్ వైవో నందన్ మాట్లాడుతూ.. ఆ ఎస్‌డీఎఫ్ పనులు గత ప్రభుత్వంలో జరిగాయి. ప్రభుత్వం వీటిపై విచారణకు ఆదేశించిన విషయం వాస్తవమే. పూర్తి విచారణ అనంతరం ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల మేరకు ముందుకు సాగుతామని అన్నారు.

# రూపుమారె.. సౌకర్యాలు సమకూరె

కనిగిరి : పేదింటి విద్యార్థులు వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటారు. వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలి. కానీ గత వైకాపా పాలనలో పట్టించుకునే వారు లేక బాల బాలికల వసతి గృహాలు అధ్వానంగా ఉండేవి.. అరకొర వసతులతో అసౌకర్యాలతో విద్యార్థులు సతమతమయ్యేవారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రత్యేకంగా శిథిలావస్థకు చేరిన వాటి ఆధునికీకరణకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి మరమ్మతులు చేయించడంతో అన్ని హంగులతో కార్పొరేట్ స్థాయిని మించిపోయాయి. వీటిని చూసి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.
బాగుపడిన 28 సాంఘిక సంక్షేమ వసతి గృహాలు..
జిల్లాలో 81 ఎస్సీ బాల, బాలిక వసతి గృహాలున్నాయి.



వీటిలో ప్రైవేటు భవనాల్లో 36, సొంత భవనాల్లో 45 నడుస్తున్నాయి. వీటిలో 28 సొంత భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి.
బాత్‌రూం డోర్స్ సరిగ్గా లేవు, ఫ్యాను, తలుపులు, కిటికీలు, విద్యుత్, నీటి సౌకర్యం సరిగ్గా లేక విద్యార్థులు ఉండాలంటే ఇబ్బంది పడేవారు. జిల్లాలో శిథిలావస్థకు చేరిన భవనాల ఆధునికీకరణకు రూ.12.50 కోట్లు మంజూరు చేశారు. వసతి గృహాల్లో అన్ని రకాల వసతులు కల్పించడంతో పాటు మరమ్మతులు చేయడంతో అవికాస్త అందంగా కన్పిస్తున్నాయి. విద్యార్థుల సంఖ్య కూడా పెరిగింది. ఈ విషయమై సోషల్ వెల్ఫేర్ డిడి.ఎన్.లక్ష్మానాయక్ వివరణ కోరగా జిల్లా వ్యాప్తంగా శిథిలావస్థకు చేరిన గృహాల మరమ్మత్తులు చేయించామనీ కార్పొరేట్ స్థాయిలో ఉన్నాయనీ తెలిపారు. ఫలితంగా ఈ ఏడాది విద్యార్థులు సంఖ్య కూడా పెరిగిందని తెలిపారు.

# ఈ- పంట.. ఇక్కట్లేనంట!

నెల్లూరు : గత ప్రభుత్వం ఈ-పంట నమోదుపై నిర్లక్ష్యం చేయడంతో జిల్లాలో వ్యవసాయ యంత్ర పరికరాల రాయితీలు, పంట నష్టపరిహారం, బీమా అందక రైతులు నష్టపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ-పంట నమోదుపై ప్రత్యేక దృష్టి సారించింది. అయితే ఇచ్చిన గడువు పూర్తయినా లక్ష్యాలను పూర్తి చేయలేని స్థితిలో వ్యవసాయాధికారులు ఉన్నారు. జిల్లాలో 3,36,784 ఎకరాల్లో ఈ-పంట నమోదు చేయాలన్నది వ్యవసాయ శాఖ లక్ష్యం. జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో ఆగస్టు 17వ తేదీ నుంచి నమోదు కార్యక్రమం మొదలైంది. రెండు నెలలకు పైగా గడిచినా ఇప్పటివరకు నమోదు చేసింది 2,82,376 ఎకరాల్లోనే.. పది రోజులు గడువు పెంచినా లక్ష్యం చేరుకోలేక పోయారు. జిల్లాలోని లక్ష్యాలు చేరుకోవడంలో బాగా వెనుకబడిన నియోజకవర్గాల్లో ఉదయగిరి, కావలి, కందుకూరు ఉన్నాయి. అక్కడి అధికారుల నిర్లక్ష్యం ఉందని రైతులు ఆరోపిస్తున్నారు.
ఈనెల 30తో నమోదు కార్యక్రమం పూర్తయింది. సాధ్యమైనంత వరకు ఎక్కువమందిని చేర్చాం. గడువు పొడిగింపుపై ప్రభుత్వం నుంచి సమాచారం రాలేదని వ్యవసాయశాఖ జేడీ సత్యవాణి తెలిపారు.
రబీలో సమస్యలేఈ- పంట నమోదు చేసుకోవడం వల్ల రైతులు ధాన్యం అమ్ముకోవచ్చు ప్రభుత్వం నుంచి వచ్చే వివిధ రకాల రాయితీలకు అర్హులు అవుతారు. నమోదు చేసుకోక పోతే రబీ సీజన్‌లో రైతులకు ఇబ్బందులు తప్పవు. అధికారులు స్పందించి గడువు పెంచాలని అన్నదాతలు కోరుతున్నారు.

## 'వక్క'.. ఉపాధి పక్కా

అమరాపురం : వక్క పంట.. రైతులకు ఆదాయాన్ని ఇస్తూనే మహిళా కూలీలకు ఉపాధి కల్పిస్తోంది. మడకశిర నియోజకవర్గంలో వక్క సాగుపై దాదాపు 4,200 మంది రైతులు ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఏటా ఆగస్టు నుంచి ఫిబ్రవరి వరకు ఈ పంట ద్వారా పురుష, మహిళా కూలీలకు చేతి నిండా పని దొరుకుతోంది. 4 వేల మంది మహిళా కూలీలు పనులు చేసుకుంటూ స్వగ్రామంలోనే ఉపాధి పొందుతున్నారు. ఈ ప్రాంతంలో ఇతర పనులకు వెళ్తే రోజుకు రూ.250 కూలి ఇస్తారు. అదే వక్క పనులకు వెళితే రూ.350 నుంచి రూ.400 వరకు కూలి అందుతుంది. ఏడు నెలల పాటు ప్రతి రోజూ ఏదో ఒక పని ఉంటుంది. సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి ముగిసే వరకు కూలీలకు చెల్లించే సొమ్ము రూ.20 కోట్ల వరకు ఉంటుందని రైతులు చెబుతున్నారు. కూలి ద్వారా వచ్చే సొమ్ముతో మహిళలు తమ పిల్లలను చదివించుకుంటూనే ఆర్థికంగా ఎదుగుతున్నారు.

**కుమారుడిని వైద్య విద్య చదివిస్తూ..**

అమరాపురం మండలం హేమావతి గ్రామానికి చెందిన అనసూయమ్మకు ఇద్దరు కుమారులు. ఇరవై ఏళ్ల కిందట భర్త చనిపోవడంతో కుటుంబ బాధ్యత భుజాన వేసుకున్నారు. పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని సంకల్పించారు. గౌడనకుంటలో పుట్టింటికి వచ్చి అన్న ఇంట్లో ఉంటూ కూలీ పనులకు వెళ్తున్నారు. వచ్చిన డబ్బుతో పెద్ద కుమారుడిని ఎంబీఏ, చిన్న కుమారుడిని ఎంబీబీఎస్ చదివిస్తున్నారు.

**కుటుంబానికి ఆసరా**

అమరాపురం మండలం గౌడనకుంట భాగ్యమ్మది పేద కుటుంబం. ప్రభుత్వ ఇల్లు తప్పా సెంటు భూమి లేదు. ఎనిమిదేళ్ల కిందట భర్త శ్రీనివాస్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంట్లోనే ఉంటున్నాడు. అప్పటి నుంచి ఈమె కుటుంబ పోషణ చూసుకుంటున్నారు. వక్క పని చేయగా వచ్చే కూలి డబ్బులతో తనకున్న ఇద్దరు కుమార్తెలను బాగా చదివించారు. ఒక కుమార్తె బీఫార్మసి పూర్తి చేసి బెంగళూరులో ఉద్యోగం చేస్తోంది. చిన్న కుమార్తె బీటెక్ ఇంజినీరింగ్ చదువుతోంది. వక్క పంట తమ అభ్యున్నతికి ఎంతగానో దోహదపడుతుందని భాగ్యమ్మ చెబుతున్నారు.

## ఈతరం మెచ్చేలా నాయకత్వం!

విశాఖపట్నం: రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా విశాఖకు కేటాయించిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) కళాశాల తక్కువ వ్యవధిలోనే గుర్తింపు సంపాదించుకుంది. ప్రారంభించిన పదేళ్లలోనే ఆవిష్కరణలు, ఆంత్రప్రెన్యూర్‌షిప్, నాయకత్వ అంశాల్లో ఖ్యాతి పొందింది. విద్యార్థులు మంచి అవకాశాలు పొందుతున్నారు.ప్రపంచంలోని వివిధ ప్రముఖ విద్యా సంస్థల్లో శిక్షణ పొందిన ప్రొఫెసర్లు, నిపుణులు ఇక్కడ బోధన సాగిస్తున్నారు. తర్వాతి తరం వ్యాపారవేత్తలు, నాయకులను తీర్చిదిద్దుతున్న ఐఐఎం గురించి కేంద్ర విద్యాశాఖ ఎక్స్ (ట్విటర్) వేదికగా ప్రస్తావించింది.

**పూర్వ విద్యార్థుల సహకారం..:** ప్రస్తుత విద్యార్థులకు, అంకురాలకు పూర్వ విద్యార్థులు సైతం సహకరిస్తున్నారు. దాదాపు 3,000 మంది పూర్వ విద్యార్థులు ఇందుకోసం ఒక నెట్‌వర్క్‌గా ఏర్పడ్డారు.

ఐఐఎంలో విద్యార్థులకు మెరుగైన బోధన, ఇతర సహకారం అందించేందుకు ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు




చేసుకుంది. వాటిలో కొన్ని..

మోనాస్ విశ్వవిద్యాలయం (ఆస్ట్రేలియా)

టెడ్ రోజర్స్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్, టొరంటో మెట్రోపాలిటన్ యూనివర్సిటీ (కెనడా)

యూనివర్సిటీ ఆఫ్ ఆగ్డర్ (నార్వే)

ముర్రే స్టేట్ యూనివర్సిటీ (అమెరికా)

కెంట్ బిజినెస్ స్కూల్, యూనివర్సిటీ ఆఫ్ కెంట్ (లండన్)

మోనాస్ యూనివర్సిటీ (మలేసియా)

అంకురాలకు ప్రోత్సాహం..

అంకుర సంస్థలకు మార్గనిర్దేశం చేసేందుకు ఐఐఎంవీ ఫీల్డ్ సహకరిస్తోంది. లాజిస్టిక్స్, మెరైన్, విద్య, పర్యాటకం తదితర రంగాల్లో ఆవిష్కరణలను ప్రోత్సహిస్తోంది. అంకురాలకు నిధులు సమకూర్చేందుకు విద్యార్థులే ఒక బృందంగా ఏర్పడ్డారు.

అమలు చేస్తున్న కార్యక్రమాలు: ఫీల్డ్ ఉమెన్ స్టార్టప్ ప్రోగ్రాం, నిధి, సూపర్స్, వీ2వీ (విద్యార్థి టు వ్యవసాయం) తదితరాలు.

2018:ఐఐఎంవీ ఫీల్డ్ ఏర్పాటైన సంవత్సరం

సహకారం పొందిన అంకురాలు:180కు పైగా

అందులో మహిళలకు చెందినవి: 130కు పైగా

## తుపాను గాయం.. సత్వర సాయం

నక్కపల్లి: మొంథా తుపాను ప్రభావానికి గురైన ప్రాంతాల్లో ప్రజలకు ప్రభుత్వం ప్రకటించిన సాయం ద్వారా జిల్లాలో వేలాది మందికి లబ్ధి జరగనుంది. ఇందులో మత్స్యకారులు అధికంగా అర్హత పొందనున్నారు. దీనికి సంబంధించి అధికార యంత్రాంగం వివరాలను నమోదు చేసే పనిలో ఉంది. వర్షాలతో మత్స్యకారులు సముద్రంలో వేటకు దాదాపు అయిదు రోజులుగా వెళ్లలేదు. మరికొన్ని రోజులు కూడా వేటకు దూరంగానే ఉండనున్నారు. జలాశయాల్లోనూ వేట నిలిచిపోయింది. దీంతోపాటు చేనేత కార్మికులు చేతివృత్తికి దూరమయ్యారు. చాలాచోట్ల మగ్గాలు తడిసిపోగా, గుంతల్లో నీరు చేరింది. వీరందరికీ ఉపశమనం కలిగించేలా ప్రభుత్వం సాయం అందించాలని నిర్ణయించింది.

మత్స్యకార కుటుంబాలకు 50 కేజీల బియ్యం, కందిపప్పు, పంచదార, ఉల్లిపాయలు, బంగాళదుంపలు కేజీ చొప్పున, లీటరు మంచినూనె ఇస్తుండగా.. మిగిలిన వర్గాలకు ఈ నిత్యావసర సరకులతోపాటు, 25 కేజీల బియ్యం ఇవ్వనున్నారు. జిల్లా పరిధిలో పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, రాంబిల్లి, అచ్యుతాపురం, పరవాడ మండలాల్లోని 28 గ్రామాల పరిధిలో వేలాది మత్స్యకార కుటుంబాలు ఉన్నాయి. అదేవిధంగా తాండవ, రైవాడ జలాశయాల ద్వారా వందలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి.

ఇక చేనేత కార్మిక కుటుంబాలు సుమారు 250కిపైగా ఉన్నాయి. వీరికీ మత్స్యకారులతో సమానంగానే ఇవ్వనున్నారు. జిల్లాలో ఈ వర్గానికి సంబంధించే దాదాపు 30 వేల కుటుంబాలు సాయం పొందనున్నాయి. ప్రభుత్వ ఆదేశాలతో లబ్ధిదారుల జాబితాను రూపొందించే పనిలో అధికారులు, ఉద్యోగులు నిమగ్నమయ్యారు.

పునరావాస కేంద్రాల్లో ఉన్న వారికి కుటుంబలో సభ్యుల ఆధారంగా కనీసం రూ. వెయ్యి, గరిష్ఠంగా రూ. 3 వేలు ఇవ్వాలని ఆదేశించింది. ఈ సాయం అదనం కానుంది. దీంతో ప్రస్తుత పరిస్థితుల్లో వరద బాధితులకు అందే సాయం తోడ్పాటు కానుంది.

# నాలుగేళ్లుగా నరక ప్రయాణం



ముదిగుబ్బ : ముదిగుబ్బ, కదిరి సరిహద్దులోని మద్దిలేరు వాగు ఉప్పొంగితే 25 గ్రామాలు.. 30 వేల మంది ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. 2021లో నివర్ తుపాను దెబ్బకు మద్దిలేరువాగు ఉద్ధృతంగా ప్రవహించడంతో మలకవేములక్రాస్ నుంచి రాచువారిపల్లి గ్రామాల మధ్య ఉన్న కల్వర్టు కొట్టుకుపోయింది. దీంతో ముదిగుబ్బ, తలుపుల, కదిరి ప్రాంతవాసులు ఈ మార్గంలో నరకయాతన పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. నల్లమాడ నుంచి తలుపుల మీదుగా పులివెందుల వైపు వెళ్లాలన్నా, యల్లనూరు, పుట్లూరు నుంచి కదిరికి రావాలన్నా ఈ మార్గం కీలకంగా మారింది. దీనికితోడు నూతనంగా నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే, 42, 342వ జాతీయ రహదారులకు ఈ దారి అనుసంధానంగా మారింది. ప్రయాణికుల సంఖ్య పెరిగినా వర్షాకాలంలో తాత్కాలిక కల్వర్టుపై ప్రయాణం చేయలేక పది కిలోమీటర్లు చుట్టేసుకుని మెయిన్‌రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు.

**తాత్కాలిక పనులతో సరి..**

కల్వర్టు కొట్టుకుపోయిన తర్వాత ఏటా తాత్కాలికంగా రాళ్లు, మట్టి వేసి ఏర్పాటు చేస్తున్నారు. వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తే మళ్లీ కొట్టుకుపోతోంది. కల్వర్టు మీద 3 నుంచి 4 అడుగుల ఎత్తులో నీరు ప్రవహిస్తుండటంతో హైలెవల్ వంతెన నిర్మాణానికి అధికారులు 2021 నుంచి ప్రతిపాదిస్తున్నారు. గత ప్రభుత్వంలో నిధులు మంజూరు కాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మళ్లీ రూ.8 కోట్లతో ప్రతిపాదించారు. నేటికీ నిధులు రాకపోవడంతో వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

**నిధులు మంజూరైతే పనులు చేపడతాం**

– రాజేంద్ర, పీఆర్ జేఈ, కదిరి

మద్దిలేరు వాగుపై లోలెవల్‌లో ఉన్న కల్వర్టు తొలగించి హైలెవల్ వంతెన నిర్మిస్తే వాగు పొంగినా రాకపోకలకు ఇబ్బంది ఉండదు. వంతెన నిర్మాణానికి ఏటా ప్రతిపాదనలు పంపుతున్నాం. నిధులు మంజూరైతే వెంటనే పనులు చేపడతాం.

# 'ఊట'.. ఎన్నటికి ఊరట



పెద్దపప్పూరు : నిత్యం అష్టకష్టాలు పడుతున్నా అధికారులు ఆదుకోవడం లేదు. ఏడాదికి మూడు పంటలు పండించే పొలాలు ఊట జలం కారణంగా పనికిరాకుండా పోయాయి. చివరికి శ్మశానవాటికది అదే తీరు. బిక్కుబిక్కుమంటూ గడిపే దయనీయ దుస్థితి. ఇన్ని కష్టాలు పడుతున్నా పట్టించుకునేవారు కరవయ్యారు. ఈ పరిస్థితిని పదేళ్లుగా పెద్దపప్పూరు మండలంలోని పెద్దయక్కలూరు వాసులు ఎదుర్కొంటున్నారు. చాగల్లు ప్రాజెక్టు సమీపాన ఉన్న గ్రామంలో 500కు పైగా ఇళ్లు ఉండగా దాదాపు 3 వేల మంది జనాభా నివసిస్తున్నారు.

**200 ఎకరాల్లో..**బోరు బావుల్లో నీరు ఉబికి వస్తుండటం.. చాగల్లు ప్రాజెక్టు కింద పొలాల్లో ఊట రాకతో పంటలు సాగు చేసే పరిస్థితి లేదు. దాదాపు 200 ఎకరాలు నిరుపయోగంగా మారాయి. ఉన్నతాధికారులకు సమస్యను విన్నవించినా ప్రయోజనం లేదని గ్రామస్థులు వాపోతున్నారు.

**ప్రతిపాదన దశలోనే..** చాగల్లు ఆనకట్ట కింద ఊటతో పాటు ఎడమ కాలువ నుంచి నీరు గ్రామాన్ని చుట్టుముడుతోంది. గతంలో కేంద్ర ప్రభుత్వ అధికారుల బృందం సైతం గ్రామాన్ని పరిశీలించింది. ఆనకట్ట వద్ద ఊట బావులు నిర్మించి.. అనుసంధానం చేయడం ద్వారా వచ్చే నీటిని పెన్నా నదికిలోకి పంపేలా చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ఇది కార్యరూపం దాల్చలేదు.

**దినదిన గండంగా..**

గత వైకాపా ప్రభుత్వంలో కలెక్టర్లు పెద్దయక్కలూరు గ్రామాన్ని పరిశీలించినా పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. ఎస్సీ కాలనీలో ఇళ్లు ఎప్పుడు కూలుతాయో తెలియక భయాందోళన మధ్య గడుపుతున్నారు. మరుగుదొడ్ల గుంతలు సైతం ఊటతో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి. చివరి మజిలీకి సైతం ఇబ్బందికరంగా మారింది.


**పునరావాసం కల్పించాలి**

అపరిశుభ్రత కారణంగా అనారోగ్యం బారిన పడాల్సి వస్తోంది. విషపురుగులు సంచరిస్తుండటంతో నిత్యం భయాందోళనతో గడుపుతున్నాం. పంటలు వేసుకోలేని పరిస్థితి. అధికారులు పునరావాసం కల్పించి ఆదుకోవాలి.

పెద్దారెడ్డి, రైతు **ప్రభుత్వానికి నివేదించాం**

క్షేత్ర స్థాయిలో పరిశీలించాం. ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. పంటలు, ఇళ్లు దెబ్బతిన్న మాట వాస్తవమే. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు చర్యలు చేపడతాం.సుధాకర్, హెచ్ఎల్సీ, ఎస్ఈ

# 'కల్లు' అప్పగించి చూస్తున్నారు



పుట్టపర్తి: జిల్లాలో కొందరు కల్లు వ్యాపారులు పేదల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. వారి ఆగడాలను అడ్డుకోవాల్సిన అధికారులు వంతపాడుతున్నారు. నివారించాల్సిన కొందరు నాయకులు అండగా నిలుస్తున్నారు. కల్లు తాగిన హిందూపురం, పరిగి మండలాలకు చెందిన పేదలు అస్వస్థతకు గురవుతుండటమే ఇందుకు నిదర్శనం. మతిస్థిమితం కోల్పోయి వింతగా ప్రవరిస్తుండటంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రులకు తరలిస్తున్నారు.

**ఇష్టారాజ్యంగా..**

హిందూపురం పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాల్లో రసాయనాలు కలిపిన కల్లు విక్రయాలు జరుగుతున్నాయి. చౌళూరుకు సరిహద్దున ఉన్న కర్ణాటక గ్రామాల నుంచి సైతం వస్తున్నారు. రెండు లీటర్ల సీసాలో కల్లును నింపి అమ్ముతున్నారు. ఒక్కో సీసా ధర రూ.45 పలుకుతోంది.

ఎక్సైజ్ అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. పుట్టపర్తి ప్రాంతంలో ఉన్న ఓ అధికారి కల్లు దుకాణాల నిర్వహణలో చక్రం తిప్పుతున్నారు. హిందూపురం పరిధిలోని ఓ అధికారి నెలనెలా సొసైటీల నుంచి వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. 150 పైగా సొసైటీలుండగా వాటికి అనుబంధంగా బి లైసెన్సు కలిగినవి వందల సంఖ్యలో ఉన్నాయి.

**సొసైటీలను ఆధీనంలోకి తీసుకొని..**

హిందూపురానికి చెందిన ఓ వ్యాపారి కొన్నేళ్లుగా గీత సొసైటీలను తన ఆధీనంలోకి తీసుకున్నారు. హైదరాబాద్, మహారాష్ట్ర నుంచి డైజోఫాం, హెచ్‌ను గుట్టుచట్టుప్పుడు కాకుండా దిగుమతి చేసుకుని తన ఫాంహౌస్‌లో ఈత కల్లులో కలిపిస్తున్నారు.

**ఈత వనాలెక్కడ?**

వైద్యుల నుంచి అధికారులు, నాయకులు.. అందరూ చెప్పే మాట ఒక్కటే.. కల్తీ కల్లు కాదని. కానీ డిమాండుకు అనుగుణంగా స్వచ్ఛమైన కల్లు తయారు చేయాలంటే వందలాది ఈత చెట్లు అవసరం. వాటి నుంచి వచ్చే స్వచ్ఛమైన కల్లును సేకరించి లైసెన్సు పొందిన దుకాణాల్లో విక్రయాలు చేపట్టాల్సి ఉంది.

చిలమత్తూరు, గోరంట్ల మండలాల్లో ఈతవనాలు ఉన్నాయి. వాటిని అద్దెకు తీసుకున్న కల్లుగీత సొసైటీల నిర్వాహకులు.. చెట్ల నుంచి కల్లును సేకరించి విక్రయించాల్సి ఉంది. వచ్చే సరకు డిమాండుకు సరిపడా లేదన్నది బహిరంగ రహస్యమే.

తగిన ఉత్పత్తి లేనప్పుడు అందరికీ.. అన్నిచోట్ల.. ఎప్పుడు కావాలంటే అప్పుడు చౌకగా ఎలా దొరుకుతుందన్న ప్రశ్నకు సమాధానం ఎవ్వరూ చెప్పడం లేదు.

ఈత వనాల నుంచి అరకొరగా వచ్చే కల్లును సేకరించి అందులో డైజోఫాం, హెచ్ తదితర రసాయనాలతోపాటు తీపి కోసం(డబుల్ డెక్కర్) చాకరిన్, చక్కెర, తెలుపు కోసం మైదా కలిపి పేద ప్రజలకు విక్రయిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

**కల్తీకల్లు ఎక్కడా లేదు..**

జిల్లాలో కల్తీ కల్లు, మద్యం ఎక్కడా లేదు. మద్యం మానుకోవడానికి ప్రయత్నించినప్పుడు వచ్చే మానసిక సమస్యలతో ఆసుపత్రులకు వస్తున్నట్లు హిందూపురం వైద్యులు చెప్పారు. మా సిబ్బంది నిరంతరం నిఘా పెడుతోంది. హిందూపురంలో జరిగిన ఘటనకు సంబంధించి కల్లు నమూనాలు సేకరించాం. వాటిని ల్యాబ్‌కు పంపిస్తాం. గోవిందనాయక్, ఎక్సైజ్, ప్రొహిబిషన్ జిల్లా అధికారి

## నాడు- నేడు.. అవస్థలు చూడు!

తిరుపతి : ప్రభుత్వ బడులను కార్పొరేట్ పాఠశాలల తరహాలో తీర్చిదిద్దుతామని.. వైకాపా ప్రభుత్వం ఆర్భాటం చేసింది. రెండు జిల్లాల్లో తొలి విడతలో కొన్నింటిని పూర్తి చేయగా.. రెండో, మూడో దశలో సరిగా నిధులు ఇవ్వకుండా చేతులెత్తేసింది. వీటిని పూర్తి చేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికైనా నిధులిస్తే వచ్చే విద్యా సంవత్సరం ఆరంభానికైనా అవస్థలు తప్పుతాయి.

**ఏమేం చేస్తానన్నారంటే..**

అదనపు తరగతి గదులు, ఆర్వో ప్లాంట్లు, మరుగుదొడ్లు, ప్రహరీ, విద్యుదీకరణ, ఇతర వసతుల కోసం నాడు- నేడు రెండో విడత పనులకు 2021 ఆగస్టులో శ్రీకారం చుట్టారు.వైకాపా ప్రభుత్వం పూర్తి చేయలేకపోయింది. కుప్పం, సత్యవేడు నియోజకవర్గాల్లో ఒకేచోట రెండు తరగతుల పిల్లలను ఉంచుతున్నారు.



**ఉన్నవాటినైనా వినియోగిస్తే..**

కొన్ని పాఠశాలల ఖాతాల్లో రూ.2–10 లక్షల వరకు నిధులున్నాయి. గతంలో అవకతవకలు, నాణ్యతను పరిశీలించాలని ఈ ప్రభుత్వం పనులు నిలపాలని ఆదేశాలిచ్చింది. ఇప్పుడైనా వాటిని వినియోగించడానికి అనుమతిస్తే 90 శాతం పనులు పూర్తయిన చోట మిగతావి చేయడానికి ఆస్కారం ఉంటుంది.

**60 శాతం పూర్తయిన వాటికైనా..**

ఈ ప్రభుత్వం 'మన బడి– మన భవిష్యత్తు' పేరిట వసతులు కల్పిస్తామని చెప్పింది. నిధుల కొరతతో ప్రస్తుతానికి 60 శాతం నిర్మాణాలు జరిగిన చోట పనులు ప్రారంభించాలని పేర్కొంది.

ఇది పిచ్చాటూరు మండలం సిద్ధిరాజుకండ్రిగ ఉన్నత పాఠశాల. రెండు తరగతి గదులు, రెండు మరుగుదొడ్ల నిర్మాణానికి గతంలో రూ.37 లక్షలు మంజూరు చేశారు. మరో రూ.12 లక్షలు విడుదల చేస్తే పనులు కొలిక్కి వస్తాయి. విద్యార్థుల అవస్థలు తీరుతాయి.

రెండో విడతలో ఎంపికైన పాఠశాలలు: 1,692

అంచనా వ్యయం: రూ.819.55

కోట్లు చేసిన ఖర్చు: రూ.391.43 కోట్లు

## 3 వేల ఓట్లు.. లక్ష మందికి పాట్లు!

ఒంగోలు : జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలో నాలుగు దశాబ్దాల కిందట వంద మీటర్ల వెడల్పు ఉన్న పోతురాజు కాలువ ఆక్రమణలతో నేడు కేవలం 25 మీటర్లతో బక్కబిక్కిపోయింది. ఏళ్లుగా నాయకులు ఆక్రమణలను పెంచిపోషించడంతో వానొస్తే నగరంలో అడుగుపెట్టలేని పరిస్థితి నెలకొంది. ఆక్రమణల తొలగింపుపై కనీసం ఆలోచన కూడా చేయకుండా మితిమీరిన రాజకీయ జోక్యం నగరానికి పెనుముప్పుగా మారింది. ఇప్పటికైనా సమస్య శాశ్వత పరిష్కారానికి చొరవ తీసుకోవాల్సిన అవసరాన్ని ఏటా చోటుచేసుకుంటున్న ముంపు భయం గుర్తు చేస్తోంది.ఒంగోలు నగరంలోని ముంపు ప్రాంతాల్లో బుధవారం మంత్రి డోలా శ్రీబాలావీరాంజనేయస్వామి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పర్యటించిన సమయంలో పోతు రాజు కాలువలో పూడిక తీయడంతో ముంపు సమస్య చాలా వరకు తగ్గించామని, లేకుంటే విజయవాడలో బుడమేరు మాదిరిగా రెండు రోజులపాటు నగరం నీట మునిగేదని నగర పాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు వివరించారు. ఈ ఏడాది పూడిక తీసినా వచ్చే ఏడాది సమస్య తలెత్తే అవకాశం ఉండడంతో శాశ్వత పరిష్కారంపై దృష్టిసారించాల్సి ఉంది. పేర్నమిట్ట నుంచి కొప్పోలు వంతెన వరకు నగరంలో పది కిలోమీటర్ల మేర పోతురాజు కాలువ విస్తరించి ఉంది. కాలువ కట్టకు రెండు వైపులా భారీ భవనాలు నిర్మించారు. పది, ఇరవై కాదు.. ఏకంగా 700పైగా శాశ్వత నిర్మాణాలు చేపట్టారు. కొన్నిచోట్ల ప్రార్థనా మందిరాలు సైతం ఉన్నాయి. ఒక్కో ఇంట్లో నాలుగైదు ఓట్లు వేసుకున్నా 3 వేల మంది ఓటర్లు ఉండడంతో ఆక్రమణల తొలగింపుపై



ప్రజాప్రతినిధులు, అధికారులు కనీస ఆలోచన చేయడంలేదు. సమస్యకు శాశ్వత పరిష్కారంగా తక్షణం కాలువపై ఆక్రమణదారులు ఎంతమంది ఉన్నారో గుర్తించి వారందరికి ప్రత్యామ్నాయంగా స్థలాలు చూపి వారిని ఖాళీ చేయించాల్సి ఉంది. కాలువ వెడల్పు చేస్తేనే వరదలు వచ్చినప్పుడు నీరు పారేందుకు వీలు ఉంటుంది. లక్ష మంది నగర ప్రజల భవితవ్యం ముడిపడి ఉన్నందున ప్రజాప్రతినిధులు, అధికారులు సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది. మంగళవారం అర్ధరాత్రి వచ్చిన మాదిరి చీకటి మాటున వరద నీరు చుట్టుముట్టేస్తే ప్రజల ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్నట్లే.

**ఇరుకైతే నీరు పారేదెలా?**

ఎస్ఎన్‌పాడు, పేర్నమిట్ట చెరువులు పొంగడంతో ఆ నీరు పోతురాజు కాలువలోకి భారీగా చేరింది. ఓవైపు పైనుంచి వచ్చే వరద నీరు, స్థానికంగా కురిసిన వర్షపు నీరు వెరసి నగరాన్ని ముంచేసింది. కాలువ ఇరుకుగా మారడంతో కట్టకిరువైపులా ఉన్న 40 కాలనీల్లో ప్రజలకు వానాకాలం కష్టాలు తప్పడం లేదు. వంతెనల కింద చెత్త ఇరుక్కుపోవ డంతో వంతెనలపై నుంచి వరదనీరు పారింది. వీటి వద్ద చెత్త తొలగింపునకు నగరపాలక సిబ్బంది శ్రమిస్తున్నారు.

# ఛార్జీలు ట్రూడౌన్

కర్నూలు : గత వైకాపా ప్రభుత్వ హయాంలో వివిధ రకాల పేర్లతో విద్యుత్తు ఛార్జీలు పెంచడంతో వినియోగదారులు అల్లాడిపోయారు. ట్రూఅప్, ఇతర ఛార్జీల పేర్లతో విద్యుత్తు బిల్లులు పెంచడంతో అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయారు. కూటమి ప్రభుత్వం తొలిసారిగా 'ట్రూడౌన్' పేరిట విద్యుత్తు బిల్లుల భారం తగ్గించనుంది. నవంబరు నుంచి ఈ తగ్గింపు ప్రయోజనాలను అన్ని తరగతుల ప్రజలకు అందుబాటులోకి తీసుకురానుంది.

**వచ్చే నెల నుంచి** గత ప్రభుత్వం హయాంలో ట్రూఅప్ ఛార్జీల పేరుతో 36 నెలల పాటు విద్యుత్తు వినియోగదారుల నుంచి అదనంగా వసూలు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వచ్చే నెల నుంచి సంవత్సరం పాటు ట్రూడౌన్ పేరిట విద్యుత్తు బిల్లులు తగ్గించనుంది. విద్యుత్తు ఛార్జీలు పెంచబోమని.. అవసరమైతే తగ్గిస్తామని ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు ఈ చర్యలు




తీసుకున్నారు.

**వర్తింపు ఇలా...**

ఉచిత విద్యుత్తు ఇస్తున్న వ్యవసాయ కనెక్షన్లు మినహాయిస్తే.. కర్నూలు జిల్లా వ్యాప్తంగా 9.48 లక్షల విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 887మిలియన్ యూనిట్ల విద్యుత్తు వినియోగం జరిగింది. విద్యుత్తు కొనుగోళ్లు, సరఫరా, పంపిణీ, నష్టాలు ఇతర వ్యయాలు కలిపి ఎఫ్‌పీపీసీఏ కింద ట్రూఅప్ పేరిట యూనిట్‌కు 40 పైసల చొప్పున అదనంగా వసూలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గతేడాది జరిగిన కొనుగోళ్లు, వాస్తవ లెక్కలపై సమీక్షించిన కూటమి ప్రభుత్వం అదనంగా వసూలు చేసిన మొత్తంలో కొత్త వినియోగదారులకు తిరిగి ఇవ్వాలని నిర్ణయించింది. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు జరిగిన విద్యుత్తు వినియోగం ఆధారంగా యూనిట్‌కు 13పైసల చొప్పున తగ్గించనున్నారు. నవంబరు నుంచి ఏడాది పాటు(అక్టోబరు 2026 వరకు) తగ్గించనున్నారు. ట్రూడౌన్ ద్వారా జిల్లాలోని వినియోగదారులకు రూ.11.78 కోట్ల మేర లబ్ధి చేకూరనుందని విద్యుత్తుశాఖ అధికారులు తెలిపారు.

# ఉపాధి మరింత మందికి

నెల్లూరు : ఉపాధి హామీ పథకంలో రానున్న ఆర్థిక సంవత్సరంలో గ్రామాల వారీగా పనులు చేయనున్నారు. ఈమేరకు మరింత మందికి ఉపాధి కల్పించాలని నిర్ణయించారు. ఇందుకోసం ప్రణాళికలు తయారుచేయనున్నారు. ఈనెల మూడో తేదీ నుంచి గ్రామాల వారీగా గ్రామసభలు నిర్వహించనున్నారు. జిల్లాలో 37 మండలాలుండగా 723 పంచాయతీలున్నాయి. దాదాపు అన్ని పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. పథకం కింద పంట కాలువలు, చెరువుల్లో పూడికతీతత, కందకాల తవ్వకాలు, పండ్ల తోటల పెంపకం తదితర వాటికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ. 229 కోట్ల విలువైన పనులను పూర్తి చేశారు. వచ్చే ఏడాది ఎక్కువ కుటుంబాలకు 100 రోజులు పని కల్పించాలనే లక్ష్యంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం కూలీలంతా వ్యవసాయ పనుల్లో ఉండడంతో పనులు నెమ్మదించాయి. ఈ పరిస్థితి డిసెంబరు వరకు కొనసాగే అవకాశాలున్నాయి. ఈ ఏడాది మిగిలిన పనులను వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తి చేయాల్సి ఉంటుంది. 2026-27 ఆర్థిక సంవత్సరం ప్రారంభం కాగానే కొత్తగా పనులను గుర్తించి మొదలు పెట్టాలి. ఆ తరువాత వేసవి కావడంతో కూలీలు ఎక్కువ మంది పథకాన్ని వినియోగించుకుంటారు.

**గ్రామాలవారీగా సభలు**

డిసెంబరు నెలాఖరు వరకు గ్రామాల్లో సభలు నిర్వహించి వచ్చే ఏడాది చేపట్టాల్సిన పనులపై నిర్ణయం తీసుకుంటారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా అనేక అభివృద్ధి పనులు చేపడుతున్న



నేపథ్యంలో ఈసారి ఎక్కువ ప్రతిపాదనలు వెళ్లే అవకాశం ఉంది. ఈక్రమంలో అధికారులు స్థానికంగా ఏయే పనులు చేయాలో గుర్తిస్తారు. వీటిని కలెక్టర్‌కు పంపించి ఆమోదం తీసుకుంటారు.

**మరింత అదనంగా గంగాభవాని, పీడీ, డ్వామా**

ఏటా కూలీలతో చేయించాల్సిన పనులను ముందుగానే గుర్తించి పంపిస్తాం. ఈనెల మూడో తేదీ నుంచి గ్రామాల్లో సభలు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వం కూడా ఏటా కూలీల వేతనాలను పెంచుతోంది. దీనికనుగుణంగా ప్రస్తుత ఏడాది కంటె వచ్చే ఏడాది ఎక్కువ పనులు ప్రతిపాదించాల్సి ఉంటుంది. ఈసారి గోకులాలు, మ్యాజిక్ డ్రైన్లకు ప్రాధాన్యం ఉండే అవకాశం ఉంది.

పథకం వివరాలు

మొత్తం మండలాలు: 37

పనులు జరుగుతున్న పంచాయతీలు : 723

యాక్టివ్‌లో ఉన్న జాబ్ కార్డులు : 2.76 లక్షలు

నమోదైన కూలీలు : 4.33 లక్షలు

ఇప్పటివరకు జరిగిన పనుల విలువ : రూ. 229 కోట్లు

100 రోజులు పని చేసిన కుటుంబాలు: 2,447

# రక్షణ వేదిక.. భక్షణ వేడుక




కర్నూలు : జిల్లా పోలీసు శాఖలో కొందరు అధికారులు, సిబ్బంది వ్యవహారం వివాదాస్పదంగా మారుతోంది. పట్టుకుంటాం.. పైసలిస్తే వదిలేస్తామనే తీరులో కొందరు వ్యవహరిస్తున్నారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన వారు.. జేబులు నింపుకోవడమే ధ్యేయంగా విధులు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దొంగలు, దోపిడీదారులు, మాదకద్రవ్యాలు, నాటుసారా విక్రేతలు, జూద కేంద్రాల నిర్వాహకులతో అంటకాగుతున్నారు. పలు కేసుల్లో పట్టుకున్న నిందితులను డబ్బులు తీసుకొని వదిలేస్తున్నారు. నగరం నుంచి పశ్చిమప్రాంతానికి వెళ్లే ప్రధాన రహదారిలో 30 కి.మీ. దూరంలో ఉన్న ఓ ఠాణా ఇందుకు వేదిక అవుతోంది.. ఇక్కడ పని చేస్తున్న పోలీసు అధికారులు ఒక్కటై దందా చేస్తున్నారు.

**రంగులు మార్చారు**

చిత్రంలోని ద్విచక్రవాహనాన్ని గతంలో పోలీసులు పట్టుకున్నారు. ఆ వాహనం పాతగా ఉండటంతో కొత్తగా రంగులు వేయించి వినియోగిస్తున్నారు. ఈ ఠాణా పరిధిలో పోలీసులు పట్టుకొని సీజ్ చేసిన వాహనాలు 89... ఇందులో 25 ద్విచక్రవాహనాలు అదృశ్యం అయ్యాయి. ఇటీవల అధికారికంగా 5 వాహనాలే రికవరీ చేశారు.

**కారును వదిలేసి చెరబట్టారు**

కారు (ఏపీ 29 బీఎం 9946)లో అక్రమంగా 94 సెల్‌ఫోన్లు తరలిస్తుండగా పోలీసుల తనిఖీలో పట్టుబడ్డాయి. ఆగస్టు 3న అర్ధరాత్రి పట్టుకొని 4న రికవరీ కింద 56 చూపారు. మిగిలినవి ఏమయ్యాయో తెలియని పరిస్థితి. అక్రమ రవాణాకు వినియోగించిన కారును వదిలేశారు.

**ముఠా ఎంత ముట్టజెప్పిందో**

రూ.లక్ష ఇస్తే రూ.మూడు లక్షలిస్తాం.. మీకు నమ్మకం లేకపోతే కర్నూలు-బళ్లారి ప్రధాన రహదారి పక్కనే పెద్ద వెంచరు ఉందంటూ ఓ ముఠా నమ్మబలికింది. తెలంగాణ రాష్ట్రం గద్వాల్ జిల్లా గట్టు ప్రాంతానికి చెందిన ఆంజనేయ నమ్మారు. ఆయన్ను ప్యాలకుర్తి బస్టాండు వద్దకు గత జులై 22న పిలిపించారు.. జయరాజు అనే వ్యక్తి వచ్చి రూ.3 లక్షలు అందజేస్తుండగా పోలీసునంటూ ఓ వ్యక్తి కారు (ఏపీ 26 బీఈ 3642)లో వచ్చి నగదు తీసుకెళ్లాడు. బాధితుడు అదే రోజు పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. నిందితులను అదుపులోకి తీసుకొని ఠాణాకు తరలించారు. వారి వద్ద డబ్బులు తీసుకొని కారును, నిందితులను వదిలేశారు. బాధితుడు న్యాయం కోసం వెళ్లగా బెదిరించారు. చేసేదేమీలేక జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయట పడుతుందని హుటాహుటిన బాధితుడిని ఠాణాకు పిలిపించి కేసు నమోదు చేసేందుకు ముందుకు వచ్చారు.

**ఫిర్యాదు చేసినా కేసులుండవు**

మార్కాపురానికి చెందిన చెందిన ఓ వ్యక్తి దోజరును పోలీసు అధికారి సొంత పనులకు వినియోగించుకున్నారు. డబ్బులు ఇవ్వకపోవడంతో బాధితుడు అధికారిపై ఠాణాలో ఫిర్యాదు చేశారు.

పట్టుకున్న ఇసుకను అధికారులు తమ సొంత ప్రాంతానికి తరలించారు.

గుప్తనిధుల కేసులో నిందితుల వద్ద డబ్బులు తీసుకొని స్టేషన్ బెయిల్ ఇచ్చినట్లు సమాచారం.

పట్టణంలోని ఓ ఇంట్లో గంజాయి తాగుతున్న వారిని పట్టుకొని వదిలేశారనే ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా పట్టుబడిన మద్యాన్ని మాయం చేసినట్లు సమాచారం.

గిరకల బావి వద్ద ఆగస్టు 31న ఓ వ్యక్తి స్కూటీలో రూ.1.35 లక్షలు చోరీ అయ్యాయి. బాధితుడు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదు.

# మీ చెంతకే ఆధార్ సేవలు



నంద్యాల : జాతీయ తపాలా శాఖ వారోత్సవాల్లో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈనెల 8 నుంచి 14వ తేదీ ప్రత్యేక ఆధార్ శిబిరాలు ఏర్పాటుచేయనున్నారు. ఇందులో భాగంగా 5 నుంచి 17 ఏళ్ల వయస్సు ఉన్న పిల్లలకు బయోమెట్రిక్, ఆధార్ నవీకరణ సేవలను ఉచితంగా అందించనున్నారు. మిగిలినవారు అవసరమైన రుసుము చెల్లించి సేవలు వినియోగించుకోవచ్చు.

ఎలాంటి సేవలందిస్తారు

అవసరమైన వారందరికీ ఆధార్ నమోదు చేస్తారు. బయోమెట్రిక్‌ను నవీకరిస్తారు. నిబంధనలు అనుసరించి బాలికలకు సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు తెరవచ్చు. మగ పిల్లల కోసం పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలు ప్రారంభించుకునే అవకాశం కల్పిస్తారు.

ఏ రోజు ఎక్కడ

కర్నూలు: ఈనెల 8వ తేదీ నుంచి 14 వరకు కర్నూలులోని ప్రధాన తపాలా కార్యాలయం, బాలాజీ నగర్‌లోని భాష్యం పాఠశాలలో 8, 9 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు. 10, 11 తేదీల్లో ఎస్ఏపీ క్యాంపులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, 13, 14 తేదీల్లో సంకల్‌బాగ్‌లోని భాష్యం పాఠశాలలో ఆధార్ శిబిరాలు నిర్వహిస్తారు. ఈనెల 8వ తేదీ నుంచి 14 వరకు నంద్యాల గాంధీచౌక్‌లోని ప్రధాన తపాలా కార్యాలయం, 8, 9 తేదీల్లో బస్టాండు సమీపంలోని బాలికోన్నత పాఠశాల, 10, 11 తేదీల్లో వైఎస్సార్ నగర్‌లోని కస్తూర్బా బాలికోన్నత పాఠశాల (మైనార్టీ), 13, 14 తేదీల్లో వైఎస్సార్ నగర్‌లోని కస్తూర్బా బాలికోన్నత పాఠశాలతోపాటు డోన్, పత్తికొండ ప్రధాన తపాలా కార్యాలయాల్లో ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు ఆధార్ శిబిరాలు అందుబాటులో ఉంటాయి.

**దేనికెంత రుసుం**

డెమోగ్రఫిక్ నవీకరణ : పేరు, చిరునామా, పుట్టిన తేదీ, లింగం, చరవాణి, ఈమెయిల్, ఫొటో, వేలిముద్ర, ఐరిస్ స్కాన్‌కు సంబంధించిన రుసుమును రూ.75కు పెంచారు.

డాక్యుమెంట్ అప్‌లోడ్ : ఐడీ, చిరునామాకు పాత రుసుం రూ.50 ఉండగా.. దీనిని రూ.75కు పెంచారు.

బయోమెట్రిక్ నవీకరణ : 17 ఏళ్లకుపైబడిన వారికి సంబంధించిన రుసుము రూ.100 నుంచి రూ.125కు పెంచారు.

ఆధార్ డౌన్‌లోడ్, ప్రింట్ : పాత రుసుం రూ.20 నుంచి రూ.40కు పెంచారు.

# మేలు మరిచి పాత రకానికి జైకొట్టి



నంద్యాల : రబీ సీజన్ వచ్చేసింది.. రైతులు శనగ సాగుకు సన్నద్ధమవుతున్నారు. ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న విత్తనాలు పాత రకానివే కావడంతో అన్నదాతలు పెదవి విరుస్తున్నారు. గత కొంతకాలంగా జేజీ 11 (ఎర్ర శనగ), కాబూలీ (తెల్ల శనగ) రకాలే ఇస్తున్నారు. ఇవి తెగుళ్లను తట్టుకోవడం లేదు.. ఏటా రైతులు భారీగా నష్టాన్ని చవిచూస్తున్నారు. అన్నదాతల కష్టాలు కళ్లార చూసిన శాస్త్రవేత్తలు మేలైన వంగడాలు అందుబాటులోకి తెచ్చారు. వాటిని రాయితీపై ఇవ్వడానికి వ్యవసాయశాఖ అధికారులకు మనసొప్పడం లేదు.

**35,919.5 క్వింటాళ్ల విత్తనానికి ప్రతిపాదన**

కర్నూలు జిల్లా పరిధిలో 70 వేలు, నంద్యాలలో 50 వేల హెక్టార్లలో సాగయ్యే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లాకు ప్రభుత్వం పప్పుశనగ విత్తన కేటాయింపులు చేసింది. కిలో రూ.78 కాగా.. రూ.19.50 రాయితీ పోనూ రైతులకు రూ.58.50కు విక్రయించాలని ఆదేశించింది. నంద్యాల జిల్లాకు 35,919.5 క్వింటాళ్ల జేజీ 11 రకం విత్తనాలు అవసరమని అధికారులు ప్రతిపాదించారు. మొదటి విడత 12,564 క్వింటాళ్లు కేటాయించారు. క్వింటా రూ.7,800.. 25 శాతం రాయితీ పోనూ రైతులు రూ.5,850 దిగుబడి దిగాలు గత రబీ సీజన్‌లో కర్నూలుకు 29,967, నంద్యాలకు 18,865 క్వింటాళ్లు కలిపి ఉమ్మడి జిల్లాకు జేజీ 11 రకానికి చెందిన 48,832 క్వింటాళ్ల విత్తనాన్ని రాయితీపై పంపిణీ చేశారు. వీటిని సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. అధిక వర్షాలు, వర్షాభావ పరిస్థితుల్లో వచ్చే తెగుళ్లను తట్టుకోలేకపోతున్నాయి. ముఖ్యంగా ఎండు తెగులు ఆశించినప్పుడు దిగుబడులు తగ్గిపోతున్నాయి. దీనికి తోడు పురుగు మందులకు అదనపు ఖర్చులు పెట్టాల్సి వస్తోంది. 7 నుంచి 9 సంచులు రావాల్సిన దిగుబడి 3-5 సంచులకే పరిమితం అవుతోంది.


**ఆర్ఏఆర్ఎస్‌లో అందుబాటులో** తెగుళ్లు తట్టుకుని అధిక దిగుబడులు అందించే నూతన.. మేలైన శనగ విత్తన రకాలు నంద్యాలలోని ఆర్ఏఆర్ఎస్‌లో అందుబాటులో ఉన్నాయని ఏడీఆర్ జాన్సన్, ప్రధాన శాస్త్రవేత్త నీలిమ తెలిపారు. దేశవాళీ, కాబూలీ రకాలను రైతులకు అందించేందుకు సిద్ధంగా ఉంచామన్నారు. మేలైన నూతన శనగ వంగడాలను సాగు చేసి లబ్ధి పొందాలని రైతులకు సూచించారు. దేశవాళీ రకాలైన (నంద్యాలగ్రామ్) ఎన్‌బీఈజీ 776, ఎన్‌బీఈజీ 924 రకాలు క్వింటా రూ.10,500గా ధర నిర్ణయించారు. ఎన్‌బీఈజీ 452, ఎన్‌బీఈజీ 857 రకాలు రూ.11,500, కాబూలీ రకాలైన ఎన్‌బీఈజీ 810, ఎన్‌బీఈజీ 119.. క్వింటా రూ.15 వేలు, ఎన్‌బీఈజీ 833 రకం రూ.16 వేల ధరగా ఉందన్నారు.

# పురాలకు అమృత్ ధారలు

నంద్యాల : ఉమ్మడి కర్నూలు జిల్లాలో నగరపాలక సంస్థతోపాటు తొమ్మిది మున్సిపాలిటీల్లో త్వరలో తాగునీటి సమస్యలు తీరనున్నాయి. గుక్కెడు నీటికి అల్లాడుతున్న జనానికి త్వరలో ఊరట కలగనుంది. ప్రతి ఇంటికి కుళాయి ద్వారా నీరు సరఫరా చేసేందుకు వీలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమృత్-2 కింద రూ.403 కోట్లు మంజూరు చేశాయి. అమృత్ 2.0 కింద తాగునీటి ప్రాజెక్టులు చేపట్టనున్నారు. ఈ పనులకు మంత్రివర్గ సమావేశం ఇటీవల ఆమోదం తెలిపింది. వీటికి త్వరలో టెండర్లు పిలవనున్నారు. అమృత్ 2.0 కింద తాగునీటి ప్రాజెక్టులతోపాటు మురుగు నీటి శుద్ధి ప్లాంట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కర్నూలులో రూ.2.47 కోట్లు, నంద్యాలలో రూ.74 కోట్లు, ఆదోనిలో రెండు ప్రాంతాల్లో రూ.93.79 కోట్లతో ఎస్టీపీ ప్లాంట్లు నిర్మించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

**కర్నూలుకు రూ.130 కోట్లు**

కర్నూలు నగరంలోని 52 వార్డుల్లో తాగునీటి ఇబ్బందులు తొలగించేం



దుకు రూ.130 కోట్లతో కొత్తగా 20కిపైగా ఉపరితల నీటి ట్యాంకులు నిర్మించనున్నారు. సుంకేసుల నుంచి మునగాలపాడు వరకు రూ.83 కోట్లతో పైపులైను పనులు పూర్తి చేయనున్నారు. కేసీ కాలువ నుంచి పైపులైన్లతో నీటిని సరఫరా చేసే ఉద్దేశంతో ఈ ప్రతిపాదనలు చేశారు. జగన్నాథగట్టు ప్రాంతంలో ప్లాంటు నిల్వ చేయనున్నారు.

**ఆదోనికి రూ.35.17 కోట్లు**

ఆదోనిలో రూ.12.9 కోట్లతో చేపట్టనున్న ప్రాజెక్టులో 22 కి.మీ. పొడవునా నీటి గొట్టాలను ఏర్పాటు చేయనున్నారు. 15.45 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటు నిర్మించనున్నారు. రెండో ప్యాకేజీలో రూ.22.27 కోట్లతో నీటి పైపులైను ఏర్పాటు, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటు, ట్యాంకులు, శుద్ధి కేంద్రంతోపాటు కాలనీలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వనున్నారు.

# నిధులు లేకుండానే పనులు.. ఆపై రద్దు

నెల్లూరు : గత ప్రభుత్వ పాపం ఇంకా వెంటాడుతోంది. నిధులు రాక ముందే, అధికారులపై ఒత్తిడి తెచ్చి.. గుత్తేదారులను ఒప్పించి పనులు చేయించారు. తీరా నిధులు రాలేదు.. కొన్ని పనులు చేసి ఆపేశారు.. చివరకు సకాలంలో మొదలుపెట్టని కారణంగా దాదాపు 171 పనులు రద్దయ్యాయి. గతపాలన తీరుతో ఇంజినీరింగ్ అధికారుల ఇరకాటంలో పడ్డారు.

**నాబార్డు రుణం వస్తుందని..**


2022 అక్టోబరు, నవంబరు మాసాల్లో కురిసిన వర్షాలకు జిల్లావ్యాప్తంగా రోడ్లు దెబ్బతిన్నాయి. వాటి మరమ్మతులు, కొత్త నిర్మాణాలకు నిధులు లేవు. దీంతో మార్కెటింగ్ శాఖకు చెందిన నిధులను పంచాయతీరాజ్ శాఖకు మళ్లించాలని అప్పటి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నిర్ణయించారు. పనులకు ప్రపంచ బ్యాంకు ద్వారా రుణం తీసుకోవాలని ప్రయత్నించారు. నిధులు రాక ముందే జిల్లా అధికారులు టెండర్లు పిలిచారు. రుణం ఇవ్వడానికి ప్రపంచ బ్యాంకు ముందుకు రాలేదు.. తిరిగి నాబార్డు రుణం తీసుకోడానికి ప్రయత్నం చేశారు. నిధులు రాకముందే అధికారులు టెండర్లు పూర్తిచేసి గుత్తేదారులను ఒప్పించి పనులు మొదలు పెట్టించారు. పనులకు సంబంధించి నిధులు రాలేదని... ఆర్థిక పరమైన అనుమతు లు పరిశీలించి తదుపరి నిర్ణయం తీసుకుంటామని ఎస్ఈ కోటేశ్వరావు తెలిపారు.

**171 పనులు**

222 బీటీ నిర్మించాలని నిర్ణయించారు. పనులకు సంబంధించి జిల్లాకు రూ.185 కోట్ల నాబార్డు నిధులు వస్తాయని ఆశించారు. నచ్చచెప్పి గుత్తేదారులు చేత ముందుగానే ఆత్మకూరు, మనుబోలు, వెంకటాచలం, పొదలకూరు, ఉదయగిరి, నెల్లూరు రూరల్‌లో తదితర మండలాల్లో పనులు ప్రారంభించారు. ఇలా దాదాపు 20 పనులు పూర్తయ్యాయి. 31 పనులు దాదాపుగా వివిధ దశల్లో ఉన్నాయి. చివరకు రుణం మొత్తం నేటికీ విడుదల కాలేదు. ఈలోపు రాష్ట్రంలో ప్రభుత్వం మారిపోయింది. పనులు ప్రారంభం కానివి రద్దు చేయమని కూటమి ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడంతో 171 రద్దయ్యాయి.

# అరటి... ధరలు దిగజారి!

కంభం : పదిహేను రోజుల వ్యవధిలో అరటి ధరలు సగానికి పడిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వినాయక చవితి సమయంలో గెల రూ.300కు పైగా పలికింది. దసరా నాటికి రూ.230 నుంచి రూ.250 మధ్య ధరలు కొనసాగాయి. ప్రస్తుతం రూ.వందకూ అడిగేవారు కరవయ్యారు. రెండు రోజుల క్రితం కంభానికి చెందిన ఓ రైతు గుంటూరు మార్కెట్‌కు పంటను తరలించగా గెల రూ.30 నుంచి రూ.40 మాత్రమే పలికింది. రవాణా ఛార్జీలూ రాలేదని ఆయన వాపోయారు. **ఇతర ప్రాంతాల నుంచి రాకతో...:** జిల్లాలో సుమారు రెండు వేల ఎకరాల్లో అరటి తోటలు వేశారు. పశ్చిమ ప్రకాశంలోని కంభం,



బేస్తవారపేట, గిద్దలూరు, కొమరోలు, రాచర్ల, యర్రగొండపాలెం, త్రిపురాంతకం, రాచర్ల మండలాల్లో ఎక్కువగా సాగు చేశారు. ప్రస్తుతం పంటంతా కోత దశలో ఉంది. ఇరవై రోజుల క్రితం వరకు గుంటూరు వ్యాపారులు ఇక్కడకు వచ్చి కొనుగోలు చేశారు. పంటను ఒడిశాకు ఎగుమతి చేయడంతో గిట్టుబాటు ధరలు లభించాయి. ప్రస్తుతం నంద్యాల, మహానంది తదితర ప్రాంతాల నుంచి గుంటూరు, విజయవాడ, ఒంగోలు, వినుకొండ తదితర మార్కెట్లకు పెద్ద మొత్తంలో సరకు వస్తుండడంతో డిమాండ్ తగ్గినట్లు చెబుతున్నారు.

**చెట్లపైనే మగ్గుతున్న కాయలు...:** ఇప్పటి వరకూ చాలా తక్కువ మంది మాత్రమే పంట అమ్ముకున్నారు. డిసెంబర్ వరకు దిగుబడులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. మరోవైపు చెట్లపైనే కాయలు మగ్గిపోతుండడంతో చేసేది లేక వచ్చిన ధరకు అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'ఎకరంలో అరటి సాగుకు రూ.80 వేలకు పైగా ఖర్చయ్యింది. పంట చేతికొచ్చేసరికి అమాంతం ధరలు పడిపోవడంతో నష్టపోయామ'ని కంభానికి చెందిన రైతు గౌస్ మొహిద్దీన్ వాపోయారు. ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతున్నారు.

# అంత్యక్రియలకు ఆరడుగులు కరవు!

కణేకల్లు మనిషి చనిపోతే సాధారణంగా మృతదేహాన్ని శ్మశానంలో పూడుస్తారు. కాని ఆ గ్రామంలో మాత్రం రోడ్డు పక్కనే అంతిమ సంస్కారాలు నిర్వహించాల్సిన దుస్థితి.! వినడానికి, చూడటానికి వింతగా ఉన్నా.. అంత్యక్రియలకు ఆరడుగుల నేల కరవైన దీన పరిస్థితి కణేకల్లు మండలం బెణికల్లు పంచాయతీ పరిధిలోని సీతారామనగర్ క్యాంపువాసులది. ఇక్కడ సుమారు 100 కుటుంబాలకుపైగా వలసొచ్చి స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నావారున్నారు. వీరంతా పేద కూలీలే కావడం గమనార్హం. గ్రామంలో కాస్త డబ్బులున్నవారు, మోతుబరి రైతులు మృతిచెందితే వారివారి పొలాల్లో శవ దహన



సంస్కారాలు నిర్వహించుకొంటుండగా.. ఇతరులంతా రోడ్డు పక్కన మృతదేహాలు పూడ్చి పెట్టాల్సిందే. అంతిమ క్రియలకు స్థలం చూపించాలని పలుమార్లు రెవెన్యూ అధికారులకు విన్నవించినా.. పట్టించుకొనే వారే లేరని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజుల కిందట మృతిచెందిన క్యాంపు వాసి లోకేరెడ్డి(70) శవాన్ని బెణికల్లు వైపు ర.భ రోడ్డు పక్కన పూడ్చిపెట్టడం విశేషం. ఇప్పటికైనా పాలకులు, అధికారులు చొరవ చూపి శ్మశానవాటికకు స్థలం చూపాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# హస్తకళా ప్రశస్తి.. శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి: కలంకారీ వస్త్రోత్పత్తులను పలు ప్రాంతాల్లో తయారు చేస్తున్నా.. శ్రీకాళహస్తి కలంకారీ మాత్రం అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి ఆర్జించింది. ఇక్కడి కళాకారులు వాడే సహజ రంగులే ఇందుకు ప్రధాన కారణం. 3 వేల ఏళ్ల నాటి కళ ఇప్పటికీ వైభవాన్ని సంతరించుకోవడం విశేషం. ఎక్కువ కాలం మన్నికగా ఉండటం వీటి ప్రత్యేకత. దీని వెనక రహస్యాలు మనమూ తెలుసుకుందామా.. ఏం చేస్తారంటే.. వీటి తయారీలో ప్రధాన భూమిక వస్త్రం సిద్ధం చేసుకోవడమే. నేతన్నలు ముందుగా ఎంపిక చేసుకున్న వస్త్రాన్ని కరక్కాయపొడి, పాలు మిశ్రమంలో నానబెడతారు. అలాగే ఆరనిస్తారు. ఆ తర్వాత వేయాల్సిన చిత్రాలకు అనుగుణంగా ఔట్‌లైన్ వేసుకొని, వాటిలో రంగులు వేస్తారు. వెదురుపుల్లను కుంచెగా చేసుకొని చిత్రాలు గీస్తారు. వాటికి రంగులు అద్ది.. కొంగొత్త హంగులు తీర్చిదిద్దుతారు.

**ఆన్‌లైన్ మార్కెట్..** కరోనా తదనంతరం ఆన్‌లైన్ మార్కెట్ పెరిగింది. ప్రస్తుతం దీని ద్వారా అమ్మకాలు పెరిగాయి. పలు వెబ్‌సైట్లలో ఈ వస్త్రాలు లభ్యమవుతున్నాయి.



**రంగులు సృష్టిస్తారిలా..**

కలంకారీలో ప్రధానంగా నలుపు, ఎరుపు, ఆకుపచ్చ, పసుపు, ఊదా తదితర రంగులు సహజంగా సిద్ధం చేసుకుంటారు. ఇనుప ముక్కలు, బెల్లం సమపాళ్లలో తీసుకుని ఊరబెడితే నలుపు రంగు ఏర్పడుతుంది. కరక్కాయ పూలు, దానిమ్మ గింజలను వారం కంటే ఎక్కువ రోజులు నానబెట్టి ఉడకబెడితే పసుపు రంగు సిద్ధం.

జాజి ఆకుతో పలు రకాల ఆకులు నానబెట్టి ఉడికిస్తే ఎరుపు రంగు వస్తుంది. నలుపు, ఎరుపు మిశ్రమంతో ఆకుపచ్చ రంగు, మంజిష్ఠా వేరు ద్వారా ఊదా రంగు అందుబాటులోకి వస్తుంది.

ఇండిగో బ్లూకు, ఆలం కలిపి ఊరబెడతారు. పది రోజుల తర్వాత ఉడకబెడితే నీలం రంగు సిద్ధం.

# రక్తపోటు.. చక్కెర కాటు

భీమవరం: మహిళల ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. మహిళ ఆరోగ్యం- బలమైన కుటుంబానికి పునాది అనే లక్ష్యంతో స్వస్థ్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా సెప్టెంబరు 17 నుంచి ఈ నెల 2 వరకు ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. పరీక్షలు చేసి... వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఔషధాలు ఉచితంగా అందజేశారు. ఈ శిబిరాల్లో మహిళలతోపాటు పురుషులకు అధిక రక్తపోటు, మధుమేహం, నోటి, రొమ్ము, క్షయ వ్యాధి నిర్ధారణ, రక్తహీనత పరీక్షలు చేశారు.

34 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 18 పట్టణ ఆరోగ్య కేంద్రాల ఆవరణల్లో 3584 వైద్యశిబిరాల్లో 1,15,773 మందికి పరీక్షలు చేసినట్లు డీఎంహెచ్‌వో జి.గీతాబాయి తెలిపారు. కొన్ని రుగ్మతలను




వెంటనే గుర్తించి వైద్య సేవలు అందించామన్నారు. మరికొన్ని పరీక్షల నివేదికలు రావాల్సి ఉందన్నారు. 47719 మందికి క్యాన్సర్, 20,326 మందికి క్షయ పరీక్షలు నిర్వహించారు.

**కారణాలు అనేకం..** గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రక్తపోటు, చక్కెర వ్యాధితో ఉంటున్నవారి సంఖ్య అధికంగా ఉంది. పనుల్లో ఒత్తిళ్లు, సమయానికి నిద్ర లేకపోవడం, ఆహారంలో ఉప్పు, కారం మోతాదుకు మించి వినియోగించడం, సరైన వ్యాయామం లేకపోవడం తదితర కారణాలతో రుగ్మతల బారిన పడుతున్నట్లు గుర్తించారు. రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం, ధ్యానం చేయాలని వైద్యులు సూచించారు.

# పుర.. రహదారిద్ర్యం



తాడిపత్రి : జిల్లాలోని పురపాలికల్లో రహదారులు దారుణంగా ఉన్నాయి. వీటి నిర్వహణను రోడ్లు, భవనాల శాఖ అధికారులు గాలికొదిలేశారు. ప్రధానంగా గుత్తి, గుంతకల్లు, తాడిపత్రి పురపాలికలోని ప్రధాన రహదారులు పరిస్థితి చెప్పేలా లేదు. గత ఐదేళ్లల్లో వైకాపా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక గుంతలకు ప్యాచ్ వర్కులు చేయించినా ఫలితం లేకుండాపోయింది. గుత్తిలోని పత్తికొండ, గుంతకల్లు, అనంతపురం, కర్నూలు రహదారులు అడుగడుగునా గుంతలతో దర్శనమిస్తున్నాయి. ఇవన్నీ ఆర్‌అండ్‌బీ పరిధిలోకి వస్తాయి. గుత్తి శివారులోని బసినేపల్లితండా నుంచి గుత్తి వరకు ఉన్న పత్తికొండ- మంత్రాలయం రోడ్డు అక్కడక్కడ దెబ్బతింది.

గుత్తిఆర్.ఎస్.లోని రైల్వే వంతెనపై రహదారి శిథిలావస్థకు చేరింది. అనంతపురం మార్గం బీసీకాలనీ వద్ద గోతులమయమైంది. గాంధీచౌక్ నుంచి గుత్తిచెరువు మరువ వరకు గుంతలున్నాయి.

గుంతకల్లులో జట్కాస్టాండు వద్దే కాకుండా అంజుమన్ కాలనీ క్రాస్, మండీబజార్ క్రాస్, ఆసుపత్రి, పొట్టిశ్రీరాములు కూడలి, పెట్రోలు పంపు తదితర చోట్ల దారులు దెబ్బతిన్నాయి. ప్రధానంగా అంజుమన్ కాలనీ, తిలక్‌రోడ్డు, వన్‌వే, ధర్మవరం గేట్ వద్ద వాహన రాకపోకలకు కష్టంగా ఉంది. దాదాపు 15 కి.మీ.ల పొడవైన రోడ్లకు శాశ్వత మరమ్మతులు చేయాల్సి ఉంది.

తాడిపత్రిలో యల్లనూరు, పుట్లూరుకు వెళ్లే ప్రాంతాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. ఒక్క గుంతకల్లు రోడ్డులోనే గడిచిన ఆరు నెలల కాలంలో ముగ్గురు మరణించారు.

**రూపుకోల్పోయి.. దారుణ స్థితి**

ఆర్‌అండ్‌బీ ఇంజినీర్లు తూతూమంత్రంగా మరమ్మతులు చేయించి చేతులు దులిపేసుకుంటున్నారు. ప్యాచ్ వర్కులు దెబ్బతినడంతో వర్షాకాలంలో మోకాలు లోతు నీళ్లు నిలబడుతున్నాయి. ఇటీవల గుత్తిలో రూ.2 లక్షలతో మరమ్మతులు చేయించారు. మళ్లీ యథాస్థానానికి రావడం గమనార్హం.

**రూ.2 కోట్లతో టెండర్లు పిలిచాం**-హనీఫ్‌వలి, ఏఈఈ, గుత్తి రహదారులకు మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ప్యాచ్ వర్కులు చేయించాం. వర్షాల కారణంగా పాడయ్యాయి. తిరిగి రోడ్లు గోతుల మయం అయ్యాయి. గోతులను పూడ్చివేసి మందంగా తారువేయిస్తాం. రూ.2 కోట్లతో పనులకు టెండర్లు పిలిచాం.

# సాగుకు వేళాయె.. రాయితీ విత్తనం రాకపాయే!



ఉరవకొండ: నల్లరేగడి భూముల్లో రబీలో సాగయ్యే పప్పుసెనగ విత్తుకోవడానికి అన్నదాతలు దుక్కులు సిద్ధం చేసుకున్నా.. రాయితీ విత్తనాలు పంపిణీ చేయకపోవడంతో ఎదురుచూపులు తప్పడం లేదు. ఉమ్మడి అనంత జిల్లాలో సుమారు 68 వేలకు పైగా ఎకరాల్లో పప్పుసెనగ సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రధానంగా ఉరవకొండ, వజ్రకరూరు, తాడిపత్రి, గుంతకల్లు, రాయదుర్గం, కణేకల్లు, డి.హీరేహాళ్, కళ్యాణదుర్గం తదితర మండలాల్లో పంట విస్తారంగా సాగవుతుంది. ఈ ఏడాది 14 వేల క్వింటాళ్లకు పైగా విత్తనాన్ని సర్కారు కేటాయించింది. ప్రభుత్వం రాయితీ విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉంది.

**విత్తుకు అనుకూలం**

ఇటీవల కురిసిన వర్షాలకు నేలలోని తేమ విత్తనానికి అనుకూలంగా ఉంది. ఈ సమయంలో విత్తితే మొలక సరైన తీరులో వచ్చి అధిక దిగుబడులకు వాతావరణం అనుకూలిస్తుంది. ఈక్రమంలో నేటికీ రైతుసేవా కేంద్రాలకు విత్తనాలు చేరలేదు. రైతుల పేర్లు నమోదుకు ఏర్పాట్లు చేయకపోవడం గమనార్హం.

**ప్రాసెసింగ్ దశలోనే..**

ఈసారి వర్షాలు ఆశాజనకంగా ఉండటంతో సాగుకు రైతులు సమాయత్తం అయ్యారు. ఈక్రమంలో రాయితీ విత్తనం ఇంకా ప్రాసెసింగ్ దశలో ఉందని అధికారులు చెబుతుండటం గమనార్హం. గత వైకాపా పాలనలో విత్తన ఏజెన్సీలు, సరఫరాదారులకు రూ.74 కోట్ల మేర బకాయిలు ఉన్నాయి. వాటిని చెల్లిస్తేనే మళ్లీ సరఫరా చేస్తామని పేర్కొంటున్నాయి.

**అధిక ధరలకు..**

ప్రస్తుతం విత్తనాలకు డిమాండ్ పెరిగింది. బహిరంగ మార్కెట్‌లో క్వింటాలు రూ.5,300తో వ్యాపారులు కొనుగోలు చేసి.. తిరిగి అధిక ధరలకు అంటగడుతున్నట్లు రైతులు చెబుతున్నారు. నగదు చెల్లించే వారికి రూ.5,800, అప్పు అడిగే రూ.6,200 మేర విక్రయిస్తున్నట్లు వాపోతున్నారు.

**వారంలో వచ్చే అవకాశం**

రాయితీ విత్తనం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదించాం. నిర్దేశించిన విత్తనం వారంలో చేరుకునే అవకాశాలున్నాయి. ఈవిషయంగా ఎప్పటికప్పుడు జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

- సత్యనారాయణ, ఏడీ, ఉరవకొండ

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం**

- సుబ్బయ్య, డీఎం, ఏపీసీడ్స్

విత్తన సేకరణ ఏజెన్సీలు పాత బకాయిలు చెల్లించాలని పట్టుబడుతున్నాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రాసెసింగ్ వేగవంతం చేయిస్తాం. రైతు సేవా కేంద్రాలకు విత్తనాలు తరలించేలా చర్యలు తీసుకుంటాం.

# కసాపురం.. ప్రగతిపథం



గుంతకల్లు : ఉమ్మడి అనంతపురం జిల్లాలోని గుంతకల్లు మండలంలో కసాపురంలో వెలసిన నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయం అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. దీంతో ఆలయ రూపురేఖలు, ముఖచిత్రం సమూలంగా మారిపోనుంది. ఇది వరకు ఆలయానికి దగ్గరలో పలు వ్యాపార దుకాణాలు ఉండటంతో భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు ఇబ్బందులు తలెత్తేవి. ఇప్పుడు వాటన్నింటికీ చెక్ పెడుతూ ప్రగతికి శ్రీకారం చుట్టారు. దాతల విరాళాలతో పనులు చేపట్టనున్నారు.

**పాత విడిది కేంద్రాల కూల్చివేత**

కోవెల దక్షిణ గోపురం ఎదురుగా, వెనకాలా ఏళ్లనాటి భక్తుల వసతి భవనాలు శిథిలావస్థకు చేరి వృథాగా ఉండేవి. సుందరీకరణ పనుల్లో భాగంగా వారం రోజుల నుంచి జేసీబీలతో ఆయా భవనాల కూల్చివేత పనులు జరుగుతున్నాయి. దేవస్థానం ముందర, ఆలయ పరిసరాల్లో వ్యాపార దుకాణాలను పూర్తిగా తొలగించారు.

కోనేటి కల్యాణ కట్టకు వెళ్లే దారిలో ఉన్న దుకాణాలు గోశాలకు చెందిన షెడ్లను తొలగిస్తున్నారు. దుకాణదారులకు మరోచోట షెడ్లు ఏర్పాటు చేసుకొనేందుకు అనుమతి ఇచ్చారు. ఎట్టకేలకు దుకాణాలు, వసతి గదుల తొలగింపు తర్వాత క్షేత్ర పరిసరాలు చూడముచ్చటగా విశాలంగా కనిపిస్తున్నాయి.

**భక్తులకు సౌకర్యాలు కల్పిస్తాం**

- విజయరాజు, ఈవో, కసాపురం ఆలయం

భక్తుల సౌకర్యార్థం కోసం ఆలయ అభివృద్ధికి, భద్రతకు చర్యలు తీసుకుంటున్నాం. దుకాణదారులకు మరో చోట సుమారు 40 మందికి పైగా షెడ్లు ఏర్పాటు చేసేందుకు అనుమతులు ఇచ్చాం.ఆలయ ఆవరణలోని ఉద్యానాన్ని బాగు చేయిస్తాం.

# అదను చూసి చదును

ఏలూరు: మోగల్లు పంచాయతీ పరిధిలో ప్రధాన రహదారికి ఆనుకుని అల్లూరి సీతారామరాజు స్మారక ట్రస్టుకు చెందిన భూమిని పలువురు ఆక్రమించుకుని నిర్మాణాలు చేశారు. దీనిపై గతంలో స్థానికులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా రెవెన్యూ అధికారులు సర్వేచేసి హద్దులు నిర్ణయించారు. ఆక్రమణలు తొలగించలేదు.

దువ్వ సెంటర్లో రహదారిని ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమి ఆక్రమించుకుని దుకాణాలు, ఇంటి నిర్మాణం చేపట్టారు. స్థానికులు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదు. వాటిపై ఎవరైనా ప్రశ్నిస్తే నోటీసులిచ్చామంటూ సమాధానం దాటవేస్తున్నారు.

సీతారామపురం సౌత్‌లో రహదారి పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది వ్యక్తులు ఆక్రమించారు. వాటిని తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అయినపర్తి వీరవెంటసత్యనారాయణ పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు.

చినమల్లంలో దశాబ్దాలుగా రైతులు పొలాలకు వెళ్లేందుకు దారిగా వినియోగిస్తున్న ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైంది. మండల అధికారులు క్షేత్రస్థాయికి వచ్చి పరిశీలించినా సమస్య పరిష్కారం కాలేదని, అనేక ఇబ్బందులు పడుతున్నామని గుడాల దుర్గారావు ఆవేదన వ్యక్తం చేశారు.అధికారుల ఉదాసీన వైఖరితో జిల్లాలోని విలువైన పంచాయతీ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. అదను చూసి చదును చేస్తుండటంపై స్థానికులు ఫిర్యాదు చేసినా రాజకీయ



ఒత్తిళ్లతో అధికారులు వాటివైపు కన్నెత్తి చూడటం లేదు. అడపాదడపా నోటీసులతో సరిపెడుతున్నారు. ఫలితంగా ఒకర్ని చూసి మరొకరు ఆక్రమణలకు తెగపడుతున్నారు.

**చిన్నగా మొదలై**

చిన్నపాటి రేకుల షెడ్డు లేదా.. పశువులను కట్టడం, రాళ్లను పేర్చడం వంటివి చేసి ఆనక వాటిలో భవన నిర్మాణాలు చేస్తున్నారు. వాటిపై స్థానికులు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు ఆక్రమణదారులతో చర్చలు జరపడం మినహా, తొలగింపునకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. పైగా సమస్యను పరిష్కరించినట్లు నివేదికను సమర్పిస్తున్నారు. మొదట్లోనే స్థానికులు ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు స్పందించకపోవడంతో కొన్ని చోట్ల నిర్మాణాలు పూర్తిచేసుకున్న కొందరు కోర్టును ఆశ్రయిస్తున్నారు. తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురంలో పంచాయతీకి చెందిన పలు భూములు ఆక్రమణలకు గురయ్యాయి. అక్కడ భవన నిర్మాణాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపినా అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. అవి వివాదాలకు దారితీయడంతో పాటు ఒకర్ని చూసి మరొకరు ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఆక్రమణలో చెరలో ఉన్న పంచాయతీ భూములు, ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని డీపీవో రామ్‌నాథ్‌రెడ్డి తెలిపారు.

# ఇసుక.. మస్కా!

ఏలూరు: ఎక్కడ తూర్పుగోదావరి.. ఎక్కడ ఎన్టీఆర్ జిల్లా. ఈ రెండు జిల్లాల మధ్య దూరం వందల కిలోమీటర్లు ఉంటుంది. అయినా తూర్పుగోదావరి జిల్లాలోని ఇసుక స్టాక్ పాయింట్లు, రీచ్‌ల నుంచి ఎన్టీఆర్ జిల్లాలోని వత్సవాయి, వీరులపాడు మండలాలకు ఏమాత్రం ధ్రువీకరణ లేకుండా ఇసుక లోడ్ చేసి పంపుతున్నారు తూర్పుగోదావరి అధికారులు. ఆ జిల్లా నుంచి ఏలూరు జిల్లాలోని చింతలపూడికి 1.34 లక్షల మెట్రిక్ టన్నులు వచ్చిందని తెలుసుకుని ఇప్పటికే అవాక్కయ్యారు. అయినా అధికారులు గుణపాఠాలు నేర్వలేదు. సోమవారం అర్ధరాత్రి తూగోజిల్లా రీచ్‌ల నుంచి వస్తున్న ఐదు లారీలు తెలంగాణలోకి ప్రవేశిస్తుండగా జీలుగుమిల్లి పోలీసులు పక్కా సమాచారంతో పట్టుకున్నారు.

**ఎందుకు ధ్రువీకరించుకోరు?..** వీరులపాడు, వత్సవాయిలో ఎవరికైనా ఇసుక కావాలంటే వారికి అదే జిల్లాలో కంచికర్ల, వీరులపాడు మండలాల సరిహద్దులో నిల్వ కేంద్రం ఉంది. ఆ విషయం అధికారులకు తెలుసు. అయినా ఇంతదూరం నుంచి ఎందుకు బుక్ చేసుకుంటున్నారు? వ్యయ, ప్రయాసలకోర్చి తీసుకెళ్లడం ఏమిటని వారి చిరునామా వివరాలు ఎన్టీఆర్ జిల్లా అధికారులకు పంపి ధ్రువీకరించుకుంటే అసలు లారీల్లోకి ఇసుక లోడ్ అయ్యేదే కాదు. ఆంధ్రప్రదేశ్ చిరునామాతో ఆధార్‌కార్డు ఉంది కదా? అని ధ్రువీకరణ లేకుండా పంపటం ఎంతవరకు సబబో ప్రశ్నించుకోవాలి.

**అయినా ఏలూరు మీదుగా వెళ్లాలి!..** వీరులపాడు, వత్సవాయికి వయా ఏలూరు, హనుమాన్‌జంక్షన్ మీదుగా వెళ్లాలి. కాని గ్రీన్‌ఫీల్డ్ హైవేలో జీలుగుమిల్లి మండలం నుంచి వెళ్లటం అంటే పక్కదారి పట్టడమేనన్నది స్పష్టమౌతోంది. పోలీసులు పట్టుకున్న ఐదు లారీల్లో రెండు వీరులపాడు, వత్సవాయి మరో రెండు ఏలూరు, ఇంకొకటి చాట్రాయి చిరునామాతో ఉన్నాయి. వీటికి జీలుగుమిల్లి మార్గానికి పొంతనే ఉండదు. పక్కాగా ఆ లారీలు తెలంగాణకు తరలిస్తున్నారని పోలీసువర్గాలు తెలిపాయి. వెయ్యి ఇస్తే ఆధార్ కార్డు.. కొందరు ఇసుక దళారులు, మాఫియా పేదలకు వెయ్యి రూపాయిలిచ్చి ఆధార్ నకలు సేకరించి అలా బుక్ చేస్తున్నారు. తీరా ఆ లారీలు తెలంగాణాకు పంపి అధికమొత్తంలో లాభపడుతున్నారని తెలుస్తోంది. అంతా కుమ్మక్కై ఒక పథకం ప్రకారం ఉచిత ఇసుకను పక్కదారి పట్టిస్తున్నారు.

# దారిచ్చిన.. గోదారి..

కుక్కునూరు : గోదావరి వరద ఎట్టకేలకు దారిచ్చింది. అయిదు నెలలుగా తగ్గుతూ, పెరుగుతూ తీరప్రాంత వాసులను నానా ఇక్కట్లకు గురిచేసిన వరద ఉదయం వంతెనల పైనుంచి వైదొలగింది. దీంతో రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది వరదల సరళిని పరిశీలిస్తే జూన్ 15న మొదలైన వరద ఇప్పటివరకూ కొనసాగుతూనే ఉంది. 1976 నుంచి వరదల సరళిని పరిశీలిస్తే 50 సార్లు వచ్చాయి. ఈ ఏడాది వచ్చిన స్థాయిలో వరదలు పోటెత్తిన దాఖలాలు గతంలో లేవు. ఈ ఏడాది 9 దఫాలు గ్రామాలను చుట్టుముట్టి, బాహ్య ప్రపంచంతో సంబంధాలు చెరిపేశాయి. అక్టోబరులో వరదలు రావటం కూడా అరుదు. 1995లో ఒక్కసారి మాత్రమే వరదలు వచ్చాయి. దాదాపు 20 ఏళ్ల తర్వాత మళ్లీ ఈ ఏడాది అక్టోబరు నెలలో వరదలు రావటం జరిగింది. తగ్గినట్లే తగ్గి, వెంటనే పెరగటం నిత్యకృత్యంగా మారింది. మొత్తం మీద ఈ ఏడాది పడినన్ని కష్టాలు గతంలో ఎన్నడూ చూడలేదని వాపోతున్నారు. ఈ ఏడాదిలో మూడు దఫాలు మొదటి, మరో మూడు దఫాలు రెండో ప్రమాద హెచ్చరికలను అధిగమించి, వరద ప్రవహించటం గమనార్హం.

చురకలు



## కొత్త గెటప్ లో ఆషికా రంగనాథ్!

ఆషికా రంగనాథ్.. ఈ హీరోయిన్ తెలుగులో చేసినవి 2 సినిమాలే అయినప్పటికీ స్టార్ హీరోయిన్ మాదిరి గుర్తింపు సంపాదించింది.. అయితే అలాంటి ఈ ముద్దుగుమ్మ కి సంబంధించిన తాజా ఫొటోస్ ఇంటర్నెట్ ని షేక్ చేస్తున్నాయి.ఎప్పుడు పొట్టి పొట్టి బట్టలతోనో లేక ట్రెడిషనల్ డ్రెస్ లతోనో కనిపించే ఆషికా రంగనాథ్ ఒక్కసారిగా గెటప్ చేంజ్ చేసేసరికి ఈ హీరోయిన్ ఫొటోస్ చూసిన అభిమానులు సైతం షాక్ అవుతున్నారు.ఇదేంటి ఈ హీరోయిన్ గెటప్ మార్చేసింది.. ఈ కొత్త గెటప్ ఏంటో అంటూ ఆశ్చర్యపోతున్నారు. ఇక తాజాగా ఆషికా రంగనాథ్ తన ఇన్స్టాగ్రామ్ ఖాతాలో కొన్ని ఫొటోస్ షేర్ చేసింది.ఆ ఫొటోస్ లో ఆషికా రంగనాథ్ గెటప్ పూర్తిగా చేంజ్ అయింది. హాలీవుడ్లో పైరేట్స్ ఆఫ్ ది కరేబియన్ అనే సినిమాలో హీరో ఎలా అయితే ఉంటారో అచ్చం ఆ హీరోని పోలి ఉన్న గెటప్ లో ఆషికా రంగనాథ్ తాజా ఫోటోలు ఉన్నాయి. తలకి బ్యాండ్ కట్టుకొని హెయిర్ లీవ్ చేసుకొని ఆషికా రంగనాథ్ ఫోటోలకు ఫోజులు ఇచ్చింది. ఈ ఫోటోలు చూస్తూ ఉంటే మాత్రం ఆషికా రంగనాథ్ ఏదో స్టంటులు చేసేవారు ఫోటోలకు ఫోజులు ఇచ్చినట్లుగా ఉంది. అంటూ నెటిజన్స్ కామెంట్లు చేస్తున్నారు. ఇక ఆషికా రంగనాథ్ పోస్ట్ చేసిన ఫోటోలలో వెనుక ఉన్న బ్యాక్గ్రౌండ్ కూడా అలాగే ఏదో యాక్షన్ మూవీ సెట్ వేసినట్టు కనిపిస్తోంది. చూస్తుంటే ఆషికా రంగనాథ్ కొత్త సినిమా



కోసం అలా తన గెటప్ ని చేంజ్ చేసినట్టు కనిపిస్తోంది. మరి ఆషికా రంగనాథ్ తాజా ఫొటోస్ కొత్త సినిమా గెటప్ లో భాగమేనా అనేది తెలియాల్సి ఉంది. ఇక ఈ ఫొటోస్ షేర్ చేయడంతో పాటు ఈ ఫొటోస్ కి క్యాప్షన్ గా ఈ మొత్తం లుక్ వెనక ఉన్న బృందానికి లవ్ యు అన్నట్లుగా ఫింగర్ హాట్ సింబల్ ఎమోజిని కూడా షేర్ చేసింది.. ప్రస్తుతం ఆషికా రంగనాథ్ కి సంబంధించిన తాజా ఫొటోస్ ఇంటర్నెట్ ని షేక్ చేస్తున్నాయి.మరి హీరోయిన్ సడెన్ గా గెటప్ చేంజ్ వెనుక కారణం ఏంటో తెలియాల్సి ఉంది. ఆషికా రంగనాథ్ సినిమాల విషయానికి వస్తే.. క్రేజీ బాయ్ అనే మూవీ తో కన్నడ ఇండస్ట్రీ లోకి హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చిన ఆషికా రంగనాథ్ ఆ తర్వాత పలు కన్నడ సినిమాల్లో నటించి పట్టదు అరసు అనే తమిళ మూవీలో కూడా నటించింది. ఆషికా రంగనాథ్ మొదటి తెలుగు సినిమా అమిగోస్..కళ్యాణ్ రామ్ హీరోగా వచ్చిన అమిగోస్ సినిమా ద్వారానే ఆషికా రంగనాథ్ టాలీవుడ్లోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమా తర్వాత అక్కినేని నాగార్జున నటించిన నా సామి రంగ మూవీలో హీరోయిన్ గా అవకాశం అందుకొని ఈ సినిమాతో పాపులర్ నటిగా పేరు తెచ్చుకుంది. ప్రస్తుతం ఈ హీరోయిన్ మెగాస్టార్ చిరంజీవి నటించిన విశ్వంభర మూవీ లో కూడా ఓ ముఖ్యమైన పాత్రలో నటించింది.. ఆషికా రంగనాథ్ అప్ కమింగ్ సినిమాల గురించి చూసుకుంటే.. తమిళంలో కార్తీతో సర్దార్ -2 మూవీ లో హీరోయిన్ గా నటిస్తోంది. అలాగే కన్నడలో గాథ వైభవ అనే మూవీలో కూడా నటిస్తోంది.

## విజయ్ ప్రేమలో నిజాయితీ లేదా? ఓపెనైన తమన్నా!

మిల్కీ వైట్ బ్యూటీ తమన్నా కెరీర్ జర్నీ, లవ్ లైఫ్ గురించి తెలిసిందే. ఓవైపు సౌత్ లో నటిస్తూనే, బాలీవుడ్ లో అవకాశాల కోసం ప్రయత్నిస్తోంది. మరోవైపు ఓటీటీల కోసం వెబ్ సిరీస్ లలో నటిస్తూ, తనలోని వైవిధ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తోంది. అయితే తమన్నా వ్యక్తిగత లవ్ లైఫ్ లోని కుదుపు తనను నిజంగా భావోద్వేగానికి గురి చేస్తోంది. నటుడు విజయ్ వర్మతో లవ్ బ్రేకప్ తర్వాత తమన్నా ఆలోచనల్లో తీవ్ర మార్పులొచ్చాయి. అయితే బ్రేకప్ తర్వాతా విజయ్ తో స్నేహం కొనసాగిస్తున్నానని చెప్పిన తమన్నా, ఇప్పుడు అనూహ్యమైన కామెంట్ చేయడం చర్చగా మారింది. తమన్నా తాజా చాటింగ్ సెషన్ లో నిజాయితీ గురించి ఎక్కువగా మాట్లాడింది. నిజాయితీ అనేది అద్దం లాంటిది.. అద్దం బ్రేక్ అయితే అంటించవచ్చు కానీ, అది




ఎప్పుడూ ఒకేలా కనిపించదని నర్మగర్భంగా వ్యాఖ్యానించింది తమన్నా. సూటిగా తన మాజీ ప్రియుడి పేరును ప్రస్తావించకుండా వ్యాఖ్యానించినా కానీ, ఆ టైమింగ్ రైమింగ్ కచ్చితంగా తన మాజీ గురించేనని అర్థమవుతోంది. ఎవరైనా హత్య చేస్తే.. నేను ఇంకా సహాయం చేయగలను. కానీ ఎవరైనా అబద్ధం చెబితే..అస్సలు తట్టుకోలేను! అని ఘాటుగా వ్యాఖ్యానించింది.

ఈ సూటి విమర్శ ఎవరిని ఉద్దేశించి? తమన్నా ఎవరిని టార్గెట్ చేసింది?.. అర్థం చేసుకునేవారికి చేసుకున్నంత. రిలేషన్ షిప్స్ లో ఆనందం కంటే నిజం చాలా ముఖ్యం. ముఖ్యంగా గ్లామర్ రంగంలో కొన్ని నిజాలను డైజెస్ట్ చేసుకోవడం ఎప్పటికీ అంత సులువు కాదు. చాలా మంది కథానాయికలు అలాంటి కొన్ని కఠిన విషయాలను ఇక్కడ ఎదుర్కోవడం చూస్తున్నదే.




## 'పెద్ది' జాన్వీ లుక్.. పక్కా మాస్ క్యారెక్టర్




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో వస్తున్న 'పెద్ది' సినిమాపై అంచనాలు హై లెవెల్ లో ఉన్నాయి. ఇప్పటికే చరణ్ మేకోవర్, సినిమా బ్యాక్‌డ్రాప్ గురించి రకరకాల వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఇప్పుడు, ఆ అంచనాలను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్తూ, మేకర్స్ ఈ సినిమా నుంచి హీరోయిన్ జాన్వీ కపూర్ ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ఈ ఒక్క పోస్టర్‌తో జాన్వీ తన ఇమేజ్‌ను పూర్తిగా మార్చేసేలా కనిపిస్తోంది. జాన్వీ కపూర్ అనగానే మనకు గుర్తొచ్చేది బాలీవుడ్ గ్లామర్, ఫ్యాషన్ ఐకాన్. కానీ 'పెద్ది' కోసం ఆమె చేసిన మేకోవర్ చూసి అందరూ షాక్ అవుతున్నారు. ఇది సింపుల్ డీ గ్లామ్ రోల్ కాదు, పక్కా మాస్ క్యారెక్టర్. శ్రీదేవి కూతురిగా 'అతిలోక సుందరి' ఇమేజ్ ఉన్న జాన్వీ, ఇప్పుడు 'అచ్చియమ్మ'గా పూర్తి మాస్ అవతార్‌లో కనిపించబోతోంది. ఇది ఆమె కెరీర్‌లోనే బిగ్గెస్ట్ ట్రాన్స్‌ఫర్మేషన్. ఇక నేడు రిలీజ్ చేసిన పోస్టర్ లో, ముఖ్యంగా ఓపెన్ టాప్ జీపుపై నిలబడి, జనం మధ్యలో అభివాదం చేస్తున్న లుక్ అదిరిపోయింది. ఆ కట్టుబొట్టు, ఆ సన్ గ్లాసెస్, ఆ బాడీ లాంగ్వేజ్ చూస్తుంటే, ఇది కేవలం హీరో పక్కన పాటలు పాడుకునే హీరోయిన్ పాత్ర కాదని, కథలో చాలా పవర్ ఉన్న రోల్ అని అర్థమవుతోంది. అందుకే మేకర్స్ ఆమె క్యారెక్టర్‌ను "ఫియర్స్ అండ్ ఫియర్‌లెస్" అని పిలుస్తున్నారు. డైరెక్టర్ బుచ్చిబాబు సానా తన గురువు సుకుమార్ స్టైల్‌లోనే, హీరోయిన్ పాత్రలను చాలా బలంగా డిజైన్ చేసినట్లున్నాడు. 'ఉప్పెన'లో 'బేబమ్మ' పాత్రకు ఎంత ఇంపార్టెన్స్ ఇచ్చాడో, ఇప్పుడు 'అచ్చియమ్మ' పాత్రను కూడా అంతే పవర్‌ఫుల్‌గా మలిచాడని ఈ లుక్ ప్రూవ్ చేస్తోంది. ఇది కేవలం లవ్ స్టోరీ కాదు, ఒక పల్లెటూరి సోషల్ డ్రామాలా కనిపిస్తోంది. బాలీవుడ్‌లో పీక్ స్టేజ్‌లో ఉన్న ఒక స్టార్ హీరోయిన్, సౌత్ సినిమాలో, అది కూడా పాన్ ఇండియా లెవల్‌లో ఇంత పూర్తిస్థాయి మాస్ రోల్ చేయడం పెద్ద ఛాలెంజ్. ఒకవేళ 'అచ్చియమ్మ' పాత్ర 'రంగస్థలం'లోని 'రామలక్ష్మి'లా పేలితే, జాన్వీ రేంజ్ ఇండియా వైడ్‌గా మారిపోతుంది. ఆమె కేవలం గ్లామర్ డాల్ కాదని, పెర్ఫార్మెన్స్‌తోనూ మెప్పించగలదని ప్రూవ్ చేసుకున్నట్లే. ఈ భారీ బడ్జెట్ సినిమాను వృద్ధి సినిమాస్, మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్నాయి. ఏఆర్ రెహమాన్ సంగీతంఅ అందిస్తున్న ఈ సినిమాకు రత్నవేలు లాంటి టాప్ టెక్నీషియన్స్ పనిచేస్తున్నారు. 2026 మార్చి 27న రానున్న ఈ సినిమాలో, చరణ్ మేకోవర్‌తో పాటు, 'అచ్చియమ్మ'గా జాన్వీ మాస్ పెర్ఫార్మెన్స్ కూడా నెవ్వర్ బిఫోర్ అనేలా ఉండనున్నట్లు అర్థమవుతుంది.

## నవంబర్ మోత మోగించేందుకు సిద్ధమా..?






స్టార్ సినిమాలకు మ్యూజిక్ అనేది చాలా ప్రాధాన్యత వహిస్తుంది. సాంగ్స్ తో కూడా రికార్డులు సృష్టించే సత్తా వారికి ఉంటుంది. స్టార్ సాంగ్ ఇలా రిలీజైతే చాలు అలా వైరల్ అవుతుంది. రీల్స్ తో సోషల్ మీడియా అంతా కూడా పిచ్చెక్కించేస్తారు. ఈమధ్యనే రిలీజైన మెగాస్టార్ చిరంజీవి మీసాల పిల్ల సాంగ్ అయితే సూపర్ హిట్ అయిపోయింది.

అందుకే నెక్స్ట్ రిలీజ్ కాబోతున్న సినిమాల సాంగ్స్ ని కూడా ఒక ప్లానింగ్ ప్రకారం రిలీజ్ చేయబోతున్నారు.


**రెబల్ స్టార్ ప్రభాస్ రాజా సాబ్..** ముందుగా అక్టోబర్ 23న రిలీజ్ చేయాలని అనుకున్న రెబల్ స్టార్ ప్రభాస్ రాజా సాబ్ ఫస్ట్ సింగిల్ నవంబర్ 5న రిలీజ్ ఫిక్స్ చేశారు. మారుతి డైరెక్షన్ లో తెరకెక్కుతున్న ఈ సినిమాకు థమన్ మ్యూజిక్ అందిస్తున్నాడు. రాజా సాబ్ సినిమాకు మ్యూజిక్ మరో హైలెట్ అయ్యేలా ఉ ఓడగా అందుకు తగినట్టుగానే థమన్ ట్రీట్ ఉంటుందని తెలుస్తుంది. ఈ సినిమాతో పాటుగా గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ పెద్ది సినిమా నుంచి కూడా ఫస్ట్ సాంగ్ నవంబర్ 8న ఏ.ఆర్.రెహమాన్ లైవ్ కన్సర్ట్ లో రిలీజ్ చేస్తున్నారు. రెహమాన్ ఆఫ్టర్ లాన్ టైం తెలుగులో చేస్తున్న సినిమా కాగా. చరణ్ తో తొలిసారి కలిసి చేస్తున్న ఆల్బం అవ్వడంతో ఈ ప్రాజెక్ట్ పై కూడా మ్యూజిక్ లవర్స్ స్పెషల్ ఇంట్రెస్ట్ చూపిస్తున్నారు. రెహమాన్ కంపోజింగ్ అంటే సాంగ్స్ గురించి డౌట్ పడాల్సిన అవసరం లేదంతే అనేలా తన బ్రాండ్ కొనసాగిస్తున్నాడు.

**థమన్ మ్యూజిక్ స్పీకర్స్ బ్లాస్ట్..** ఇక ఈ సినిమాతో పాటు డిసెంబర్ లో రిలీజ్ ప్లాన్ చేసిన అఖండ 2 సినిమా నుంచి నెక్స్ట్ సాంగ్ ని త్వరలో రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు. బాలయ్య సినిమాలకు థమన్ మ్యూజిక్ అంటే స్పీకర్స్ బ్లాస్ట్ అవ్వాల్సిందే. ఐతే అఖండ 2 సాంగ్స్ విషయంలో కూడా థమన్ స్పెషల్ ఫోకస్ చేశాడని తెలుస్తుంది. డిసెంబర్ లో అఖండ 2 రిలీజ్ ఉండగా ఈ మంత్ లో సినిమాకు సంబందించిన సాంగ్స్ ఇంకా ప్రమోషనల్ యాక్టివిటీస్ షురూ కానున్నాయి. వీటితో పాటుగా దళపతి విజయ్ జన నాయగన్ సినిమా నుంచి కూడా ఒక సాంగ్ రిలీజ్ కాబోతుంది. అనిరుద్ రవిచంద్రన్ మ్యూజిక్ కంపోజింగ్ లో ఈ సాంగ్ వస్తుంది. అసలైతే ఇప్పటికే జన నాయగన్ సాంగ్ రిలీజ్ అవ్వాల్సింది కానీ విజయ్ మీటింగ్ లో ప్రజల ప్రాణాలు కోల్పోవడం వల్ల సినిమా ప్రమోషన్స్ టైం తీసుకున్నారు. జన నాయగన్ సినిమా 2026 జనవరి 9న రిలీజ్ అవుతుంది. ఈ సినిమాను తెలుగులో కూడా సంక్రాంతికి రిలీజ్ చేస్తున్నారు. నవంబర్ నెల మొత్తం స్టార్ సినిమాల సాంగ్స్ తో మోత మిగించేందుకు వస్తున్నారు. ఈ మంత్ లో స్టార్ సినిమాలు రిలీజ్ లు లేవు.. కానీ స్టార్ సినిమాల సాంగ్స్ తో కిక్ ఇవ్వనున్నారు. ఫ్యాన్స్ అయితే ఈ సాంగ్స్ తోనే స్టార్ సినిమాలను ట్రెండింగ్ లో ఉంచాలని చూస్తున్నారు.

## వయసు పెరగడం వ్యాధిలా భావిస్తున్నారా?

ఒకప్పుడు హీరోయిన్ గా కొనసాగాలంటే? వయసు పరిమితులుండేవి. 40 దాటాక హీరోయిన్ అవకాశాలివ్వడానికి దర్శకులు ముందుకొచ్చే వారు కాదు. వారు రాసిన కథలు..పాత్రలు 30-35 ఏళ్ల మధ్యలో వయసుగల వారినే డిమాండ్ చేసేవి. దీంత ఆ మధ్యలో ఉన్న వారినే తీసుకునేవారు. 40 ఏళ్లు వచ్చాయంటే హీరోయిన్ ఛాన్స్ కష్టంగా కనిపించేది. అయితే నేడు సన్నివేశం మారింది. వయసుతో సంబంధం లేకుండా హీరోయిన్ ఛాన్స్ లు అందుకుం టున్నారు. 50 ఏళ్లు, 60 ఏళ్ల హీరో సరసన 25 ఏళ్ల నటి నటిస్తోంది. ఆ కాంబినేషన్ లో రొమాంటిక్ సన్నివేశాలు డిమాండ్ చేస్తే వాటికి కూడా వెనుకాడటం లేదు.

**దర్శకులు ఛాన్స్ తీసుకోవడంతోనే:** అప్పుడప్పుడు సోషల్ మీడియా వేదికగా విమర్శలు వ్యక్తమైనా? వాటిని పట్టించుకోకుండా పరిశ్రమలు ముందుకెళ్తున్నాయి. హీరోలకు కూతుళ్లు వయసున్న వారితో నటిస్తున్నా? విమర్శ అన్నది కొన్ని రోజులకే పరిమితం. ఆ తర్వాత మళ్లీ మామూలే. ఆ సంగతి పక్కన బెడితే తాజాగా వయసు గురించి మిల్కీ బ్యూటీ తమన్నా ఆసక్తికర వ్యాఖ్యలు చేసారు. నేడు 30 ఏళ్లు వయసున్న మహిళల పట్ల సానుకూల మార్పు కనిపిస్తోందంది. వయసులను దృష్టిలో పెట్టుకుని దర్శకులు పాత్రలు రాయడం సంతోషించ దగ్గ విషయమన్నారు.



**సహజంగా జరిగే ప్రక్రియ :** పరిశ్రమలో వచ్చిన మార్పులతో వయసు సంబంధం లేకుండా కొనసాగవచ్చు అని నమ్ముతున్నానన్నారు. అయితే అయితే కొందరు నటీమణులు మాత్రం వయసు పెరగడాన్ని ఓ వ్యాధిలా భావిస్తున్నారన్నారు. వయసు పెరిగితే ఏదో జరిగిపోతుందని భ్రమపడుతున్నారు. ఆ కారణంగా శరీరంలో ఎన్నో రకాల మార్పులొస్తున్నాయి. వయసు పెరిగింది అన్నది అప్పుడు ఇంకా తెలుస్తుంది. అలా ఎందుకు భయపడుతున్నారో తనకు అర్ధం కాలేదన్నారు. వయసు పెరగడం అన్నది ప్రతీ ఒక్కరి జీవితంలో సహజంగా జరిగే ప్రక్రియ. దాన్ని ఆస్వాదించాలన్నారు.

**పెళ్లైన భామలకు డిమాండ్ ఎక్కువే:** భయపడాల్సిన పని లేదన్నారు. ప్రస్తుతం హీరోయిన్ గా అవకాశాలు పెళ్లైన వారికి ఎక్కువగా వస్తోన్న సంగతి తెలిసిందే. పెళ్లి కాని భామలకంటే పెళ్లైన భామలకే పరిశ్రమలో డిమాండ్ కనిపిస్తోంది. వారైతే యువ హీరోలతో పాటు, సీనియర్ హీరోలకు యాప్ట్ అవుతారు? అన్న కోణంలో మేకర్స్ ఎంపిక చేస్తున్నారు. అప్పటికే నటనపై కొంత అనుభవం కూడా ఉండటంతో మేకర్స్ కు కొన్ని రకాల సన్నివేశాల పరంగా ఇబ్బందులు తప్పుతున్నాయి.

## బీచ్ ఒడ్డున గ్లామర్ తో ఆకట్టుకుంటున్న వేదిక!

నటి వేదిక ఎప్పుడు తన బోల్డ్ అందాలతో ఫాలోవర్స్ ని ఆకట్టుకునే పనిలోనే ఉంటుంది. అలా తాజాగా వేదిక సముద్రం వ్యూతో ఉన్న అందాలతో కుర్రకారుకి వలవేస్తోంది. ఈ మధ్యకాలంలో వేదిక ఎక్కువగా వెకేషన్ లోనే సందడి చేస్తోంది.రీసెంట్ గా వేదిక ఇన్స్టా ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. అందులో ఎక్కువగా సముద్రం, బీచ్ ఫోటోలే కనిపిస్తున్నాయి. తాజాగా వేదిక ఏజియన్ సముద్రం ఒడ్డున కూర్చున్న ఓ బికినీ ఫోటోని షేర్ చేసుకుంది. వైట్ కలర్ డ్రెస్ లో వేదిక తన అందాలతో కుర్రకారుకి గత్తర లేపుతోంది. ప్రస్తుతం వేదిక తన సోషల్ మీడియాలో షేర్ చేసిన ఆ ఒక్క ఫోటో ఇంటర్నెట్ ని షేక్ చేస్తోంది. ఈ ఫోటోలో వేదిక ఆత్మవిశ్వాసం ఆమె ఫిట్నెస్ చాలా క్లియర్ గా కనిపిస్తోంది. అలా తాజాగా సముద్రం ఒడ్డున కూర్చున్న వేదిక ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. అయితే ఈ ఫోటోకి క్యాప్షన్ గా "సూర్యుడు నా ఏకైక ఫిల్టర్" అని రాసుకొచ్చింది.. ప్రస్తుతం వేదిక గ్రీక్ వెకేషన్ లో ఉన్నట్టు అర్థమవుతుంది. రీసెంట్



గానే ఆమె మాల్దీవులకి వెకేషన్ కి వెళ్ళిన ఫోటోలను పంచుకుంది. తాజాగా గ్రీక్ వెకేషన్ లో ఉన్నట్టు తెలుస్తోంది. అలా సమయం దొరికితే చాలు వెకేషన్ లకు చెక్కేస్తూ అక్కడ వివిధ ప్రాంతాల్లో దిగిన ఫోటోలను తన సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకుంటుంది.అలాంటి వేదిక తాజా ఫోటో క్షణాల్లో వైరల్ అవ్వడంతో పాటు ఆమె అందానికి చాలామంది అభిమానులు కాంప్లిమెంట్స్ ఇస్తున్నారు. వేదిక సినిమాలు, పర్సనల్ విషయానికి వస్తే.. మహారాష్ట్రకు చెందిన వేదిక లండన్ లో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ లో ఎం.ఎస్.సి పూర్తి చేసి సినిమాల మీద ఉన్న ఇంట్రెస్ట్ తో ఇండస్ట్రీ లోకి ఎంట్రీ ఇచ్చింది. అలా మొదట వేదిక కాలేజ్ డేస్ లో ఉన్నప్పుడు ఒక వీడియో ఆల్బమ్ చేసింది. ఆ ఆల్బమ్ ద్వారా వేదికకి తమిళ సినిమాలో ఆఫర్ వచ్చింది. అలా తమిళంలో మద్రాసి,ముని సినిమాల ద్వారా ఎంట్రీ ఇచ్చి ఆ తర్వాత తెలుగు ప్రేక్షకులకు కూడా దగ్గర అయింది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536